ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
వరంగల్ fb.com/vaartha Digital
Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
11-8-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 192 పేజీలు: 8+16 వెల: 6.50



ప్రధాని మోడీతో పవార్ ఎన్సీపి ఎంపీల భేటీ 3
హైదరాబాద్‌లో కారు బీభత్సం.. జవాన్ మృతి 7


# రైతుల పంట పండాలి

## నదులు, చెరువుల్లో జలకళ వెల్లివిరియాలి

## సాగునీటి వనరులకు అత్యంత ప్రాధాన్యం: సిఎం

## సాగర్‌లో 'మహావరుణ యాగం' ఫలవంతం

## పూర్ణాహుతి నిర్వహించిన సిఎం రేవంత్ దంపతులు

## పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, కొండా సురేఖ, సీనియర్ నేత జానారెడ్డి తదితరులు



సోమవారం సాగర్‌లో నిర్వహించిన వరుణయాగం పూర్ణాహుతిలో పాల్గొన్న సిఎం రేవంత్ దంపతులు

**నల్గొండ ,ప్రతినిధి, ప్రభాతవార్త (నాగార్జునసాగర్):** తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని, ప్రతి రైతు ముఖంలో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని పేర్కొంటూ.. ప్రకృతి అనుగ్రహంతో రాష్ట్రంలో సాగునీటి కొరత లేకుండా, జలాశయాలు నిండి, రైతాంగానికి నీటి భరోసా కలగాలని ఆకాంక్షించారు. దేశ, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ నాగార్జునసాగర్‌లో కృష్ణానది తీరాన రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన మహా వరుణ యాగంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొని పూర్ణాహుతి నిర్వహించారు. తెలంగాణలోనే కాకుండా కృష్ణా, గోదావరి నదుల ఎగువ పరీవాహక ప్రాంతాల్లోనూ సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు జలకళతో ఉప్పొంగాలని సీఎం ఆకాంక్షించారు. నాగార్జునసాగర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని >>2

# 'పాలమూరు'కు జాతీయ హోదా రాదా?



## ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదన లేదన్న కేంద్ర మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి



**హైదరాబాద్,ఆగస్టు 10,ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చే ప్రతిపాదన ఏదీ ప్రస్తుతానికి మా పరిశీలనలో లేదని కేంద్రప్రభుత్వం రాజ్యసభలో ఎంపి రేణుకాచౌదరి అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం కేంద్ర మంత్రి రాజ్‌భూషన్‌చౌదరి తెలిపారు. కృష్ణా జలాల పంపిణీ,వినియోగం అంతరాష్ట్ర వివాదాలకు చెందిన అనేక అంశాలు ట్రిబ్యునల్ తీర్పులు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. కృష్ణజలాల వివాదాల ట్రిబ్యునల్ అవార్డు జరగననందున టెక్నో ఎకనామిక్ అప్రైజల్ ప్రక్రియ ప్రస్తుతం చేపట్టడానికి వీలులేదని కేంద్రం అశక్తత వ్యక్తపరిచింది.తెలంగాణ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సమగ్రప్రణాళికతో రావాల్సి ఉందంటూ డిపిఆర్‌ను కూడా కేంద్రం వెనక్కి పంపించింది. కృష్ణా నీటి కేటాయింపులపై స్పష్టత వచ్చే వరకు ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందించే విషయంలో కూడా నిర్ణయం తీసుకోలేమని తెలిపింది. కేంద్ర జల సంఘం నిబంధనలకు అనుగుణంగాఅనుమతులు సాధించాక జాతీయహోదాపై ప్రాజెక్టు సాధికార కమిటి పరిశీలిస్తోందని తెలిపింది.



# 73.95 లక్షల ఓట్లు తొలగింపు

## 'సర్'లో ముగిసిన కీలక దశ

## డిజిటైజేషన్‌లో యాదాద్రి భువనగిరి టాప్

## 12న ఓటర్ల ముసాయిదా ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38, 26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95, 954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30, 494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 78.26శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.31 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.53 శాతం, సూర్యాపేట 90. 45 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,89,214 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.89 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి >>2

## మా మూడు డిమాండ్లపై


# స్పష్టత ఇవ్వండి

## అప్పుడే లోక్‌సభ ప్రతిష్టంభనకు ముగింపు: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

## సభలో అమిత్‌షా వివరణకు మేం సిద్ధమే: కిరణ్ రిజుజు



**న్యూఢిల్లీ,ఆగస్టు 10:** పార్లమెంట్‌లో కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరపడాలంటే ప్రతిపక్షం పేర్కొన్న మూడు డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం పునరుద్ఘాటించారు. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించిన విద్యార్థుల ఆందోళనల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న కాల్పులపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయడం, విద్యార్థుల ఆందోళనల నిర్వహణపై ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పడం, అయోధ్య రామ మందిరంలో జరిగినట్లు ఆరోపిస్తున్న చోరీపై బాధ్యత వహించడం తమ ప్రధాన డిమాండ్లని తెలిపారు. విద్యార్థులపై కాల్పులు, బలప్రయోగానికి ఎవరు అనుమతిచ్చారో అమిత్ షా స్పష్టం చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ ప్రయోగించారని, విద్యార్థులపై గోళ్లతో కూడిన లాఠీలతో దాడులు జరిగాయని ఆరోపించారు. కాల్పులకు ఆదేశాలు ఇచ్చారా లేదా అన్నది హోంమంత్రి తేల్చి చెప్పాలని అన్నారు. కాల్పులకు ఆదేశాలు ఇచ్చి ఉంటే విద్యార్థులపై కాల్పులకు బాధ్యత వహించాల్సి ఉంటుందని, తెలియకపోతే అది అసమర్థతకు నిదర్శనమని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రభుత్వం సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. విద్యార్థుల ఆందోళనల నిర్వహణపై ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అమిత్ షా సాధారణ అంశాలపై ప్రసంగం చేయడం తమ డిమాండ్ కాదని, నిర్దిష్ట అంశాలపై స్పష్టమైన సమాధానాలు కావాలని చెప్పారు. అయోధ్య రామ మందిరంలో జరిగినట్లు >>2



## కొలంబియాలో భూకంపం

# 100 మంది పైగా మృతి?

## రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతగా నమోదు

**బొగోటా,ఆగస్టు 10:** పశ్చిమ కొలంబియాలో సంభవించిన 7.4 తీవ్రతతో కూడిన భారీ భూకంపంలో మృతుల సంఖ్య 100కి చేరింది. భూకంప ధాటికి పలు భవనాలు కూలిపోగా, శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. సోమవారం హటాత్తుగా సంభవించిన ఈ భూప్రకంపనలతో ప్రజలు భీతిల్లి వీధుల్లోకి పరుగులు తీసారు. అనేక భవనాలు నేల మట్టం అయ్యాయి. ప్రజలు పరుగులుతీస్తూ కొందరు భవనాల శిథిలాల్లోనే చిక్కుకున్నట్లు స్థానిక అధికారుల సమాచారం. సహాయక సిబ్బంది శిథిలాలను తొలగిస్తూ ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలిస్తున్నారు. భూకంపం కారణంగా ఇళ్ల నుంచి ప్రజలు బయటకు పరుగులు తీశారు. రాజధాని బొగోటాలోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. అమెరికా జియోలాజికల్ సర్వే, కొలంబియా భూగర్భ శాస్త్ర అధికారులు తెలిపిన వివరాల ప్రకారం చోకో ప్రాంతంలోని సుమారు 4,800 మంది జనాభా ఉన్న శాన్‌జోసేడెల్ పాల్మార్ >>2

## పిఎం ఏక్తామాల్ టెండర్లలో భారీ

# కుంభకోణం

## అక్రమాలపై స్వతంత్ర విచారణ జరిపించాలి

## కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసిన కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు10:** హైదరాబాద్‌లోని రాయదుర్గ్‌లో ప్రతిపాదించిన పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ టెండర్లలో తీవ్రమైన ఆర్థిక అక్రమాలు, భారీ కుంభకోణం జరిగిందని బిఆర్‌ఎస్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. యూనిటీ మాల్ టెండర్లలో కావాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమమైన, అనుమానాస్పద నిబంధనలు పెట్టి, ప్రజా వనరులను తాకట్టు పెట్టి ప్రైవేటు డెవలపర్‌కు విపరీతమైన లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపిస్తూ, ఆ టెండర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ ఒక లేఖ రాశారు. ప్రాజెక్టుపై ఎటువంటి తుది నిర్ణయాలు తీసుకోకముందే, ప్రవేట్ సంస్థల జేబుల్లోకి వెళ్లే కేంద్ర నిధుల విడుదలను తక్షణమే నిలిపివేయాలని, మొత్తం వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు రూ.2,059.81 కోట్లు అని, దీనిలో భారీ అక్రమాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాల్పడుతుందని కేటీఆర్ తన లేఖలో వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.202 కోట్ల కేంద్ర సహాయం మంజూరైందని కేటీఆర్ గుర్తుచేశారు. రాయదుర్గ్‌లోని అత్యంత విలువైన 6.30 ఎకరాల స్థలంలో, సుమారు 27 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో (బిల్ట్-ఆప్ ఏరియా) ఈ ప్రాజెక్టును తలపెట్టారని తెలిపారు. ఈ టెండర్‌లో కమర్షియల్ స్థలం కేటాయింపు తీవ్ర అనుమానాలకు తావిస్తోందని కేటీఆర్ ఆక్షేపించారు. ప్రాజెక్టులో ప్రభుత్వానికి దక్కే కనీస వాటా కేవలం 9 లక్షల చదరపు అడుగులు కాగా, ప్రైవేటు డెవలపర్‌కు మాత్రం కనీసం 18 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారని ఎత్తిచూపారు. అంటే, విలువైన ప్రజా భూమిని, భారీ ప్రజాధనాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ ప్రైవేటు డెవలపర్‌కు ప్రభుత్వం కంటే కనీసం రెట్టింపు స్థలాన్ని కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎంపిక చేసిన డెవలపర్ కన్సార్టియంలో వంశీరామ్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ లీడ్ మెంబర్‌గా, అపర్ణ ఇన్ఫ్రాహౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామిగా ఉన్నాయని కేటీఆర్ వివరించారు. టెండర్ మూల్యాంకనం ప్రకారం.. ఈ కన్సార్టియం ప్రభుత్వానికి లభించే కనీస వాటా కంటే అదనంగా 18,000 చదరపు అడుగుల గ్రేడ్-ఎ కమర్షియల్ స్థలాన్ని ఇచ్చేందుకు ప్రతిపాదించిందని, దీంతో ప్రభుత్వానికి దక్కే మొత్తం నిర్మిత ప్రాంతం 9.18 లక్షల చదరపు అడుగులకు చేరుతుందని తెలిపారు. అయితే, ప్రైవేటు డెవలపర్‌కు >>2


పిఎం ఏక్తా మాల్ టెండర్లలో ఎటువంటి అవకతవకలు జరగలేదు: శ్రీధర్‌బాబు 2


## పాలమూరు బెటాలియన్ దాటి 28 కి.మీ. మేర నిర్మించిన రహదారిని పరిశీలించిన డిజిపి ఆనంద్

## కాకరాల సమతకు రూ. 20 లక్షల చెక్ అందజేత

## లొంగిపోవాలని గణపతి దంపతులకు పోలీసుల పిలుపు



సోమవారం కర్రెగుట్టలో శాంతికపోతాలను ఎగురవేసిన డిజిపి ఆనంద్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు

## బుల్లెట్లు పేలిన నేలలో

# శాంతి మంత్రం!

## కర్రెగుట్టల్లో వడివడిగా అభివృద్ధి పనులు

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో, ప్రభాతవార్త, ఆగస్టు 10:** ఆపరేషన్ కగార్‌తో తెలంగాణ ఆంధ్ర చత్తీస్గడ్ సరిహద్దు ప్రాంతాలలో ఉన్న కర్రెగుట్టలను జల్లెడ పట్టిన భద్రతా బలగాల కృషి వమ్ము కాలేదు. నాడు కర్రెగుట్టల దండకారణ్యంలో తుపాకుల మోతలతో తూటాల వర్షం కురిసి రక్తమోడిన నేల నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో లొంగిన మావోయిస్టుల కంచుకోటలో నేడు అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. పామూనురు బెటాలియన్ ను అప్పటి డిజిపి బి.శివధర్ రెడ్డి సందర్శించి మారుమూల ప్రాంతాల అభివృద్ధి నాంది పలికితే.. సోమవారం కర్రెగుట్టల పర్యటనకు వచ్చిన డీజీపీ సివి ఆనంద్ మరో అడుగు ముందుకు వేసి పామూనురు బెటాలియన్‌ను దాటి చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28 కిలో మీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి కర్రెగుటలలో శాశ్వత అభివృద్ధికి అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. డీజీపిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కర్రేగుట్టల్లో ఆయన పర్యటించారు. ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్న డిజిపి జిల్లాలోనే బస చేసి సోమవారం ఉదయం పాముసూరు 39 సిఆర్పిఎఫ్ బేస్ క్యాంపునకు >>2



# మరుగుతున్న జార్ఖండ్

## పేపర్ లీక్‌పై రాంచీలో ఉధృతంగా ఆందోళనలు

## అసెంబ్లీకి విద్యార్థుల ర్యాలీ.. జలఫిరంగులతో పోలీసులు


**రాంచి, ఆగస్టు 10:** ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో విద్యార్థులఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాటడంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించారు. అయినా కొందరు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదలడం వీడియోల్లో >>2


ఎర్రకోటపై తొలిసారి 'వందేమాతరం' 5





స్వాతంత్ర్య వేడుకల్లో కొత్త క్రమం
జాతీయ గీతానికి ముందు ఆలాపన


ఓ రైతు పొలంలో దాచిన రూ. 5 లక్షల నోట్ల కట్టలు వృథా



దొంగలకు భయపడితే.. చెదలు కొట్టేసాయి.. 2






సోమవారం అండమాన్ జైలులో వీరసావర్కార్‌కు నివాళులర్పిస్తున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

## 14న రాష్ట్ర కేబినెట్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు10:** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 14వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనాపరమైన కీలక నిర్ణయాలపై కేబినెట్ భేటీలో చర్చించనున్నట్లు తెలిసింది.

## మరుగుతున్న జార్ఖండ్

>> కనిపించింది. నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల మార్చ్ నేపథ్యంలో రాంచీలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, హైవేలపై బస్సులు, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. రాంచీలో చాలా పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

## 100 మంది పైగామృతి?

>> సమీపంలో భూకంపం సంభవించింది. బొగోటాకు ఇది సుమారు 400 కిలోమీటర్ల దూరంలో ఉంది. భూకంప కేంద్రం 107 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎస్‌జిసి వెల్లడించింది. పొరుగున ఉన్న ఈక్వెడార్, పనామాల్లోనూ ప్రకంపనలు అనిపించాయి. అయితే అక్కడ పరిమిత నష్టం మాత్రమే నమోదైంది. పలు నగరాల్లో భారీ నష్టంపశ్చిమ కొలంబియాలో భూకంపం తీవ్ర నష్టం కలిగించింది. పెరీరాలో 18 మంది, మానిజలెస్‌లో మరో ఇద్దరు మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. కాలిలో పలు భవనాలు కూలిపోగా, కనీసం 19 భవనాల్లో ప్రజలు చిక్కుకున్నట్లు మేయర్ అలెజాంద్రో ఎడెర్ తెలిపారు. క్విబ్డోలోనూ భారీగా భవనాలు దెబ్బతిన్నాయి. పెరీరా, కాలి, క్విబ్డో నగరాల్లో ఇళ్లు, చిన్న భవనాలు కూలిపోయిన దృశ్యాలు స్థానిక మీడియాలో ప్రసారమయ్యాయి. మానిజలెస్‌లోని నియోగోతిక్ కేథడ్రల్‌లోని ఓ టవర్ కూలి ప్రధాన ప్రార్థనా మందిరంలో పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందినట్లు మేయర్ జార్జ్ ఎడువార్డో రోజాస్ తెలిపారు. భూకంపం అనంతరం ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్లలోకి వెళ్లకుండా బయటే ఉండాలని ఆయన సూచించారు.

**సహాయక చర్యలు ముమ్మరం**

చోకో గవర్నర్ నూబియా కొర్డోబా మాట్లాడుతూ ప్రాంతీయ రాజధాని క్విబ్డోలో పలువురు గాయపడటంతో పాటు భవనాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించేందుకు అత్యవసర బృందాలు రంగంలోకి దిగాయి. నష్ట తీవ్రతను అంచనా వేస్తూ సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు.కొలంబియా అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా శాన్ జోసే డెల్ పాల్మార్‌లో సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మీరు ఒంటరిగా లేరు. ప్రభుత్వం ఇక్కడే ఉంది చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.కొలంబియాలోని మధ్య, పశ్చిమ ప్రాంతాల్లో భూకంపాలు సాధారణమే అయినప్పటికీ, 6కి పైగా తీవ్రతతో కూడిన భూకంపాలు అరుదుగా సంభవిస్తాయి. 1999లో ఆర్మేనియా సమీపంలో 6.2 తీవ్రతతో సంభవించిన భూకంపంలో 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

## మా మూడు డిమాండ్లపై స్పష్టత ఇవ్వండి

>> ఆరోపిస్తున్న చోరీపై కూడా ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని డిమాండ్ చేశారు. ప్రధానికి అత్యంత సన్నిహితులైన వ్యక్తులు రామ మందిరంలో చోరీకి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.గత 15 రోజులుగా ప్రధాని, హోంమంత్రి పార్లమెంట్‌కు వచ్చి ఈ అంశాలపై సమాధానం చెప్పేందుకు ముందుకు రాలేదని రాహుల్ ఆరోపించారు. ముందుగా కాల్పులకు ఎవరు అనుమతిచ్చారో స్పష్టత ఇవ్వాలని, ఆ తర్వాతే ఇతర అంశాలపై చర్చ జరగాలని అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన అంశాలపై పూర్తి స్థాయి, సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు.హోంమంత్రి ప్రకటన, చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించకుండా సమాధానాన్ని వినాలని రిజిజు కోరారు. చర్చ ప్రారంభమైన తర్వాత అంశంపై సమగ్రంగా చర్చించవచ్చని తెలిపారు.కొనసాగుతున్న ప్రతిష్టంభనప్రభుత్వం సమగ్ర చర్చకు సిద్ధంగా ఉందని చెబుతుండగా, ప్రతిపక్షం మాత్రం నిర్దిష్ట ప్రశ్నలకు ముందుగా సమాధానాలు ఇవ్వాలని పట్టుబడుతోంది. దీంతో పార్లమెంట్‌లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. అమిత్ షా ప్రకటనతో ఇరు పక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు ముగింపు వచ్చి తదుపరి చర్చలకు వీలవుతుందా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

దొంగలకు భయపడితే..

## చెదలు కొట్టేసాయి..

### ఓ రైతు పొలంలో దాచిన రూ. 5 లక్షల నోట్ల కట్టలు వృథా

**జైపూర్, ఆగస్టు 10:** దొంగల భయంతో ఇంట్లో డబ్బు ఉంచలేక పొలంలో పాతిపెట్టాడు ఓ రైతు. ఇల్లు కట్టుకోవడానికి దాచిన రూ.5 లక్షలు ఏడాది తర్వాత అనూహ్యంగా బయటపడ్డాయి. అప్పటికే చెదలు పట్టడంతో అవి ముక్కలుగా మారిపోయాయి. బ్యాంకుకు తీసుకెళ్లినా డబ్బు మార్చుకోలేకపోయాడు. రాజస్థాన్‌కు చెందిన ఈ రైతు ఏడాది క్రితం ఓ స్థలాన్ని విక్రయించాడు. దాంతో రూ.5 లక్షలు వచ్చాయి. ఆ డబ్బుతో ఇల్లు నిర్మించుకోవాలని అనుకున్నాడు. నగదు ఇంట్లో ఉంటే చోరీకి గురయ్యే అవకాశం ఉందని భావించాడు. అవి ఖర్చు కాకూడదని కూడా నిర్ణయించుకున్నాడు. దీంతో డబ్బును పాలిథీన్ సంచిలో పెట్టి పొలంలో గుంత తీసి పాతిపెట్టాడు. కొంతకాలానికి డబ్బు ఎక్కడ దాచాడో రైతు మర్చిపోయాడు. మద్యం తాగే అలవాటు, మతిమరుపు కారణంగా ఆ ప్రదేశాన్ని గుర్తించలేకపోయాడు. పలుసార్లు పొలంలో వెతికినా డబ్బు దొరకలేదు. చివరకు భార్య, కుమారులకు విషయం చెప్పాడు. మొదట వారు నమ్మలేదు. తర్వాత పొలంలో పలుచోట్ల తవ్వి చూశారు. అయినా ఫలితం లేకపోయింది. ఇటీవల వర్షాకాలం సాగు పనుల కోసం పొలాన్ని సిద్ధం చేస్తుండగా పాలిథీన్ సంచి మట్టిలో నుంచి బయటకు వచ్చింది. కంచెను బాగుచేస్తున్న రైతు భార్య, కుమారుడు ఆ సంచిని గుర్తించారు. తెరిచి చూడగా అందులో నగదు కనిపించింది. కానీ నోట్లు మొత్తం చెదలు కొరికేయడంతో చిరిగిపోయి ముక్కలుగా మారాయి. మిగిలిన డబ్బును మార్చుకోవచ్చేమోనని కుటుంబం పట్టణంలోని ఎస్‌బీఐ శాఖకు వెళ్లింది. నోట్ల పరిస్థితి దారుణంగా ఉండటంతో బ్యాంకు సిబ్బంది వాటిని తీసుకోలేదు. దీంతో జిల్లా ప్రధాన ఎస్‌బీఐ శాఖను ఆశ్రయించారు. అక్కడ కూడా వారికి నిరాశే ఎదురైంది.

## వారం - వర్జ్యం

11-08-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.చతుర్దశి రా.1.54 న.పునర్వసు ఉ.10.10
వ.సా.5.27-సా.6.54
దు.1. ఉ.8.23-ఉ.9.14
దు.2. రా.11.40-రా.12.31
రాహు. మ.3.00-సా.4.30 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** వచ్చిన ఒక సదవకాశమును సద్వినియోగ పరచుకోగలిగితే మేలు జరుగుతుంది. మిత్రుల కలయిక.

**వృషభం :** విధుల నిర్వహణలో గానీ, వ్యాపారములో గానీ, మంచి మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం :** రాజకీయములు, సంఘములు, యూనియన్లు మొదలగు కార్యములకు అనుకూలం. కాంట్రాక్టులు లభిస్తాయి.

**కర్కాటకం :** బంధువులతో కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయ సందర్శన చేస్తారు. ఆర్థికంగా మెరుగుపడుతుంది.

**సింహం :** మీరు చేపట్టే కార్యక్రమములకు చిన్న చిన్న ఆటంకములు, ఎదురు అవుతాయి. వాహనయోగం కలదు.

**కన్య :** మీ అభిప్రాయములను కొన్ని సలహాలను ఉన్నతాధికారులు సైతం పాటించడం మీకు సంతృప్తిని కలిగిస్తుంది.

**తుల :** గతములో మీరు పోగొట్టుకున్న ఉద్యోగమును తిరిగి పొందగలుగుతారు. ఆస్తి విషయంలో ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం :** మీ అధికార పరిధి, ఆర్థిక స్థితిగతులు మంచి ఫలితములనిస్తాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు :** చిన్ననాటి స్నేహితులను, తండ్రి సమకాలికులను కలుసుకొనుట జరుగుతుంది స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం :** అవకాశము ఉండీ సమాచారము అందని లోపము వలన ఆత్మీయులకు సాయపడలేనందుకు విచారిస్తారు.

**కుంభం :** సహోదర వర్గముతో ఏకత్వమును సాధించు యత్నములు ఓ దశకు చేరుకుంటాయి. రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు.

**మీనం :** ముఖ్యమైన కార్యక్రమముల చర్చలు, అమలు చేయు పనులు వాయిదాపడతాయి. సోదరుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రైతుల పంట పండాలి

>> జలాశయాలు, చెరువులు నిండాలని, భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి మరింత నీటి భరోసా కలగాలని కోరుకున్నారు. వానాకాలం పంటలు సమృద్ధిగా పండి రైతాంగం ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షి ంచారు. ప్రకృతి అనుగ్రహంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం కూడా ఎంతో ముఖ్యమని ప్రభుత్వం భావిస్తోందని సీఎం తెలిపారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి వనరుల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో వ్యవసాయం అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, రైతుల జీవితాల్లో సంతోషం వెల్లివిరిస్తేనే రాష్ట్రం నిజమైన సుభిక్షత సాధిస్తుందని సీఎం ఆకాంక్షి ంచారు. యాదగిరిగుట్ట శ్రీ లక్షీ ్మనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నలుమూలల నుంచి వచ్చిన 108 మంది ఋత్వికులు, అర్చకుల సమక్షంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య వరుణ యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున 4.05 గంటలకు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా యాగం ప్రారంభమైంది. గోపూజతో ప్రారంభమైన యాగంలో యాగ ప్రదక్షి ణ, పుణ్యాహవచనం, అంకురార్పణం, ఋష్యశృంగ పూజ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కృష్ణానది ఒడ్డున చతుర్వేద పారాయణంతో వేద పండితులు, ఋత్వికులు యాగాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు సస్యశ్యామలంగా పండాలని, రైతాంగం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షి స్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ప్రతి నీటి చుక్కను రైతు ప్రయోజనాలకే వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురవడం రైతాంగానికి, సాగునీటి భద్రతకు అత్యంత కీలకమన్నారు. ప్రతి నీటి చుక్కను రైతాంగ ప్రయోజనాల కోసం బాధ్యతతో వినియోగిస్తున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా నిర్వహిస్తూ వానాకాలం పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణలో మాత్రమే కాకుండా కృష్ణా, గోదావరి నదుల ఎగువ పరీవాహక ప్రాంతాల్లోనూ సమృద్ధిగా వర్షాలు కురవాల్సిన అవసరం ఉందన్నారు. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు గోదావరి ఎగువ ప్రాంతాల్లో మంచి వర్షాలు కురిసి సమయానుకూలంగా ప్రవాహాలు వస్తే నాగార్జునసాగర్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర జలాశయాలకు నీటి భరోసా మరింత పెరుగుతుందని తెలిపారు రాష్ట్రంలో రైతాంగం సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. వర్షాలు సమృద్ధిగా కురిసి జలాశయాలు నిండి, ప్రతి ఎకరానికి సాగునీరు అందాలనే ఉన్నత సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ యాగం నిర్వహించామని అన్నారు. వర్షాలు బాగా కురిసి పంట దిగుబడులు పెరగాలని, రైతన్నల ముఖాల్లో ఆనందం వెల్లివిరియాలన్నదే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలందరిపై ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నిండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ తదితరులతో కలిసి ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 3.24 గంటలకు జరిగిన మహా పూర్ణాహుతి కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. యాదగిరిగుట్ట శ్రీ లక్షీ ్మనరసింహస్వామి దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దంపతులకు పూర్ణకుంభంతో, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం దంపతులు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని యాగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, ప్రభుత్వ విప్ లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, ప్రేమ్ కరణ్‌రెడ్డి, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, కార్పొరేషన్, మున్సిపల్ చైర్మన్లు, పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలోని మత్స్యకారులకు గుడ్ న్యూస్

### రూ.5లక్షల ప్రమాద బీమా కల్పిస్తూ సర్కార్ కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు10:** తెలంగాణ రాష్ట్రంలోని మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 4.21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా సౌకర్యం కలగనుంది. ప్రమాదవశాత్తు మరణం, వైకల్యం సంభవిస్తే రూ.5 లక్షల వరకు బీమా అందనుంది. ఈ ఏడాది(2026) జూన్ 1 నుంచే బీమా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 18 నుంచి 70 ఏళ్ల వారికి ఇది వర్తిస్తుంది. పథకానికి 4,21,767 మంది రిజిస్టర్ అయ్యారు. కేంద్రం,రాష్ట్రం 60:40 నిష్పత్తిలో ప్రీమియం చెల్లిస్తాయి. బీమా ప్రీమియం చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా మత్స్యశాఖ రూ.1.34 కోట్లు ఇప్పటికే ఇన్యూరెన్స్ కంపెనీకి చెల్లించింది. చేపల వేటకు వెళ్లిన సందర్భాలలో లేదా ప్రమాదవశాత్తు మరణించినా,శాశ్వత సంపూర్ణ వైకల్యం సంభవించినా ఆ కుటుంబానికి రూ.5లక్షల పరిహారం లభిస్తుంది. ప్రమాదాల వల్ల పాక్షిక అంగవైకల్యం ఏర్పడితే రూ.2.50లక్షల వరకు బీమా రక్షణ అందుతుంది. చికిత్సకు రూ.25000 వరకు అందిస్తారు. ప్రమాదకర పరిస్థితుల్లో నీటి వనరుల వద్ద వృత్తిని కొనసాగించే మత్స్యకారులకు ప్రమాద బీమా ఎంతో ధైర్యాన్ని ఇస్తుందని, బాధితుల కుటుంబాలకు ఇది కొండంత అండగా నిలుస్తుందని మత్స్యకార సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



సోమవారం పార్లమెంటు వద్ద ఆందోళన చేస్తున్న ప్రియాంక గాంధీ తదితర విపక్ష ఎంపీలు

## బుల్లెట్లు పేలిన నేలలో శాంతి మంత్రం!

>> చేరుకున్న ఆయన పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అక్కడి నుంచి కర్రేగుట్టల్లో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. పాముసూరు, చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి అక్కడ జెండా ఎగురవేసి, శాంతికపోతాలని గాల్లోకి వదిలారు. ఈ క్రమంలో అక్కడ పనుల్లో అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.పాముసూరులో నివాసం ఉంటున్న గుత్తి కోయలకు బియ్యం, దుప్పట్లు అందజేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మావోయిస్టుల అణచివేతలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి వ్యూహాత్మకంగా అడుగులు వేశామని తెలిపారు. మావోయిస్టుల కంచుకోటలుగా ఉన్న ప్రాంతాలను ఖాళీ చేయించామని, కొందరు ఎన్కౌంటర్లలో మృతి చెందగా.. ప్రభుత్వం తీసుకొచ్చిన పునరావాస విధానాలతో భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కూడా అందించామని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతం అరణ్య ప్రాంతమైనప్పటికీ అటవీశాఖతో కలిసి చూడదగ్గ ప్రదేశాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని డీజీపీ వెల్లడించారు.

**40 ఏళ్ల మావోయిస్టు జీవితం.. జనజీవన స్రవంతిలోకి..**

దాదాపు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో అండర్‌గ్రౌండ్‌లో కొనసాగిన సీపీఐ (మావోయిస్టు) సీనియర్ నాయకురాలు కాకర్ల సమత అలియాస్ మాధవి, షకీలా, దుర్గా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ములుగులో డీజీపి సీవీ ఆనంద్ విలేకరుల సమావేశంలో ఆమె నేపథ్యం, పార్టీ బాధ్యతలు, కుటుంబ వివరాలు, ప్రభుత్వం అందిస్తున్న పునరావాస సదుపాయాలను వెల్లడించారు. 1985లో వైజాగ్ ప్రాంతంలో నక్సలైట్ కార్యకలాపాలకు ప్రభావితమైన సమత అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లినట్లు డీపిజీ తెలిపారు. అప్పటి నుంచి సుమారు 40 ఏళ్లపాటు వివిధ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీకి పనిచేశారన్నారు. హైదరాబాద్ కమిటీలో సుమారు పదేళ్లు, నల్లమలలో నాలుగేళ్లు, ఉత్తరప్రదేశ్ ఏరియా కమిటీలో రెండేళ్లు, గుజరాత్ గోల్డెన్ కారిడార్ కమిటీ' లో రెండేళ్లు, మహారాష్ట్ర ఏరియా కమిటీలో ఐదేళ్లు, కర్ణాటక-మహారాష్ట్ర ఉమ్మడి కమిటీలో పదేళ్లు పనిచేసినట్లు వివరించారు.

**సరెండర్ క్యాడర్‌కు ప్రభుత్వం అండ**

మావోయిస్టుల పునరావాసంలో తెలంగాణ ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తోందని డిజిపి సీవీ ఆనంద్ తెలిపారు. సరెండర్ అయిన వారికి ఆర్థిక సాయం, సామాజికంగా స్థిరపడేందుకు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి హామీ మేరకు ఉచిత వైద్య చికిత్స కోసం ఆరోగ్య రక్షణ కార్డులు జారీ చేసి పంపిణీ చేసినట్లు వెల్లడించారు. పునరావాస విధానం కింద ఇప్పటికే 23 మంది సరెండర్ అయిన మావోయిస్టులకు దాదాపు రూ.2 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించినట్లు డిజిపి తెలిపారు. సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీ, పార్టీ మెంబర్ లేదా ఇతర క్యాడర్ అనే తేడా లేకుండా సరెండర్ తర్వాత సాధారణ జీవితంలో స్థిరపడేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు.

**గణపతి దంపతులకు పోలీసుల పిలుపు**

మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష ్మణరావు అలియాస్ గణపతి, ఆయన భార్యతో పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న సీనియర్ నాయకత్వం హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు. కాగా మావోయిస్టు కార్యకలాపాలకు గతంలో కీలకంగా ఉన్న ప్రాంతం కావడంతో హైదరాబాద్‌కు బదులుగా ములుగులో కార్యక్రమం నిర్వహించినట్లు డిజిపి సివి ఆనంద్ తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య దట్టమైన అటవీ ప్రాంతం గతంలో మావోయిస్టు కార్యకలాపాలకు కారిడార్‌గా ఉండేదని, ఈ ప్రాంతంలో పర్యటించి సరెండర్ క్యాడర్‌తో నేరుగా మాట్లాడినట్లు చెప్పారు. వారి సమస్యలు, పునరావాస విధానంలోని లోపాలు, కేసుల సమస్యలను తెలుసుకున్నామని, అవసరమైతే కేంద్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.

## పిఎం ఏక్తా మాల్ టెండర్లలో ఎటువంటి అవకతవకలు జరగలేదు: శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు10:** "పీఎం ఏక్తా మాల్ టెండర్లపై కేటీఆర్ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఐటీ,పరిశ్రమలు,అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం కేటీఆర్ ఆడుతున్న పొలిటికల్ డ్రామా ఇది అని వ్యాఖ్యానించారు. పీఎం ఏక్తా మాల్ టెండర్లలో ఎటువంటి అవకతవకలు జరగలేదు. పూర్తి నిబంధనల ప్రకారమే అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియ జరిగిందన్నారు. పిఎం ఎక్తా మాల్ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లు,ఫైనాన్షియల్ మోడల్, డిపిఆర్ సహా పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి ఇవ్వాలని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ అధికారులను ఆదేశించామని చెప్పారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులపై కేటీఆర్ రాజకీయం సరికాదన్నారు. కేంద్ర నిధులతో పీఎం ఏక్తా మాల్ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుందని, ఇప్పటికైనా కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## 73.95 లక్షల ఓట్లు తొలగింపు

>> స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 65.16 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.43 శాతం, జగిత్యాల జిల్లాలో 89.61 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు.

కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆతర్వాత నెలరోజులపాటు(సెప్టెంబర్ 16 వరకు) అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. ఎన్యుమరేషన్ ఫారాల్లో 2002ఎస్ఐఆర్ వివరాలు లేకుంటే నోటీసులిచ్చే అవకాశం ఉంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

## పిఎం ఏక్తామాల్ టెండర్లలో భారీ కుంభకోణం

>> మాత్రం కనీసం 18 లక్షల చదరపు అడుగుల స్థలంతో పాటు, భవిష్యత్తు ప్రణాళికలు లేదా పర్మిసబుల్ ఎఫ్ఎస్ఐ ద్వారా వచ్చే అదనపు ప్రాంతాన్ని కూడా పొందే హక్కును కల్పించారని పేర్కొన్నారు.

అంతేకాకుండా, ప్రాజెక్ట్ సిద్ధం చేయడం, కన్సల్టెన్సీ, సర్వేలు, అనుమతులు, సైట్ ప్రిపరేషన్ వంటి ప్రాథమిక పనులకు ఇప్పటికే చేసిన ఖర్చును ఈ నిధుల నుంచి సర్దుబాటు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారని కేటీఆర్ తెలిపారు. ప్రజాధనాన్ని కేటాయించే ముందు ఈ ఆర్థిక నమూనాపై స్వతంత్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందన్నారు. అనుమానాస్పద టెండర్లను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర సహాయాన్ని లేదా పీఎం ఏక్తా మాల్ అనే బ్రాండ్ పేరును కవచంగా వాడుకుంటున్నదని కేటీఆర్ హెచ్చరించారు. ఒక ప్రతిష్టాత్మకమైన పేరు ఉన్నంత మాత్రాన ఒక అవినీతి ఒప్పందం పారదర్శకంగా మారిపోదని వ్యాఖ్యానించారు. ప్రజా భూమి, ప్రజాధనం, విలువైన కమర్షియల్ హక్కులు ఉన్నచోట పరిపూర్ణమైన పారదర్శకత, స్వతంత్ర విచారణ ఉండితీరాలని స్పష్టం చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఆగస్టు 15 తర్వాత పోరాటం: రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు10:** హైడ్రా పనితీరుపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అధికారులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని,న్యాయస్థానాలను సైతం పక్కదారి పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సల్కమ్ చెరువులో అక్రమ నిర్మాణాలపై స్పష్టమైన ఆధారాలు,కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ హైడ్రా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాయలంలో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు.పెద్దలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం అన్నట్లుగా అధికారుల తీరు ఉందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా బిజెపి చూస్తూ ఊరుకోదన్నారు. ప్రజా ధనాన్ని ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు,కబ్జాలపై పోరాటాన్ని ఉధృతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆగస్టు 15 తర్వాత హైడ్రా,క్యూర్ పరిధులు,బాధ్యతలపై ప్రత్యేక సెమినార్ నిర్వహించనున్నామని తెలిపారు. సెమినార్ అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలపై,కబ్జాలకు వ్యతిరేకంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని చెప్పారు.

## 'అక్టోబర్ నుంచి దేశ వ్యాప్తంగా రిఫార్మ్ ఉత్సవ్'

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు10:** భారత ప్రభుత్వ కేబినెట్ కార్యదర్శి డా.టి.వి. సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన "రిఫార్మ్ ఉత్సవ్" కార్యక్రమం అమలు, కార్యాచరణపై రాష్ట్రాలకు వివరించారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి రిఫార్మ్ ఉత్సవ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు కేబినెట్ కార్యదర్శి తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను సేకరించి, వాటిని ఆచరణాత్మక సంస్కరణలుగా మార్చి, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష ్యమని పేర్కొన్నారు. రిఫార్మ్ ఉత్సవ్‌ను మూడు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశగా ఆగస్టు-సెప్టెంబర్ 2026లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు, అధికారుల సెన్సిటైజేషన్, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు ఉంటాయి. రెండో దశ అక్టోబర్-డిసెంబర్ 2026లో రిఫార్మ్ ఉత్సవ్గా నిర్వహించనున్నారు. ఇందులో జన్ మంథన్ (డిస్కవర్) కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి 31 వరకు, విమర్శ (డెలిబిరేట్) - జన్ సమాధాన్ (డెలివర్) కార్యక్రమాలు అక్టోబర్ 10 నుంచి నవంబర్ 30 వరకు నిర్వహించి, త్వరితగతిన అమలు చేయగల సంస్కరణలు, మధ్యకాలిక సంస్కరణలపై దృష్టి సారించనున్నారు. సంకల్ప సిద్ధి కార్యక్రమం అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 20 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నారు. మూడో దశగా డిసెంబర్ 28, 2026 నుంచి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఇందులో నిర్మాణాత్మక సంస్కరణలపై నిరంతర పర్యవేక్షణ, తదుపరి చర్యలు మరియు తిళిగ్బి సమర్పణ ఉంటాయి. రిఫార్మ్ ఉత్సవ్ అమలుకు ప్రతి రాష్ట్రంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టేట్ కోఆర్డినేటివ్ కమిటీ (ఎస్‌సిసి) ఏర్పాటు చేయడంతో పాటు స్టేట్ నోడల్ ఆఫీసర్ (ఎస్ఎన్ఓ)ను, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించనున్నారు.

## 14న ట్యాంక్‌బండ్ వద్ద భారీ 'తిరంగా యాత్ర'

### పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొనాలి: ఎన్.రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు కోరారు. ఆగస్టు 15 స్వా తంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అందులో భాగంగానే సోమవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పాల్గొని, తన ఊరిలో, తన బస్తీలోని యువతతో కలిసి ఆయన తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఇళ్లపై జెండాలు ఎగురవేయాలని కోరారు. అలాగే 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద చాలా పెద్దఎత్తున తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ యాత్ర ఏ ఒక్క పార్టీకో, రాజకీయాలకో సంబం ధించింది కాదని, మన భారతదేశ ఐక్యతను, శక్తిని ప్రపంచానికి చాటిచెప్పడానికి, 'వికసిత్ భారత్' సంకల్పంతో చేపడు తున్న యాత్ర అని చెప్పారు. హైదరాబాద్ ప్రజలందరూ కుల, మత, రాజకీయ విభేదా లను పక్కనబెట్టి, దేశం కోసం ఈ తిరంగా యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎన్.రాంచందర్‌రావు పిలుపునిచ్చారు.

## తెలంగాణ విద్యుత్ అవసరాలపై రాజ్యసభలో ఎంపి కె.లక్ష్మణ్ కీలక ప్రశ్న

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:**రాజ్యసభలో ప్రతిపాదిత జాతీయ విద్యుత్ విధానం–2026పై తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను రాజ్యసభ సభ్యుడు డా. కె.లక్ష్మణ్ లేవనెత్తారు. తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక రంగం, డేటా సెంటర్లు, పట్టణ మౌలిక వసతుల నేపథ్యంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ట్రాన్స్‌మిషన్ మౌలిక వసతుల బలోపేతం, పునరుత్పాదక ఇంధన విద్యుత్‌ను గ్రిడ్‌లో అనుసంధానం చేయడం, నిరంతర విద్యుత్ సరఫరాపై ప్రశ్నించారు. అలాగే తెలంగాణలో వికేంద్రీకృత సౌర విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, స్మార్ట్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థల విస్తరణ, అదే సమయంలో డిస్కంల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడేందుకు ప్రతిపాదిత సంస్కరణలు ఎలా దోహదపడతాయో ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్‌కట్టర్ రాజ్యసభలో సమాధానం ఇచ్చారు. విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, సంస్కరణలను మంత్రి వివరించారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా చౌకైన, నాణ్యమైన, విశ్వసనీయమైన విద్యుత్ 24 గంటలు సరఫరా అందించడం, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం ద్వారా వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న మంద కృష్ణమాదిగ

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలి

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 10, ప్రభాతవార్త:** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలని, దీనికోసం అవసరమైతే కేంద్రంతో పోరాడటానికి కూడా సిద్ధమని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దళిత క్రిస్టియన్‌లకు ఎస్సీ హోదా యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరై మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ జస్టిస్ బాలకిషన్ కమిషన్ కేవలం ఎనిమిది రాష్ట్రాల అభిప్రాయాలు సేకరణ చేసి, రిపోర్టు రూపొందించారని, ఇది దళిత క్రిస్టియన్ల హక్కులు కాలరాయటమేనని తెలిపారు. కేంద్రంపై ప్రతిపక్షాలు వత్తిడి తీసుకువచ్చి, కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే విధంగా కృషి చేయాలని కోరారు. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన మాత్రాన దళితుల సామాజిక, ఆర్థిక వెనకబాటుతనం, కుల వివక్ష తొలగిపోలేదనే అంశాన్ని జస్టిస్ రంగనాథన్ మిశ్రా కమీషన్ తన నివేదికలో ప్రస్తావించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ రిపోర్ట్‌ను పరిగణించకపోవటం బాధాకమన్నారు. దళిత క్రైస్తవుల సామాజిక ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయటానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన జస్టిస్ కేజి బాలకిషన్ కమిషన్ ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్‌టిఎస్ అధికారి భరత్‌భూషన్, మైనార్టి కమీషన్ మాజీ వైస్ ఛైర్మన్ బి.శంకర్‌లుక్, ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

## 13న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 10,814 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని, ఫీజులు చెల్లించలేదనే పేరుతో విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాలల్లోనే నిలిపివేసి తీవ్రంగా వేధిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు తెలిపారు.

## కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయండి

### మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్‌చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందేళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ (లిలీదీ) పూర్తి నీటి సామర్థం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్‌మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ఎస్ఆర్ఎస్‌పి స్టేజ్2 లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు నింపాలని డిమాండ్ చేశారు.

## ప్రధాని మోడీతో పవార్ ఎన్సీపి ఎంపీల భేటీ

### మహారాష్ట్ర సమస్యలపైనే చర్చించామంటున్న ప్రతినిధి బృందం



**ముంబయి, ఆగస్టు 10:** మహారాష్ట్రలోని శరద్ పవార్ ఎన్సీపీకి చెందిన ఎంపీల బృందం సోమవారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆయన నివాసంలో కలిశారు. శరద్ పవార్ కుమార్తె, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే నేతృత్వంలోని ఈ బృందం సుమారు అరగంట పాటు మోడీతో సమావేశమయ్యారు. తమ నియోజకవర్గాల అంశాలను ప్రస్తావించడంతో పాటు, మహారాష్ట్రలోని కరువు పరిస్థితులు, నీటి పారుదల సంబంధిత సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

అలాగే మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, షాహిర్ అన్నా భావు సాఠే, తుకడోజీ మహారాజ్‌లకు భారత్ రత్నా పురస్కా రాలు ప్రదానం చేయాలని కూడా ఈ బృందం డిమాండ్ చేసింది. నవీ ముంబై విమానాశ్రయానికి మహారాష్ట్ర మాజీ మంత్రి డీవై పాటిల్ పేరు పెట్టాలని వారు కోరారు.

తమ డిమాండ్లు, ఆందోళనలను వివరిస్తూ ప్రధానమంత్రికి ఒక లిఖితపూర్వక వినతిపత్రాన్ని సమర్పించారు.

ప్రతిపక్ష ఇండియా కూటమికి మిత్రపక్షమైన శరద్ పవార్ వర్గం ఎంపీలు ప్రధానితో భేటీ నేపథ్యంలో ప్రతిపాది డీలిమిటేషన్ బిల్లుకు ఆ పార్టీ మద్దతు ఇవ్వవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లు, విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లుపై ఈ సమావేశంలో చర్చ జరుగలేదని శరద్ పవార్ వర్గం ఎంపీలు తెలిపారు. ఎఫ్‌సీఆర్ఏ బిల్లును తాము వ్యతిరేకిస్తామని పేర్కొన్నారు.

మరోవైపు మహారాష్ట్రకు సహాయ నిధులు అందకపోవడంతో ప్రధానమంత్రిని కలిసేందుకు తమ పార్టీ ఎంపీలు ముందుగా అపాయింట్‌మెంట్ కోరినట్లు ఈ సమావేశానికి ముందే సుప్రియా సులే తెలిపారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ చట్టం తుది స్వరూపం పైనే తమ పార్టీ వైఖరి ఆధారపడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

## స్వగ్రామంలో మెడికో ప్రియాంక అంత్యక్రియలు

### హాజరైన మంత్రి జూపల్లి, ఏపి మంత్రి టిజి భరత్, పలువురు ప్రముఖులు

### పాడె మోసిన ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 10, ప్రభాతవార్త:** రాజమహేంద్రవరంలో దాడికి గురై హైదరాబాద్ ఆసుపత్రిలో మరణించిన మెడికో ప్రియాంక అంత్యక్రియలు సోమవారం గద్వాల జిల్లా ఎక్లాస్‌పురంలో జరిగాయి. అయిజ మండలం ఏక్లాస్‌పురం గ్రామానికి చెందిన కనకే వెంకటేష్, హైదరాబాదులో స్థిరపడ్డారు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు ఉండగా వారిలో పెద్ద కూతురు ప్రియాంక ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ మొదటి సంవత్సరం రాజమండ్రి మెడికల్ కాలేజీలో చేస్తున్నది. ఈ నెల 3న రాజమండ్రిలోని ఓ మాల్ వద్ద మద్యం సేవించి ఇద్దరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే ప్రియాంకను కారుతో ఢీ కొట్టడంతో ఆమె తలకు తీవ్రమైన గాయలై కోమలోకి వెళ్లింది. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించిన ఆమె మృత్యువుతో పోరాడి ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. అనంతరం గాంధీలో పోస్టుమార్టం అనంతరం ఆమె స్వగ్రామం ఎక్లాస్‌పురానికి ప్రియాంక పార్థివదేహాన్ని తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అల ముకున్నాయి. అంత్యక్రియల్లో మంత్రి జూపల్లి కృష్ణా రావుతోపాటు ఆంధ్రప్రదేశ్ మంత్రి టీజీ భరత్ పాల్గొని ప్రియాంక మృతదేహానికి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రియాంక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్టు వారు తెలిపారు అంతేకాకుండా ఇరువు రాష్ట్ర ప్రభుత్వాల తరపున ప్రియాంక కుటుంబానికి అన్ని విధాలుగా అండదండగా ఉంటామని అదేవిధంగా ఈ గాతుకానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షిస్తామని వారు తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన 20 లక్షల చెక్కును మంత్రి టీజీ భరత్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ ప్రియాంకకు జరిగిన ఈ ఘటన యావత్ తెలుగు ప్రజలను కలిచివేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని విధాల ప్రియాంకకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రియాంక తండ్రి కనకే వెంకటేశు తమ కుటుంబానికి సన్నిహితుడని వారికి అన్ని విధాల అన్ని విధాల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారా అండగా ఉంటామని తెలిపారు. ఈ ఘాతుకానికి కారకులైన వ్యక్తులను పోలీసుల ఆధ్వర్యంలో ఎంక్వయిరీ చేసి కఠినంగా శిక్షించేందుకు తమ ప్రభుత్వం పూర్తి నిష్పక్షవాతంగా ఉంటుందని తెలిపారు. ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ ప్రియాంక పాడే మోశారు.



మెడికో ప్రియాంక అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

## ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి: మంత్రి వాకిటి శ్రీహరి



గాంధీ ఆస్పత్రి మార్చురీలో ప్రియాంక మృతదేహాన్ని సందర్శించిన మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ (సికిందరాబాద్), ఆగస్టు 10, ప్రభాతవార్త:** మెడికో విద్యార్థి ప్రియాంక (28) భౌతికకాయానికి గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం జరిపారు. మృత దేహాన్ని ఆమే స్వస్థలం గద్వాల్ జిల్లా ఐజా మండలం ఎక్లాస్‌పూర్‌కు కుటుంబ సభ్యులు తరలించారు. గాంధీ ఆస్పత్రి వద్ద రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌లు సందర్శించి నివాళులు అర్పించారు.

అనంతరం ప్రియాంక తండ్రిని పరామర్శించి ఓదార్చారు. ప్రియాంక మృతి అత్యంత విషాదకరమైన ఘటన అని వారు పేర్కొన్నారు. ఆమె మరణానికి కారణమైన వ్యక్తులను గుర్తించి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని అన్నారు. ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్ లో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని నిందితులు తప్పించు కోకుండా కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఈగల్ పోలీసుల వలలో అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లు

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గంజాయి స్మగ్లర్ల ఆగడాలపై ఈగల్ పోలీసుల దాడుల పరంపర కొనసాగుతూనే వుంది. తాజాగా సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు బస్సులో ఆరు కిలోల గంజాయి తరలిం చిన ముగ్గురు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లను ఈగల్ పోలీసులు ఎల్‌బి నగర్ వద్ద పట్టుకున్నారు. వీరిలో ఒక మహిళ వుంది. ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా దీనికి సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సునీతనాగ్, పూజ డిర్డోలు కొంత కాలంగా ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి గంజాయిని లక్కన్ అనే వ్యక్తి నుంచి తక్కువ ధరకు కొని దానిని హైదరాబాద్‌లో అధిక ధరకు అమ్ముతూ రెండు చేతులా సంపాదిస్తున్నారు.

నెలలో ఒకటి లేదా రెండుసార్లు ఇలా గంజాయిని వీరు ఒడిషా నుంచి భద్రాచలం లేదా వైజాగ్ మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. తాజాగా ఆరు కిలోల గంజాయిని భద్రాచలం మీదుగా బస్సులో తరలించారు. దీనిని నగరానికి చెందిన సత్యనా రాయణ అలియాస్ సత్య ఎల్‌బి నగర్ వద్ద తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో తీసుకునేందుకు కారులో తన అనుచరులతో కలిసి వచ్చాడు. అయితే దీని గురించి పక్కా సమాచారం వున్న ఈగల్ పోలీసులు స్థానిక పోలీసులతో కలిసి సునీత నాగ్, పూజ డిర్డో బస్సు నుంచి దిగి గంజాయితో కారు వద్దకు వస్తున్న సమయంలో దాడిచేసి పట్టుకున్నారు. పోలీసుల రాకతో సత్య సహా అతని అనుచరులు పారిపోగా రాజేష్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. పట్టుబడ్డ ముగ్గురిని గంజాయితో పాటు తదుపరి విచారణ నిమిత్తం ఎల్‌బి నగర్ పోలీసులకు అప్పగించారు. కాగా సునీతా నాగ్, పూజ డిర్డోలు రెండే ళ్లుగా గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు తేలింది. హైదరాబాద్‌లో వీరికి ఆరుగురు వినియోగదారులున్న ట్లు తేలింది. వీరి కోసం గాలిస్తున్నారు. ఈ కేసులో ఒడిషాకు చెందిన ప్రధాన స్మగ్లర్ లక్కన్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన సత్య అతని అ నుచరులు మల్లేష్, శివశంకర్‌లు పారిపోగా వారి కోసం గాలిస్తున్నారు.

## గుప్త నిధుల పేరుతో రూ.కోటి మోసం

### నలుగురు నిందితుల అరెస్ట్

### నకిలీ బంగారు నాణేలు, బొగ్గుతో బురిడీ

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 10, ప్రభాతవార్త:** గుప్తనిధుల పేరుతో అమాయకులను నమ్మించి భారీగా డబ్బులు వసూలుచేస్తున్న ముఠా గుట్టును శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రాజేంద్రనగర్ పోలీసుల సహకారంతో రట్టు చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రెండు కార్లు, ఆటో, రెండు బైక్‌లు, నాలుగు సెల్ ఫోన్లు, 25 నకిలీ బంగారుపూత నాణేలు, ఆరు కిలోల బొగ్గు, నాలుగు కిలోల మట్టి, పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు మహ్మద్ మునావర్ (36) కార్ల డెంటింగ్- పెయిం టింగ్ చేసేవాడు. సులభం గా డబ్బు సంపాదించాలనే ఆలోచ నతో తనకు గుప్త నిధులు వెలికితీసే ప్రత్యేక విద్య ఉందంటూ ప్రచారం చేశాడు.



పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

తన స్నేహితులు సయ్యద్ అలీఅష్రఫ్ (40), మహ్మద్ హాజీ (25), మహ్మద్ సల్మాన్ (29)లను ముఠాలో చేర్చుకున్నాడు. బొగ్గును బంగారంగా మార్చే స్తామంటూ ముఠా సభ్యులు అమాయకులను కలిసి వారి ఇళ్ల కింద గుప్త నిధులు ఉన్నాయని నమ్మించేవారు. వారు సూచించిన చోట గుంతతీయించి, ముందుగానే సిద్ధం చేసుకున్న బొగ్గు, నకిలీబంగారు నాణేల సంచిని అందులో రహస్యంగా పెట్టేవారు. అనంతరం పూజలు చేసి బొగ్గు బంగారంగా మారేందుకు సమయం పడుతుందని చెప్పి అక్కడి నుంచి జారుకునేవారు. ఇలా వివిధ ప్రాంతాల్లో 11 మందిని మోసంచేసి రూ.కోటి వరకు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గుప్త నిధుల పేరుతో ఎవరైనా మోసం చేసేందుకు ప్రయత్నిస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

## పసి గుండెలకు నిమ్స్ భరోసా

### ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు

### 13 నుంచి ప్రత్యేక కార్యక్రమం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 10, ప్రభాతవార్త:** పసి గుండెలకు నిమ్స్ భరోసాగా నిలుస్తోంది. గుండె సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న చిన్నారులకు పూర్తి ఉచితంగా శస్త్రచికిత్సలను అందిం చేందుకు సిద్ధమైంది. ఈ నెల 13 నుంచి నిమ్స్‌లో ప్రత్యేక శస్త్రచికిత్సలను అందించనుంది. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో చిన్నారులకు పూర్తిగా ఉచితంగా గుండె శస్త్రచికిత్సలను ఈ నెల 13వ తేదీ నుంచి ప్రత్యేకంగా అందిస్తున్నామన్నారు. నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్ఓడీ ప్రొఫె. సర్ అమరేశ్వర్ నేతృత్వంలో ఈ శస్త్ర చికిత్సలు జరగనున్నాయి. లండన్‌కు చెం దిన వైద్యులు, పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమణ తన్నషనేని, సాం కేతిక నిపుణుల బృందం సహ కరించనుంది. గత అయిదేళ్లుగా ప్రతి సంవత్స రం నిమ్స్‌లో ఈ ఉచిత గుండె శస్త్రచికిత్సల కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. అవసరాన్ని బట్టి ప్రాధాన్యత కేటాయించి చిన్నారులను వాక్‌ఇన్ విధానంలో పరిశీలిస్తామన్నారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిం చిన అనంతరం శస్త్రచికిత్స అవసరమున్న చిన్నారులకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తా మన్నారు. ఇందుకోసం ఎలాంటి ముందస్తు అపాయింట్‌మెంట్ విధానం అవసరం లేదని అధికారులు తెలిపారు. అర్హత ఉన్న చిన్నారుల తల్లిదండ్రులు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య నిమ్స్ పాతబ్లాక్‌లోని మొదటి అంత స్తులో ఉన్న సీటీ సర్జరీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. గతంలో చేయించిన వైద్య పరీక్షల నివేదికలు, పాత వైద్య రికార్డులు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాలకు 040-23489025 నంబరులో సంప్రదించాలని సూచించారు.



నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్

## విద్యార్థులపై లాఠీచార్జీకి అమిత్‌షా సమాధానం చెప్పాల్సిందే

### ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 10,ప్రభాతవార్త:** ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జీ అంశంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా లోక్‌సభలో సమా ధానం చెప్పాలని విద్యార్థులపై లాఠీ చార్జీకి నైతిక బాధ్యత వహించి అమిత్‌షా మంత్రి పదవి రాజీనామా చేయాలని లోక్‌సభ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్ ముందు ఇండియా కూటమి ఎంపిల నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమిత్ షా సభకు హాజరు కానీ తేదీలతో కూడిన ప్లకార్డులతో నిరసన తెలిపిన ఇండి కూటమి ఎంపిలు నిరసన చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఇంకా నాలుగు రోజులు మాత్రమే ఉన్నాయనీ,అమిత్ షా హౌస్ లోకి రావడం లేదనీ ఎద్దేవా చేశారు.

విపక్షాల ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పడం లేదనీ ఆరోపించారు. కేంద్రం తనకు కావాల్సిన బిల్లులను పాస్ చేయించుకోవాలని చూస్తోందనీ ఆవేదన చెందారు. అమిత్ షా లోక్ సభకు వచ్చి విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జీపై క్షమాపణలు చెప్పాలని, విద్యార్థులపై పెల్లెట్ గన్స్ పేల్చమని ఎవరు ఆర్డర్ ఇచ్చారో అమిత్ షా సమాధానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్రం బిల్లులపై పార్లమెంట్‌లో చర్చ పెడితే ఆ బిల్లుల ఆమోదానికి సంబంధించి ప్రతిపక్షాలుగా నిర్ణయం తీసుకుంటామనీ అన్నారు. కేంద్రం ప్రజాస్వామ్య బద్ధంగా పార్లమెంట్ ను నడపాలనీ ఆయన కోరారు.

## కులగణన విజయవంతం కావాలంటే కులాల జాబితా తప్పనిసరి

### కులగణనపై విస్తృత ప్రచారం అవసరం:

### లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

**హైదరాబాద్, ఆగస్టు 10,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా చేపట్టనున్న కులగణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, కులగణన ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కులగణన అంశంపై ఏఐసిసి ఓబిసి విభాగం చైర్మన్ అనిల్ జైహింద్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఓబిసి సమావేశంలో దేశవ్యాప్తంగా చేపట్టనున్న కులగణన ప్రక్రియపై విస్తృతంగా చర్చ జరుగుతోందని చెప్పారు. కులగణన సక్రమంగా జరిగితేనే సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, జనాభా ఆధారిత ప్రాతినిధ్యం సాధ్యమవుతుందని గాంధీ వివరించారు..ప్రస్తుతం కులగణన ఫార్మాట్‌లో ముందుగా నిర్ణయించిన కులాల జాబితా లేకుండా, కేవలం కులం పేరును నమోదు చేసే విధానం ఉంటే అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా నిర్వహించే కులగణన ఆశించిన ఫలితాలను ఇవ్వకపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**తెలంగాణ తరహాలో పెండింగ్ కులాలను చేర్చాలి: విహెచ్**

తెలంగాణ తరహాలో పెండింగ్ కులాలను అర్హతను బట్టి జాబితలో చేర్చాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి. హనుమంతరావు అన్నారు. విహెచ్ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం, సాధికారత శాఖకు సంబంధించిన అధికారులను కలిసి తెలంగాణలో గతంలో చేపట్టిన చర్యలను ప్రస్తావించారు. నేషనల్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ గౌరవ్ సింగ్‌ను కలిసి, తెలంగాణలో గుర్తింపు ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న సుమారు 40 కులాలను కేంద్ర స్థాయిలో సంబంధిత జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం సమర్పించారు.

## వేజ్‌బోర్డ్ కోసం బొగ్గు కార్మికుల ఆందోళన

### దేశవ్యాప్తంగా నిలిచిన ఉత్పత్తి

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** బొగ్గు పరిశ్రమ కోసం 12వ సంయుక్త ద్విపక్ష కమిటీ (జెబిసిసిఐ)ని తక్షణమే ఏర్పాటు చేయాలని, అలాగే జులై 1, 2026న ప్రారంభమైన కొత్త వేతన బోర్డు కాలాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బొగ్గు కార్మికులు, యూనియన్లు తెలంగాణలోని సింగరేణితో సహా దేశవ్యాప్తంగా ఆందోళన చేశాయి. సోమవారం జరిగిన ఈ నిరసన, ఆందోళనా కార్యక్రమాలతో బొగ్గు గనుల్లో కార్యకలాపాలు స్తంభించడంతో ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణను, కొత్త కార్మిక చట్టాలను కూడా వ్యతిరేకించారు. 11వ జాతీయ బొగ్గు వేతన ఒప్పందం గడువు ముగిసినప్పటికీ, జూలై 2026లో ప్రారంభమయ్యే కొత్త వేతన చక్రం కోసం 12వ జేబీసీసీఐ సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం, కోల్ ఇండియా లిమిటెడ్ ఆలస్యం చేశాయని ఆరోపించాయి. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీల దొడ్డిదారి కాంట్రాక్టరైజేషన్‌ను, ప్రైవేటీకరణను యూనియన్లు తీవ్రంగా ప్రతిఘటించాయి. నాలుగు కేంద్ర కార్మిక చట్టాలను రద్దు చేయాలని, బొగ్గు గనుల భవిష్య నిధి (సీఎంపీఎఫ్) నిర్మాణాలకు రక్షణ కల్పించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు, పెన్షన్ బకాయిలను చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు.

వార్త

పుస్తకాలు చదవాలనే అభిలాష ఉన్నవారు ఎక్కడ ఉన్నా సుఖంగా ఉంటారు.

– ఆస్కార్‌వైల్డ్

# మలి ప్రస్థానంలో 'జెన్‌జి'


ఒకటోసారి అనూహ్య విజయం. రెండోసారి 'జెన్‌జీ'కి తలొగ్గక తప్పలేదు. యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఎవరైనా దిగిరావాల్సిందే. నిన్నమొన్నటి జెఎన్‌జి విజయం మరింత ముందుకు అడుగులు వేసే స్థాయికి యువతను ప్రేరేపిస్తోంది. ఆఫ్టరాల్ 'జెన్‌జి' అంటూ పెదవి విరచిన వారంతా వామ్మో! అని గొప్పగా చెప్పుకుంటున్నారు. జెన్‌జిని ఇగ్నోర్ చేయలేమని వాళ్ల ఉద్యమం దెబ్బకు రాజీనామా సమర్పించిన నాటి కేంద్రవిద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అంటున్నారు. 'జెన్‌జి' ఉద్యమం విషయంలో తొలుత కేంద్రప్రభుత్వ పెద్దలు మాత్రమే అంచనా వేయలేక అదెంత? అనుకుంటూ కాలయాపన చేసి 'జెన్‌జీ'కి ఓ స్పష్టమైన రూపం బహిర్గతమవడానికి కారణమయ్యారు. తాజాగా ఆర్‌ఎస్‌ఎస్ అధినేత, ప్రధాని మోడీ, మరెందరో ప్రముఖులు జెన్‌జి సత్తాను ఎత్తిపడేస్తున్నారు.దేశ సమగ్ర అభివృద్ధి సాధనలోయువత బాధ్యులుకావాలని ప్రధాని నరేంద్రమోడీ కాక్రోచ్‌ల ఉద్యమానంతరం వాటి గురించి బహిరంగంగా విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడడం ఇదే ప్రథమం. ఐఐటి ఢిల్లీ 57వ వార్షికోత్సవ సభలో ప్రధాని మాట్లాడుతున్నారంటే యువత కేరింతలు కొట్టారు. యువత కాలేజీల్లోంచి బయటకు వెళ్తున్నారంటే వారు ఎదురు చూసేది తొలి జాబ్ ఆఫర్ కోసం. అందుకోబోతున్న మొదటి నెల జీతం కోసమేనన్నారు. దాదాపు ప్రపంచమంతా జెన్‌జి ఉద్యమాలతో సతమతమవుతుంటే భారత్ మాత్రం యువతను ఆ మధ్య పెద్దగా పట్టించుకున్నట్లు కనపడలేదు. తీరా ఇప్పుడు పట్టించుకోక తప్పలేదు. వికసిత్ భారత్ సాధనలో జెన్‌జీ తరం అవసరం ఎక్కువగా ఉందని ప్రధాని అభిప్రాయపడ్డారు. యువత అధికంగా వినియోగించే సోషల్ మీడియా యాప్ 'స్నాప్ చాట్' తాజాగా తన అధికారిక చానల్‌ను ప్రారంభించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇదే అదనుగా ఇందిరా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అధికార ఎన్‌డిఎ ప్రభుత్వాన్నుద్దేశించి ఒక రాగాలాపన చేశారు. దేశంలో విద్యాప్రమాణాలు పడిపోవడమే కాకుండా యువతలో నైరాశ్యంలో మునిగిపోయిందని ప్రయాగ రాజ్ కెపి గ్రౌండ్స్‌లో జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. యువతకు సామర్థ్యాలున్నా ఉద్యోగావకాశాల్లేవని ఎత్తిచూపారు. ఇప్పుడు 'జెన్‌జి' విజృంభిస్తున్నది కేవలం కేంద్రప్రభుత్వ వ్యవహారశైలి మీదనే కాదు, జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా ఆ రాష్ట్ర అసెంబ్లీని ముట్టడించారు. నిరసనల సమయంలో పెల్లెట్‌గన్ కాల్పుల, లాఠీచార్జిని ఎదుర్కొన్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహబోరా మీద ఓ అంగతకుడు సిరా జల్లి దుర్భాషలు మాట్లాడడం అక్కడ ఉద్రిక్తతలకు దారితీసింది. అదంతా ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు డ్రామా ఆడుతున్నాయని విమర్శలు వెల్లువెత్తాయి. జెపిఎస్‌సి పరీక్షను రద్దు చేయడమొక్కటే జార్ఖండ్ యువత కోరుకున్నారు. అది కూడా దాదాపు సాధించినట్లే.పేపరు లీక్‌పై విద్యార్థులు చేస్తున్న ఆందోళనపై జార్ఖండ్ సర్కార్ దిగి వచ్చింది. అయినా విద్యార్థుల ఆందోళన ఆగలేదు. సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చి విజయవంతంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ వద్ద ఉద్రికత్త మొదలైంది. ప్రభుత్వం కొన్ని అంశాల్లో తలొగ్గినా జార్ఖండ్ విద్యార్థులు పట్టువదల్లేదు. జెపిఎస్‌సి, జెఎస్‌ఎస్‌సి జడ్ పరీక్షల రద్దుకు ప్రభుత్వం అంగీకరించింది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరగడంతో తమ భవిష్యత్ నాశనమౌతోందని విద్యార్థుల ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో యువత కాక్రోచ్ పార్టీ నేతృత్వంలో ఆందోళన చేపట్టింది. అందులో పాల్గొన్న వారంతా యువత కనుక జెన్‌జి ఉద్యమంగా పిలువబడుతోంది. ఎంతో క్రమశిక్షణతో జరిగిన ఆ ఉద్యమం ప్రజల మన్ననలనూ అందుకుంది. రాజకీయులు ఆ ఉద్యమానికి రాజకీయ రంగు పులమాలని చూసినా ఎక్కడా ప్రత్యర్థులకు ఆ అవకాశం చిక్కనీయకుండా జాగ్రత్తపడ్డారు. యువత మలి అడుగు జార్ఖండ్ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెంట పడింది. ఎలా అయినా ఈ ఉద్యమానికి మచ్చి ఊపుతేవాలని యువజనులంతా తాపత్రయపడ్డారు. జార్ఖండ్‌లో కూడా యువత ఆగ్రహావేశాలు తెంచుకున్నప్పుడు విద్యార్థి నేత దేవేంద్ర మహాతోవారిని అదుపులో ఉంచి పోలీసులతో వాగ్వివాదానికి దిగొద్దని సూచించారు. ఇలాంటి ఉద్యమాల్లో ఎవరూ ఒక మాట మీద నిలబడే అవకాశం ఉండదు. అయినా క్రమశిక్షణగా మెలగడమే విశేషం. రాష్ట్రంలోని ఎన్నో జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు,తదితర వాహనాల్లో అసెంబ్లీకి బయలుదేరారు. ఉద్యమాన్ని రక్తి కట్టించారు. పోలీసులు కూడా అసెంబ్లీలోకి ప్రవేశించబోయిన విద్యార్థులపై వాటర్ క్యాన్‌లు ఉపయోగించారు. బారికేడ్‌లు దాటి వచ్చిన విద్యార్థులను అదుపు చేయడం ఎంతోకష్టమైంది. నియామక ప్రక్రియలో సంస్కరణలు అవసరమని ముక్తకంఠంతో ఎలుగెత్తారు.క్రిమినల్ అంశాలను రాష్ట్ర సిఐడి దర్యాప్తుచేస్తుందని, 2023,25బ్యాక్‌లాగ్ నియామకాలు అక్రమాల్లో దర్యాప్తు చేస్తామని అంగీకరించారు. ఢిల్లీలో యువత ఆందోళన తర్వాత వివిధ రాజకీయ పార్టీలు వారిని నడిపించే పార్టీలు సైతంయువత ఉద్యమాలపై తమతమఅభిప్రాయాలు మార్చుకున్నాయి.యువతను దేశ నిర్మాణ సాధ నాలుగా మార్చుకోవాలని ఆర్.ఎస్.ఎస్ చీఫ్ డా.మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.యువత ప్రశ్నించడాన్ని తప్పుపట్టలేమని, వారి ఆలోచనలను తొక్కి పారేయడం కన్నా దేశాభివృద్ధిలో భాగస్వాములుగా చేయాలని సందేశం సారాంశం.

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం.



వి.జాన్సన్

దురలవాట్లు మొదట్లో సాలెగూళ్ల లాంటివి. తర్వాత అవి ఇనుప గొలుసులై మిమ్మల్ని బంధిస్తాయి.



హెచ్. లాంగ్‌ఫెలో

# మట్టి టోకెన్ల నుంచి ప్లాస్టిక్ నోట్ల వరకు..

*గతదశాబ్దంలో ప్రపంచం,ముఖ్యంగా భారతదేశం, పెద్దమార్పునుచూసింది. యూపీఐ, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపులు విస్తరించాయి. అయితే ఇవి కొత్త కరెన్సీలుకావు. రూపాయివంటి ప్రస్తుత కరెన్సీలను వినియోగించే కొత్తచెల్లింపు పద్ధతులు మాత్రమే. మట్టి టోకెన్లతో ప్రారంభమైన కరెన్సీ ప్రయాణం లోహనాణేలు, కాగితపునోట్లు, ఇప్పుడు పాలిమర్ నోట్లవరకు చేరుకుంది. ప్రతి దశ వెనుక ఒకే లక్ష్యంఉంది.లావాదేవీలను మరింత సురక్షితంగా,సులభంగా, సౌకర్యవంతంగా మార్చడం. రేపుసాంకేతిక పరిజ్ఞానం మరింత ముందుకు వెళితే కరెన్సీ మరోకొత్త రూపాన్ని సంతరించుకోవచ్చు.అందువల్ల పాలిమర్‌నోట్లు కరెన్సీ పరిణామానికి చివరి మజిలీకావు.*



కృష్ణ బాలాజి పల్లపోతు

ఇటీవల భారత ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ, ప్రస్తుతం చెలామణిలో ఉన్న కాగితపు 10, 20 రూపాయల నోట్లకు అదనంగా పాలిమర్ (ప్లాస్టిక్) నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, సింగపూర్ వంటి అనేక దేశాలు పాలిమర్ నోట్లు చెలామణిలో ఉన్నాయి. ఎక్కువకాలం మన్నడం, నీటికి తడవకపోవడం, అనుకరణ మరింత కష్టతరం వంటి ప్రయోజనాల వల్ల ఈ మార్పు ప్రపంచవ్యాప్తంగా వేగం పుంజుకుంటోంది. ఈ నేపథ్యంలో మట్టి టోకెన్ల నుంచి ప్లాస్టిక్ నోట్ల వరకు సాగిన ఈ ఐదు వేల ఏళ్ల కరెన్సీ ప్రయాణాన్ని సింహావలోకనం చేసుకోవడం ఆసక్తి కరంగా ఉంటుంది. నాగరికత ప్రారంభంలో ప్రపంచమంతా వస్తుమార్పిడి (బార్టర్) పద్ధతిపైనే ఆధారపడేది. కరెన్సీ అవసరం లేకుండానే, లావాదేవీల నికర విలువ ఆధారంగా వస్తుమార్పిడి జరిగేది. అయితే ఈ విధానంలో ఆర్థికశాస్త్రంలో 'డబుల్ కోఇన్సిడెన్స్ ఆఫ్ వాంట్స్' గా పిలిచే ఒక ప్రధాన సమస్య ఎదురయ్యేది. ఒకే సమయంలో ఇరువురికీ అవతలి వ్యక్తి వద్ద ఉన్న వస్తువే అవసరమై ఉండాలి. ఈ ఇబ్బందే మరింత సమర్థవంతమైన మార్పిడి వ్యవస్థ అవసరాన్ని సృష్టించి, కరెన్సీ పుట్టుకకు నాంది పలికింది. ఆసక్తికరంగా, వస్తు మార్పిడి సూత్రం పూర్తిగా కనుమరుగై పోలేదు. నేటికీ స్టాక్ ఎక్స్ఛేంజీల క్లియరింగ్ వ్యవస్థల్లో, కొన్ని అంతర్జాతీయ వాణిజ్య లావాదేవీల్లో, పరస్పర బాకీల నెట్టింగ్ విధానంలో ఇదే భావన ఆధునిక రూపంలో కనిపిస్తుంది. లావాదేవీలు చాలావరకూ ఒకదానితో వేరొకటి పరిష్కారం అయిపోగా, నికర విలువ మాత్రమే చేతులు మారుతుంది. సుమారు ఐదు వేల సంవత్సరాల క్రితం మెసపొటేమియాకు చెందిన సుమేరియన్, అక్కాడియన్ నాగరికతల్లో ధాన్యం, నూనె, పశువులు వంటి వస్తువుల విలువను సూచించే మట్టి టోకెన్లు ఒక నిర్దిష్ట విలువను సూచించే ప్రతీకలుగా ఉపయోగించబడేవి. వాణిజ్య లావా దేవీలు, గిడ్డంగి నిల్వలు, పన్నులు మొదలైన వాటి లెక్కల నిర్వహణకు టోకెన్లు ఉపయోగపడేవి. వాస్తవానికి ఈటోకెన్ల ఆధారంగా లావాదేవీలను నమోదు చేయాల్సిన అవసరమే మానవ చరిత్రలో 'లిపి' అభివృద్ధికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చరిత్రకారులు భావిస్తున్నారు. అందుకే మట్టి టోకెన్లు తొలినాటి కరెన్సీగా మాత్రమే గాక అకౌంటింగ్, పరిపాలన, నాగరికత పరిణామంలో కూడా ఒక కీలక మైలురాయిగా నిలిచాయి. వాణిజ్యం విస్తరించడంతో మరింత విశ్వసనీయమైన మార్పిడి సాధనం అవసరమైంది. ఫలితంగా బంగారం, వెండి, రాగి వంటి లోహాలతోనాణేలు తయారయ్యాయి. లోహానికి సహజసిద్ధమైన విలువ ఉండటం, దీర్ఘకాలం మన్నడం వల్ల అవి వేగంగా ప్రజాదరణ పొందాయి. భారతదేశం కూడా ఈ రంగంలో అగ్రస్థానంలోనే నిలిచింది. ప్రాచీన పంచ్‌మార్క్ నాణేలు, మౌర్యులు, శాతవాహనులు జారీ చేసిన నాణేలు భారతదేశపు సమృద్ధమైన ద్రవ్య చరిత్రకు నిదర్శనం. విజయనగరసామ్రాజ్యం జారీ చేసిన బంగారు పగోడా (వరాహ) నాణేలు దక్షిణ భారతదేశంలోనే కాకుండా హిందూ మహాసముద్ర వాణిజ్యంలోనూ విశ్వసనీయ కరెన్సీగా గుర్తింపు పొందాయి. నాణేలు కేవలం లావాదేవీల సాధనాలుగానే కాకుండా, రాజవంశాల కాలక్రమం, పాలకుల పేర్లు, బిరుదులు, మత విశ్వాసాలు, ఆర్థిక పరిస్థితులను పునర్నిర్మించడంలో చరిత్రకారులకు అమూల్యమైన ఆధారాలుగా ఉపయోగపడ్డాయి. లోహ నాణేలు విశ్వసనీయమైనవే అయినప్పటికీ, వాటిని భారీ సంఖ్యలో ముద్రించడం, రవాణా చేయడం, పెద్ద మొత్తాల





లావాదేవీల్లో వినియోగించడం క్రమంగా భారంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో తోలు, వస్త్రం వంటి ప్రత్యామ్నాయాలను పరిమితంగా ఉపయోగించబడ్డాయి. అయితే తక్కువబరువు, తక్కువ ముద్రణా వ్యయం, సులభమైన రవాణా, పెద్ద మొత్తాల చెల్లింపులకు అనుకూలత కారణంగా కాగితపునోట్లు ప్రపంచవ్యాప్తంగా క్రమంగా విస్తరించాయి. ఈ సందర్భంలో, కరెన్సీ దానికి ఆపాదించిన విలువను ఎలా సంతరించుకుంటుందనేది ఆసక్తికరమైన అంశం. తొలినాళ్లలో బంగారం, వెండి నాణేల విలువ వాటిలోని లోహం విలువకు దగ్గరగా ఉండేది.దీనిని అంతర్గత విలువ (ఇంట్రిన్సిక్ వ్యాల్యూ) కలిగిన ద్రవ్యంగా భావించవచ్చు. కానీ, ఉదాహరణకు ప్రస్తుతం రూ.100 నోటు తయారీ ఖర్చు రూ.100 కాదు. అంత కంటే ఎంతో తక్కువ ఉంటుంది.అంటే, వాటి విలువ లోహంలోనో, కాగితంలోనో లేదు. దానిని జారీ చేసిన ప్రభుత్వం, కేంద్ర బ్యాంకుపై ప్రజలు ఉంచిన విశ్వాసంలోఉంది. ఇలాంటి ద్రవ్యాన్నే టోకెన్‌కరెన్సీ లేదా ఫియ్యాషియట్ కరెన్సీ అంటారు. ఈవ్యవస్థ అమలులో ఉన్నందువలన దేశ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వాలు కొత్త నోట్లను ప్రవేశపెట్టగలుగుతున్నాయి. పాత నోట్లను ఉపసంహరించుకోగలుగుతున్నాయి. అవసరమైతే కరెన్సీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టగలుగుతున్నాయి. భారతదేశంలో పెద్ద నోట్లరద్దు, బ్రెజిల్, టర్కీవంటి దేశాల్లో తీవ్రమైన ద్రవ్యోల్బణం తరువాత చేపట్టిన కరెన్సీ సంస్కరణలు దీనికి ఉదాహరణలు. ప్రపంచంలో అప్పటికే అమలులో ఉన్న టోకెన్ కరెన్సీ భావనను, భారతదేశంలో అత్యంత సాహసోపేతంగా అమలు చేయడానికి ప్రయత్నించిన పాలకుడు మహమ్మద్ బిన్ తుగ్లక్. 14వ శతాబ్దంలో ఆయన వెండి నాణేలకు ప్రత్యామ్నాయంగా రాగి, ఇత్తడితో టోకెన్ కరెన్సీని హడావిడిగా ప్రవేశపెట్టాడు.అయితే నకిలీనాణేలను అరికట్టే సాంకేతికత, కఠిన నియంత్రణ వ్యవస్థలు లేకపోవడంతో ప్రజలు పెద్దఎత్తున నకిలీనాణేలను తయారుచేశారు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమై, చివరకు తుగ్లక్ తన ప్రయోగాన్ని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. కానీ తుగ్లక్ ప్రయోగం టోకెన్ కరెన్సీ విజయవంతం కావాలంటే ప్రజల విశ్వాసాన్ని కాపాడగల సాంకేతికత, సమర్థమైన పరిపాలనా వ్యవస్థ అవసరమనే విషయాన్ని మాత్రం స్పష్టం చేసింది. మన్నిక, పరిశుభ్రత,నకిలీ నిరోధకత వంటి అంశాల్లో కాగితపు నోట్లు ఎదుర్కొంటున్న పరిమితులను అధిగమించేందుకు అనేకదేశాలు పాలిమర్ (ప్లాస్టిక్)నోట్లను ప్రవేశపెడుతున్నాయి. ఇవి ఎక్కువకాలం మన్నుతాయి. నీటికి తడవవు. ఆధునిక భద్రతా లక్షణాల వల్ల నకిలీ చేయడం మరింత కష్టతరం.నోట్ల జీవితకాలం పెరగడంతోదీర్ఘకాలంలోముద్రణ వ్యయం కూడా తగ్గేఅవకాశం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానం మరింత అభివృద్ధి చెందడం,నకిలీ కరెన్సీని అరికట్టాల్సిన అవసరం పెరగడంవంటి కారణాలతో, ఇంతకు ముందే ప్రతిపాదించిన ఈప్రయత్నం మరోసారి ఊపందుకుంది.'ప్లాస్టిక్' అనగానే సహజంగానే పర్యావరణంపై సందేహాలు తలెత్తుతాయి. అయితే, పాలి మర్ నోట్లు కాగితపు నోట్లకంటే రెండు నుంచి నాలుగురెట్లు ఎక్కువకాలం మన్నడం వల్ల కొత్త నోట్ల ముద్రణ, రవాణా, భర్తీ ప్రక్రియలకు అవసరమయ్యే ముడి పదార్థాలు, ఇంధన వినియోగం తగ్గే అవకాశం ఉంటుంది. వాటిని పునర్వినియోగం చేయడం కూడా సాధ్యమే. అందువల్ల పర్యావరణ ప్రభావాన్ని కేవలం తయారీ పదార్థం ఆధారంగా కాకుండా, మొత్తం జీవితచక్రం ఆధారంగా అంచనా వేయడం అవసరం. అయితే పాలిమర్ నోట్ల పర్యావరణ ప్రయోజనాలు,వినియోగానంతరం వాటిని సమర్థంగా సేకరించి, పునర్వినియోగం చేయగల వ్యవస్థ ఉన్నప్పుడే పూర్తిగా సాకారమవుతాయి. గతదశాబ్దంలో ప్రపంచం,ముఖ్యంగా భారతదేశం, పెద్దమార్పునుచూసింది. యూపీఐ, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపులు విస్తరించాయి. అయితే ఇవి కొత్త కరెన్సీలుకావు. రూపాయివంటి ప్రస్తుత కరెన్సీలను వినియోగించే కొత్త చెల్లింపు పద్ధతులు మాత్రమే. మట్టి టోకెన్లతో ప్రారంభమైన కరెన్సీ ప్రయాణం లోహ నాణేలు, కాగితపు నోట్లు, ఇప్పుడు పాలిమర్ నోట్లవరకు చేరుకుంది. ప్రతి దశ వెనుక ఒకే లక్ష్యంఉంది.లావాదేవీలను మరింత సురక్షితంగా, సులభంగా, సౌకర్యవంతంగా మార్చడం. రేపు సాంకే తిక పరిజ్ఞానం మరింత ముందుకు వెళితే కరెన్సీ మరోకొత్త రూపాన్ని సంతరించుకోవచ్చు.అందువల్ల పాలిమర్‌నోట్లు కరెన్సీ పరిణామానికి చివరి మజిలీకావు.మానవ నాగరికతఆర్థిక ప్రయాణంలో మరోసహజమైన మైలురాయి మాత్రమే.

# బలమైన ప్రతిపక్షం చరిత్రాత్మక అవసరం

సురేష్ కాలేరు

ప్రతిపక్షాల పునర్నిర్మాణమే ప్రజాస్వామ్యానికి బలం భారతదేశ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, ప్రతి దశలోనూ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా కొత్త రాజకీయ శక్తులు, కొత్త భావజాలాలు ఆవిర్భవించాయి. స్వాతంత్ర్యానంతరం భారత జాతీయ కాంగ్రెస్ దేశ రాజకీయాలను దశాబ్దాల పాటు ప్రభావితం చేసింది. అనంతరం అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) నేపథ్యంలో జనతా పార్టీ ఆవిర్భావం, ప్రాంతీయ పార్టీల ఎదుగుదల, సామాజిక న్యాయ ఉద్యమాల ప్రభావంతో వెనుకబడిన వర్గాల రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం వంటి పరిణామాలు భారత ప్రజాస్వామ్యాన్ని మరింత విస్తృతం చేశాయి. మండల్ ఉద్యమం, రైతాంగ పోరాటాలు, దళిత బహుజన ఉద్యమాలు, ప్రాంతీయ స్వాభిమాన ఉద్యమాలు దేశ రాజకీయాలకు కొత్త దిశను చూపించాయి. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావడంద్వారా సమాఖ్య వ్యవస్థ మరింత బలపడింది. కేంద్రరాష్ట్ర సంబంధాలపై కొత్త చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే గత దశాబ్దంలో బిజెపి దేశ రాజకీయాల్లో ప్రధాన శక్తిగా ఎదిగింది. బలమైన సంస్థాగత నిర్మాణం, విస్తృత ఎన్నికల వ్యూహం, నాయకత్వ కేంద్రీకరణ, సంక్షేమ పథకాల ప్రచారం, డిజిటల్ ప్రచార వ్యవస్థ వంటి అంశాలు ఆపార్టీ విజయాలకు దోహదపడ్డాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అనేకరాష్ట్రాల్లో కూడా ఆ పార్టీ తన ప్రభావాన్ని విస్తరించగలిగింది. ఇదే సమయంలో ప్రతిపక్ష రాజకీయాలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. భావజాల స్పష్టత లోపించడం, నాయకత్వ విభేదాలు, ప్రాంతీయ ప్రయోజనాలకే పరిమితమవడం, సమన్వయ లోపం, దీర్ఘకాలిక ప్రత్యామ్నాయ కార్యాచరణను ప్రజల ముందుంచడంలో వైఫల్యం వంటి కారణాలు ప్రతిపక్షాల బలహీనతకు దారితీశాయి.కేవలం అధికార వ్యతిరేకత సరిపోదు.ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే విధానాలు, విశ్వసనీయ నాయకత్వం, కార్యాచరణ కూడా అవసరం. ఈనేపథ్యంలో కాంగ్రెస్, వివిధ ప్రాంతీయ పార్టీలు, రైతు, కార్మిక,విద్యార్థి,మహిళా, దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల ప్రజా సంఘాలు పరస్పర సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అయితే అలాంటి సమన్వయం రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలు, విధానాలపై ఆధారపడాలి. కేవలం ఎన్నికల కూటమిగా మాత్రమే పరిమితం కాకూడదు. దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, సమాఖ్య వ్యవస్థ, పారదర్శక పరిపాలన, ఉపాధి, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఆర్థికాభివృద్ధి వంటిఅంశాలపై ప్రత్యామ్నాయ కార్యాచరణను ప్రజలకు వివరించగలిగితేనే బలమైన రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పడే అవకాశంఉంటుంది. భారత ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే అధికార పక్షంఎంత బలంగా ఉండాలో, అంతేబలమైన, బాధ్యతాయుతమైన ప్రతిపక్షం కూడా అవసరం. అధికారాన్ని ప్రశ్నించే స్వరం ప్రజాస్వామ్యానికి అంతర్భాగం. అదే సమయంలో ప్రతిపక్షం కూడా విమర్శలతో పాటు నిర్మాణాత్మక సూచనలు, అమలు చేయగల విధానాలను ప్రజల ముందుంచాలి .భారత రాజకీ యాల భవిష్యత్తు ఒకే పార్టీ విజయం లేదా ఓటమితో నిర్ణ యించబడదు. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే రాజకీయ వ్యవస్థ,రాజ్యాంగ స్ఫూర్తినికాపాడే ప్రజాస్వామ్య సంస్కృతి, సామాజిక సమానత్వాన్ని బలోపేతం చేసే విధానాలు, బాధ్యతాయుత రాజకీయ పోటీ ఇవే దేశ ప్రగతికి నిజమైన పునాదులు.

# యువశక్తికి మత్తు సంకెళ్లు - వికసిత్ భారత్‌కు ముప్పు

రామ కిష్టయ్య సంగన భట్ల

సమగ్ర ప్రగతికి, సుస్థిర వికాసానికి, ఆర్థిక పురోగతికి భావి భారత పౌరులే ప్రధాన శక్తులు. 'యువతయే దేశానికి వెన్నెముక' అనే ఆర్యోక్తి ఊరికే రాలేదు. నేడు జగత్తులోనే అత్యధికంగా పాతికేళ్ల లోపు వయస్సు ఉన్న యువజన జనాభా కలిగిన సమ్మోహన శక్తిన కలిగిన ఏకైక దేశం మన భారతదేశం. ఈ అనంతమైన శారీరక, మానసిక, సృజనాత్మక శక్తి సరైన దిశలో పయనిస్తే 'వికసిత భారత్ 2047' స్వప్నం నెరవేరడం తథ్యం. కానీ, సరిగ్గా ఇదే సమయంలో మన దేశ ప్రగతిని దెబ్బతీయడానికి, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడానికి మాదకద్రవ్యాలనే విషనాగులు సమాజంలోకి జొరబడుతున్నాయి. ఈ వ్యసన భూతం కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యానికే పరిమితం కాకుండా కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నంచేస్తూ, సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, అంతిమంగా దేశ ఆర్థిక పురోగతికి తీవ్ర ప్రతిబంధకంగా మారుతోంది. నూతన యుగంలో సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తోందో, అంతే వేగంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యవస్థ రూపాంతరం చెందుతోంది. చీకటి జాలం, గూఢ ధనాలు, సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని కృత్రిమ మత్తు పదార్థాలు, రసాయన మత్తు బిళ్లలు, హెరాయిన్ వంటి ప్రమాదకర పదార్థాలు నేడు విద్యాసంస్థల ముంగిటకు చేరుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా దాదాపు ముప్పై కోట్లకు పైగా ప్రజలు వివిధ రకాల మాదకద్రవ్యాల బారిన పడి ఉన్నారు. భారతదేశ విషయానికి వస్తే,జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలో సుమారు మూడు కోట్ల మందికి పైగా గంజాయిని, రెండుకోట్ల మందికి పైగా అఫీము ఆధారిత పదార్థాలను, దాదాపు కోటి మందికి పైగా వివిధ రకాల ప్రమాదకర నిద్రమాత్రలను వినియోగిస్తున్నారు. ఇందులో అత్యధిక భాగం పదిహేను నుంచి ముప్పై ఐదు సంవత్సరాల మధ్య వయస్సు గల పాఠశాల, కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువత, పట్టణ ప్రాంతవాసులే ఉండటం అత్యంత విచారకరం. మత్తు పదార్థాల వ్యాపారం కేవలం స్వదేశీ విక్రేతల వ్యాపారం మాత్రమే కాదు, దీని వెనుక అంతర్జాతీయ నేర ముఠాలు, సరిహద్దు అవతలి శత్రుదేశాల కుట్రలు దాగి ఉన్నాయి. దీనినే 'మత్తు తీవ్రవాదం' అంటారు. పంజాబ్, జమ్మూ కాశ్మీర్, గుజరాత్ తీరప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల సరిహద్దుల గుండావిమాన రహిత యంత్రాలు, సముద్ర మార్గాలు, రవాణా వాహనాల ద్వారా దేశంలోకి వేల కోట్ల రూపాయల విలువైన మత్తు పదార్థాలను తోస్తున్నారు. భారతదేశ యువశక్తిని మానసికంగా, శారీరకంగా వికలాంగులను చేయడం ద్వారా భారత ప్రజాస్వామిక, ఆర్థిక శక్తులను బలహీనపరచాలనేది ఈ దేశ వ్యతిరేక శక్తుల ప్రధాన వ్యూహం. ఒకసారి ఈ వ్యసనంలో కూరుకుపోతే వ్యక్తి ఆలోచనా శక్తి నశిస్తుంది. తీవ్ర మానసిక రుగ్మతలతో పాటు కాలేయం,గుండె, నరాలవ్యవస్థ పూర్తిగా దెబ్బతింటాయి. విద్య, ఉద్యోగాలు కోల్పోయి, నేరపూరిత కార్యకలాపాల వైపు అడుగులు వేయడం ద్వారా కుటుంబ



శ్రేయస్సు పూర్తిగా నాశనమవుతుంది. ఈ తీవ్రమైన సంక్షోభాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణాన్ని ఒక ప్రాధాన్య జాతీయ లక్ష్యంగా నిర్దేశించుకుంది.ఇందులో భాగంగా ప్రధానమంత్రి ఆగస్టు రెండున అద్భుతమైన 'మత్తు రహిత యువత – వికసిత భారత్ సంకల్ప ఉద్యమం' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభించారు. 'మాదకద్రవ్య రహిత యువతే వికసిత భారత్–2047 లక్ష్యానికి బలమైన పునాది'అని చాటిచెప్పిన ఈ కార్యక్రమంలో ఒకేసారి దేశవ్యాప్తంగా కోటికి పైగా యువత మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ పూనడం అపూర్వ చరిత్రను తిరగరాసింది. ఈ ఉద్యమం కేవలం ఒక ప్రభుత్వ ఆదేశంగా కాక,ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఒక చైతన్య వంతమైన ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని డిజిటల్ వేదికను ఉపయోగించి కోట్ల మంది వాలంటీర్లను ఇందులో భాగస్వాములను చేస్తున్నారు. ఈ ఉద్యమం ద్వారా జాతీయస్థాయి ప్రశ్నోత్తరి, వ్యాసరచన, చిత్రలేఖనం, నినాదాల రచనలు నిర్వహించడం జరుగుతోంది. నాటికలు, అభినయ ప్రదర్శనలు, జానపద గేయాలు, వీధి నాటకాలు, లఘు చిత్రాల ద్వారా మత్తు పదార్థాల దుష్పరిణామాలను గ్రామీణ స్థాయిలోని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. యువతను క్రీడా రంగానికి ఆకర్షితులను చేస్తూ, మానసిక ఉల్లాసానికి స్థానిక క్రీడా పోటీలు, యోగా సాధన, మానసిక పరిపక్వత సలహాలు,ఉచిత వైద్య తనిఖీ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో యువజన సంఘాలను ఏర్పాటు చేసి, మత్తుకు బానిసలైన వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు పంపేలా నడిపిస్తున్నారు. ఈబృహత్తర ప్రచార కార్యక్రమం ఆగస్టు పధ్నాలుగున నిర్వహించబోయే 'జాతీయ యువ సమ్మేళనం' తో ముగియనుంది. మత్తు రహిత సమాజ స్థాపనకు కేవలం ప్రచారం మాత్రమే సరిపోదు, దీనికి బహుముఖ వ్యూహం అవసరం.ఒకవైపు చట్టపరమైన ఉక్కు పాదం, మరొకవైపు పునరావాసం కలగలిపి పనిచేయాలి. మత్తు పదార్థాల నియంత్రణ సంస్థ, రాష్ట్ర పోలీసులు, తీర రక్షక దళం, సుంకముల శాఖల మధ్య మెరుగైన సమన్వయంతో సరిహద్దులలో నిఘాను తీవ్రతరం చేయాలి. పాఠశాలలు, కళాశాలల సమీపంలో మాదకద్రవ్యాలు విక్రయించే ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచి, విద్యాసంస్థలను మత్తు రహిత ప్రాంతాలుగా ప్రకటించాలి. వ్యసనపరులను నేరస్థులుగా చూడకుండా, బాధితులుగా పరిగణించి వారికి అవసరమైన మానసిక పరిపక్వత సలహాలు, వైద్య సహాయం అందించాలి. ప్రత్యేక ఉచిత సలహాదారుల ద్వారా సలహాలు అందించాలి. భారతీయ సంస్కృతి ఎల్లప్పుడూ శరీర ధర్మాన్ని, మానసిక పరిశుద్ధతను అత్యున్నతంగా భావించింది. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే ఆర్యోక్తిని స్మరిస్తూ సంస్కారవంతమైన, ఆరోగ్యకరమైన జీవనశైలే వికసిత భారత్‌కు ప్రాణాధారమని గుర్తించాలి. 'మత్తు రహిత యువత – వికసిత భారత్' అనేది కేవలం ప్రభుత్వానికి చెందిన ఒక సంక్షేమ పథకం కాదు.ఇది ప్రతి తల్లిదండ్రి,ఉపాధ్యాయుడు, విద్యాసంస్థ, స్వచ్ఛంద సంస్థ,పౌరుడు స్వీకరించాల్సిన జాతీయ ధర్మం. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ, వారికి కావలసిన ప్రేమను, మానసిక ధైర్యాన్ని ఇంట్లో అందించాలి. మత్తు వదిలి లక్ష్యం వైపు అడుగులు వేస్తేనే వికసిత భారత స్వప్నం సాకారమవుతుంది.

# ప్రజావాక్కు



## పెరుగుతున్న మందుబాబుల ఆగడాలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియుల ఆగడాలు శృతి మించి పోతూవున్నాయి. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలుతప్పవు.ఎవరూ ఆరుబయట ప్రదేశాల్లో తాగొద్దు. మద్యంమత్తులో వాహనాలు నడపొద్దనిఅధికారులుహెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. దీనికితోడు అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే.దీంతో మందుబాబులకు పూర్తిస్వేచ్ఛ లభించినట్లయింది. కాస్త చీకటిపడితే జనావాసాల్లోనే మద్యం తాగుతున్నారు. జనసంచారం తక్కువగా ఉండే ప్రదేశాల్లో అయితే ఇక చెప్పనక్కర్లేదు. మద్యం మత్తులో ఏం చేస్తున్నామో తెలియక మందుబాబులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా రహదారులను సైతం అడ్డాగా మార్చుకొని మరీతాగుతున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో రాత్రి పూట తాగి సీసాలు పగులగొట్టి, మలమూత్ర విసర్జనచేస్తూ అటు పాటశాలల వాతావరణం కలుషితం చేస్తూ వున్నారు. గది, కిటికీ అద్దాలు పగుల గొట్టడం వస్తువులను దొంగిలిస్తున్నారు.

– కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

## వయిలెంట్‌గా మారుతున్న పిల్లలు

అక్రమ సంబంధాలు పెట్టుకుని భర్తలనుభార్యలు, భార్యలను భర్తలు అంతమొందిస్తున్నారు.కడుపున పుట్టిన పిల్లలు అడ్డుగా ఉన్నారనుకుంటే వారినీ కిరాతకంగా హతమారుస్తున్నారు. కన్నకూతుళ్లపైనే తండ్రులు అత్యాచారాలు చేస్తున్నారు. బాల్యం నుంచే పిల్లలు వాయిలెంట్‌గా ఉంటూ సమాజాన్ని హడలెత్తిస్తున్నారు. కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత ఉండటం లేదు. ఆస్తి కోసం డబ్బుల కోసం కలహించుకుంటున్నారు. ఒకర్నొకరు మోసగించుకుంటున్నారు. స్నేహితులు కూడా ఇలానే ఉంటున్నారు. స్వార్థబుద్ధితో ప్రవర్తిస్తారని, దుష్ట ఆలోచనలతో ఉంటారని వీర బ్రహ్మంద్రే స్వామి ఎప్పుడో చెప్పారు.

– మిథునం, హైదరాబాద్

## సైబర్ నేరగాళ్ళ పట్ల జాగ్రత్త

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్తరకం మోసాలకు పాల్పడుతూ అమాయక ప్రజలు అయిన రైతులు, ఉద్యోగులు, వృద్ధులే లక్ష్యంగా చేసుకుని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉంటూ మీ వ్యక్తిగత వివరాలు ఎవరికి కూడా చెప్పరాదు. అపరిచితుల వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించండి.

–మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## ఇదెక్కడి విచిత్రం

రిజిస్టర్ చేద్దామని పోస్టాఫీసుకు వెళ్తే , డబ్బులు వద్దు ఫోన్ పే చేయండి అని పోస్టల్ వాళ్ళు చెప్తున్నారు. మోడీ వచ్చిన తరువాత రకరకాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. కేంద్రం తిక్కతిక్క వేషాలు వేస్తుంది.ఇంతకు ముందు రిజిస్టర్‌కు 26 రూపాయలు తీసుకునేవారు.ఇప్పుడది ఎత్తేసి మినిమం 55 రూపాయలు చేశారు.150 కోట్ల జనాభాలో ఫోన్లు ఉపయోగించుకునేది ఎంతమంది?వారిలో ఫోన్ పే ఎంత మందికి తెలుసు? చదువుకున్నవారిలోనే చాలామందికి అదేంటో తెలియదు.డబ్బులు ఇస్తామంటే కాదు ..ఫోన్ పే చెయ్యాలి అనిచెప్పడం వెనుక ప్రైవేట్ కొరియర్ సర్వీస్‌ను ప్రోత్సహించటమా అనుమానంగా ఉంది. కొన్నిటికి రిజిస్టర్ చెయ్యాలంటే పోస్టల్ స్టాంపులు తీసుకోండి అంటున్నారు. గగతంలో ఇలా లేదు. డబ్బులు తీసుకొని వాళ్లే వేసేవారు. రైల్వే వాళ్ళు కూడా ఈ మధ్య టికెట్ ఇవ్వమంటే ఎదురుగా ప్రైవేట్ వాళ్ళదగ్గరకు వెళ్ళండి అని అంటున్నారు. ఇలాంటి వాటిని గట్టిగా ఎదుర్కోవలసి వస్తుంది.

– నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం

నీట్ పరీక్షాపేపర్ లీక్ ఉదంతం జరిగిన చాన్నాళ్ల తరువాత ప్రధాని మోడీ పెదవి విప్పారు. నీట్ పేపర్ లీక్ అవటం మహా పాపమని ఈ పాపానికి ఒడిగట్టిన వారిని శిక్షిస్తామని ఫాస్ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని అన్నారు. అన్నట్లుగానే ఆ పని వెంటన చేశారు. విద్యామంత్రి చేత రాజీనామా కూడా చేయించారు. అయితే ఇవన్నీ చేయడంవల్ల విద్యార్థులకు జరిగిన భారీ నష్టం భర్తీ అవుతుందా? చనిపోయిన వారు బతికి తిరిగొస్తారా? ఇలాంటివి జరగకుండా ముందే జాగ్రత్తపడాలి. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. అంతా అయిపోయాక ఎన్ని చేసినా ఏంటి ప్రయోజనం?

– శాస్త్రి, హైదరాబాద్

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

ఉపాధి హామీ లేక కొత్తగా వచ్చిన వీబీజీరామ్‌జీ పథకంలో భాగం అయిన ఉద్యోగుల కోరిక సహేతుకమైనది. వాళ్ళేమి నెల విడిచి సాము చేయడంలేదు. ఉద్యోగంలో స్థిరత్వం అడుగుతున్నారు. మీరు ఇచ్చిన హామీనే కదా మరి మీరెందుకు నాంచుతున్నారు. వాళ్లు కూడా ప్రభుత్వంలో భాగం కావాలి అనుకుంటున్నారు.మీ ఆలస్యమవుతున్న నిర్ణయం వల్ల వాళ్ళ కుటుంబాలు మాత్రమే కాదు ఉపాధి కూలీలు కూడా నష్టపోతున్నారు.ఇదిగ్రామీణ ఆర్థికవ్యవస్థను అస్థిర పరుస్తుంది.

–భారత అవినాష్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఎర్రకోటపై తొలిసారి 'వందేమాతరం'



## స్వాతంత్ర్య వేడుకల్లో కొత్త క్రమం

## జాతీయ గీతానికి ముందు ఆలాపన

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఆగస్టు 15న ఎర్రకోట ప్రాకారాల నుంచి తొలిసారిగా జాతీయ గీతం వందేమాతరం మార్మోగనుంది. ఈ విషయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ గీతానికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. అదే సమయంలో దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. జాతీయ గీతానికి ముందు వందేమాతరం ఈసారి ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కార్యక్రమ క్రమంలో మార్పులు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొలుత ఎర్రకోటకు చేరుకుంటారు. అనంతరం వందేమాతరం గానం జరుగుతుంది. ఆ తర్వాత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించనున్నారు. యువ శక్తి - వికసిత్ భారత్ ప్రయాణానికి నాయకత్వం అనే ఇతివృత్తంతో ఈ ఏడాది వేడుకలు నిర్వహించనున్నారు. దేశ అభివృద్ధిలో యువత పోషిస్తున్న కీలక పాత్రను ఈ థీమ్ ప్రతిబింబించనుంది. ఆహ్వాన పత్రికల్లో పూర్తిస్థాయి గీతంఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రికల్లోనూ రక్షణ శాఖ మరో కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. వందేమాతరం పూర్తి సాహిత్యాన్ని ఆహ్వాన పత్రికలపై ముద్రించింది. ఇందులో జాతీయ గీతంలోని మొత్తం ఆరు చరణాలను పొందుపరిచారు. ఎర్రకోట వేడుకలకు కేంద్ర మంత్రులు, ఉన్నత స్థాయి సైనికాధికారులు, ఉన్నతాధికారులు, దౌత్యవేత్తలు, విద్యార్థులు, వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ప్రముఖులను ఆహ్వానించారు. జాతీయ గీతంతో సమాన హోదాఇటీవలే పార్లమెంట్ ఆమోదించిన జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక (సవరణ)బిల్లు2026తో వందేమాతరానికి జాతీయ గీతంతో సమానమైన చట్టపరమైన హోదా కల్పించారు. సవరించిన చట్టం ప్రకారం వందేమాతరం గానాన్ని అవమానించడం లేదా ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం శిక్షార్హ నేరంగా మారింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. ఇంతకుముందు ఇలాంటి చట్టపరమైన రక్షణ జాతీయ పతాకం, జాతీయ గీతం, రాజ్యాంగానికి మాత్రమే ఉండేది. బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన వందేమాతరం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అత్యంత కీలకమైన దేశభక్తి గీతాల్లో ఒకటిగా నిలిచింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అనేక తరాల స్వాతంత్ర్య సమరయోధులకు ఇది స్ఫూర్తినిచ్చింది. 1882లో బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన ఆనందమఠం నవలలో వందేమాతరం తొలిసారి ప్రచురితమైంది. అనంతరం దాని తొలి పంక్తులను దేశ జాతీయ గీతంగా స్వీకరించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వందేమాతరం జాతీయవాద ఉద్యమానికి ప్రతీకగా మారింది. మాతృభూమి పట్ల ప్రేమ, దేశభక్తి, త్యాగం, ఐక్యత వంటి భావాలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించింది. భారత స్వాతంత్ర్యపోరాటంతో ఉన్న ఈ చారిత్రక అనుబంధం కారణంగా దేశ ప్రజల మనస్సుల్లో వందేమాతరంకు ప్రత్యేకమైన స్థానం ఏర్పడింది.

# వణికిస్తున్న 'డాల్ఫిన్' తుపాను



## సురక్షిత ప్రాంతాలకు పది లక్షలమంది

**బీజింగ్, ఆగస్టు 10:** చైనాలో భారీ వర్షాలు, ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. శక్తివంతమైన డాల్ఫిన్ తుపాను తీరాన్ని తాకడంతో ఆ ప్రాంతం వణుకుతోంది. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగి పడటం, వరదలు పోటెత్తే ప్రమాదం ఉండటంతో తీరప్రాంత నగరాల్లో దాదాపు 10 లక్షల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జెజియాంగ్ ప్రావిన్స్‌లో 1,500కు పైగా తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. షాంఘైలో గత 24 గంటల వ్యవధిలో దాదాపు 313 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. గత 150యేళ్ల చరిత్రలో ఇదే అత్యధిక వర్షపాతమని అధికారులు పేర్కొన్నారు. వందకుపైగా వీధులు జలమయం అవ్వడంతో ఇళ్లలోనే ఉండాలని ప్రజలకు సూచించారు. తుపాను కారణంగా షాంఘైలోని రెండు ప్రధాన విమానాశ్రయాల్లో 1,300కు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. కొండచరియలు విరిగిపడడంతో అనేక ప్రాంతాల్లో రోడ్డు, రైలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. చైనాలోని డాల్ఫిన్ తుపాను ప్రభావం తైవాన్, భారత్‌లపైనా పడే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీని వల్ల చైనా సరిహద్దుల్లో ఉన్న భారత భూభాగంలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి.

**2,230 విమానాలు రద్దు:** చైనా తూర్పు తీరంలోని జెజియాంగ్ ప్రావిన్స్‌ను ఆదివారం మధ్యాహ్నం డాల్ఫిన్ తుపాను తాకింది. ఈ సంవత్సరం చైనాలో సంభవించిన తుపానుల్లో ఇది 13వది. దీంతో చైనా జాతీయ వాతావరణ సంస్థ అత్యున్నత స్థాయి రెడ్అలర్ట్ జారీ చేసింది. ఈ తుపాను వల్ల గాలులు ఒక సెకనుకు 42 మీటర్ల వేగంతో వీస్తున్నాయి. తుపాను కారణంగా షాంఘైలోని రెండు ప్రముఖ విమానాశ్రయాల్లో దాదాపు 2,230 విమానాలు రద్దయ్యాయి. 720 సోమవారం వరకు రద్దయ్యాయి. హాంగ్‌జావ్ నగరంలోని విమానాశ్రయంలో రాకపోకలు సాగించాల్సిన దాదాపు 500 విమానాలు రద్దయ్యాయి.

# జెపిపిఎస్‌సి మాజీ చైర్మన్ అరెస్టు..


## ఉద్రిక్తంగా మారిన విద్యార్థుల ఆందోళన



**రాంచి, ఆగస్టు 10:** జార్ఖండ్‌లో విద్యార్థులు చేపట్టిన ఆందోళన సోమవారం ఉద్రిక్తంగా మారింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. టియర్ గ్యాస్, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. ఈ క్రమంలో పోలీసులకు, విద్యార్థులకు మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. మరోవైపు జేపీఎస్సీ మాజీ ఛైర్మన్ ఎల్ ఖియాంగ్తేను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. జేపీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో యాంగ్తేను సోమవారం అరెస్టు చేశారు. బ్లాక్‌లిస్టులో పెట్టిన టీడీపీఎల్ సంస్థకు ఈ పరీక్షలు నిర్వహించే బాధ్యత అప్పగించడంపై అధికారులు ఆయనను ప్రశ్నించనున్నారు. ఖియాంగ్తే గతంలో జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆ తర్వాత ఆయనను ప్రభుత్వం జేపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించింది. పేపర్ లీకేజీ ఆరోపణలు, విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో గత నెల 22న అతడు తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ లీకేజీపై స్పష్టమైన, నిష్పక్షపాత విచారణ జరగాలనే ఉద్దేశంతోనే తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అరెస్టుకు ముందే సీఐడీ అధికారులు పలుసార్లు ఆయనను ఈ అంశంపై ప్రశ్నించారు. జేపీఎస్సీతోపాటు, జేఎస్ఎస్సీలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీలపై విద్యార్థులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. పరీక్షల్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. సీఎం ఇంటితోపాటు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి నాయకుడు దేవేంద్ర మహతో కూడా ఈ నిరసనకు మద్దతు తెలిపారు. జార్ఖండ్ ప్రతిపక్ష నేత బాబూలాల్ మరాండీ కూడా విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ పేపర్ లీకేజీలపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

# ప్రధాని మోడీతో బాక్సర్ సరదా సంభాషణ

## పగలబడి నవ్విన ప్రధాని



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** క్రీడారంగంలో మైదానంలో జరిగే పోటీలే కాదు, మైదానం బయట జరిగే కొన్ని సంఘటనలు కూడా దశాబ్దాల పాటు గుర్తుండిపోతాయి. అలాంటి ఓ సరదా సంఘటనను భారత బాక్సర్ నరేందర్ బెర్వాల్, ప్రధాని నరేంద్ర మోడీతో పంచుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం గెలిచిన క్రీడాకారులను అభినందించేందుకు ప్రధాని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఆసక్తికర సంభాషణ జరిగింది. నరేందర్ చెప్పిన కథ విని ప్రధాని మోడీ సైతం పగలబడి నవ్వారు. 2015లో జరిగిన వరల్డ్ మిలిటరీ గేమ్స్‌లో తన తొలి బౌట్ పాకిస్థాన్ బాక్సర్‌తో జరిగిందని నరేందర్ గుర్తుచేసుకున్నారు. అది మిలిటరీ గేమ్స్ కావడం, ఇరు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు ఉండటంతో పాకిస్థాన్‌పై ఎట్టిపరిస్థితుల్లోనూ ఓడిపోవద్దని తనకు సైనిక అధికారుల నుంచి ఫోన్లు వచ్చాయని ఆయన వెల్లడించారు. ఆ మ్యాచ్‌లో తాను 41, 32 తేడాతో గెలిచానని, అయితే ఇద్దరికీ గాయాలయ్యాయని తెలిపారు. దీంతో కుట్లు వేయించుకోవడానికి ఇద్దరూ కలిసి ఆసుపత్రికి వెళ్లినట్లు చెప్పారు. ఆసుపత్రిలో జరిగిన సంభాషణను నరేందర్ వివరిస్తూ, 2014లో మీరు తొలిసారి ప్రధాని అయ్యారు. మాతో ఉన్న ఆర్మీ కోచ్ పేరు నరేంద్ర రాణా. నా పేరు నరేందర్. ఈ విషయాలను గమనించిన పాక్ బాక్సర్ నా దగ్గరకు వచ్చి సోదరా, ఒకమాట చెప్పనా అని అడిగాడు. చెప్పమని అన్నానని ఆ పాక్ బాక్సర్ నీ పేరు నరేందర్, నీ కోచ్ పేరు నరేందర్, మీ ప్రధాని పేరుకూడా నరేంద్ర. నాకు ఈ నరేంద్ర అనే పేరు వింటేనే ద్వేషం వచ్చేస్తోందని అన్నాడని నరేందర్ చెప్పగానే ప్రధాని మోడీ ఒక్కసారిగా పగలబడి నవ్వారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ పలువురు క్రీడా కారులతో ప్రత్యేకంగా మాట్లాడి, భారత క్రీడారంగానికి వారు అందిస్తున్న సేవలను అభినందించారు.

# బిజెపికి మేలుచేసే వ్యాఖ్యలు మానుకోవాలి..



## శశిథరూర్‌కు కెసి వేణుగోపాల్ హితవు

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమాన్ని ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన ఉద్యమంతో పోల్చుతూ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో దుమారానికి దారితీశాయి. థరూర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. పార్టీ నేతలంతా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బిజెపికి మేలు చేసేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని వేణుగోపాల్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీపై ఎవరైనా విమర్శలు చేస్తే బిజెపి సంతోషిస్తుందని అయితే థరూర్ ఉద్దేశపూర్వకంగా అలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటారని తాను భావించడం లేదన్నారు. రాహుల్‌గాంధీ కార్యక్రమానికి యువత నుంచి మంచి స్పందన వచ్చిందని వేణుగోపాల్ చెప్పారు. అలహాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జెన్‌జీ యువత పాల్గొందన్నారు. కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. నిరసనల్లో పోలీసుల చర్యతో గాయపడిన విద్యార్థుల సమస్యను రాహుల్‌గాంధీ తొలుత ప్రజల ముందుకు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇటీవల ప్రతిపక్ష పార్టీలు యువతతో ఎందుకు పూర్తిగా అనుసంధానం కాలేకపోతున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉందని శశిథరూర్ అన్నారు. జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనకు వచ్చిన యువతకు రాజకీయ పార్టీల్లోకి రావడానికి సరైన మార్గంకల్పించలేకపోయామని చెప్పారు. రాహుల్‌గాంధీ నిర్వహించిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమానికి జంతర్‌మంతర్ నిరసన స్థాయిలో స్పందన రాలేదా అని ప్రశ్నించగా అవును. అందుకే మనం ఏం చేయలేకపోయామో ఆలోచించాలి అని థరూర్ బదులిచ్చారు. అయితే తన వ్యాఖ్యలను మీడియావక్రీకరించిందని తర్వాత వివరణ ఇచ్చారు. యువతకు రాజకీయాల్లో చోటు కల్పించాల్సిన అవసరాన్ని మాత్రమే చెప్పానని స్పష్టం చేశారు.

# ప్రజల్లోకి వెళ్లేముందు హెడ్‌సెట్ పెట్టుకోండి

## మమతా బెనర్జీపై బెంగాల్ సిఎం సెటైర్లు



**కోల్‌కత్తా, ఆగస్టు 10:** మమతా బెనర్జీ ప్రజల్లోకి వెళ్లేటప్పుడు హెడ్‌సెట్ పెట్టుకుంటే మంచిదని, అప్పుడు దొంగ అంటూ జనం చేసే నినాదాలు వినపడవని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి సూచించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బిజ్‌పూర్‌లో మమత పర్యటన సందర్భంగా ఆమె కాన్వా య్‌పై దాడి జరగడం, నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పోలీసు కస్టడీలో మరణించిన తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్త బిర్జు కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమత ఆదివారం బిజ్‌పూర్‌కు వెళ్లారు. ఈ సమయంలో ఆమె తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. కొందరు నిరసనకారులు మమత కాన్వాయ్‌పైకి బూట్లు, బురద, రాళ్లతో దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ దాడి వెనుక బీజేపీ గూండాలు ఉన్నారని మమత ఆరోపించారు. కారు అద్దాలు తెరిచి ఉంటే తనకు ప్రాణహాని జరిగి ఉండేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మమత ఆరోపణలను సీఎం సువేందు అధికారి పూర్తిగా ఖండించారు. ఇది పూర్తిగా ప్రజా ఆగ్రహం వల్ల జరిగిన ఘటన అని, ఇందులో భారతీయ జనతా పార్టీ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. టీవీ ఫుటేజీలో తనకు బీజేపీ జెండాలు గానీ, తెలిసిన కార్యకర్తల ముఖాలు గానీ కనిపించలేదని ఆయన అన్నారు. మమతకు ఇంకా జడ్‌ప్లస్ కేటగిరీ భద్రత కొనసాగుతోందని, ఈ ఘటన సమయంలో కూడా పోలీసులు ఆమెకు పూర్తి భద్రత కల్పించారని గుర్తుచేశారు. మరోవైపు, మృతుడు బిర్జు కియోట్ కుటుంబ సభ్యులు కూడా మమత రాకను వ్యతిరేకించినట్లు సువేందు తెలిపారు. తమకు రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం ఉందని, అతడి మృతిపై న్యాయం జరగాలని కోరు తున్నారని, మమతను తాము పిలవలేదని కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు.

# అధికారిక కార్యక్రమాల్లో తమిళ తాయ్ వాళ్తు తప్పనిసరి..

## తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

**చెన్నై, ఆగస్టు 10:** తమిళనాడులోని అన్ని అధికారిక కార్యక్రమాల్లో ఇకపై రాష్ట్ర గీతం తమిళ తాయ్ వాళ్తుకే ప్రథమ ప్రాధాన్యం లభించనుంది. కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ సోమవారం తమిళనాడు శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. రాష్ట్రంలోని విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. ముఖ్యమంత్రి విజయ్ సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు దీనికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ వాయిస్ ఓటు ద్వారా ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు వెల్లడించారు.



ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, తమిళ భాష తమ రాష్ట్రానికి ప్రాణనాడి, భావోద్వేగం, అస్తిత్వమని అభివర్ణించారు.



## షరియత్ చట్టం మేరకే ముస్లిం వివాహం

## కర్ణాటక హైకోర్టు తీర్పు

**బెంగళూరు, ఆగస్టు 10:** ముస్లిం వ్యక్తిగత చట్టం (షరియత్ చట్టం) ప్రకారం జరిగిన వివాహం, తదనంతరం 'స్పెషల్ మ్యారేజ్ యాక్ట్, 1954 కింద నమోదు చేయబడినప్పటికీ, ఆ చట్టం (షరియత్ చట్టం) పరిధిలోనే కొనసాగుతుందని కర్ణాటక హైకోర్టు తీర్పునిచ్చింది. 1954 చట్టం కింద నమోదు చేసినంత మాత్రాన అటువంటి వివాహం చట్టపరమైన స్వభావం మారదని లేదా విడాకుల విషయంలో స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ నిబంధనలు వర్తించవని కోర్టు స్పష్టం చేసింది. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్ 27(1)(డి), (ఇ) కింద దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను నిలవదు అని పేర్కొంటూ ఫ్యామిలీ కోర్టు తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ ఒక ముస్లిం భర్త దాఖలు చేసిన అప్పీల్‌ను జస్టిస్ డి.కె. సింగ్, జస్టిస్ టి.ఎం. నాడాఫ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసింది. "సంబంధిత వర్గంయొక్క చట్టం ప్రకారం (అంటే ముస్లింలకు షరియత్ చట్టం, హిందువులకు హిందూ వివాహ చట్టం లేదా క్రైస్తవులకు క్రైస్తవ వివాహ చట్టం మొదలైనవి) జరిగిన వివాహాన్ని కేవలం నమోదు చేసినంత మాత్రాన, ఆ చట్టం ప్రకారం జరిగిన వివాహం అనే స్వభావాన్ని అది కోల్పోదని ధర్మాసనం పేర్కొంది. "సంబంధిత వర్గానికి వర్తించే చట్టం ప్రకారం వివాహం జరిగిన తర్వాత, స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద నమోదు చేసినంత మాత్రాన, అది షరియత్ చట్టం లేదా హిందూ చట్టం లేదా క్రైస్తవ చట్టం ప్రకారం జరిగిన వివాహం అనే స్వభా వాన్ని, ప్రభావాన్ని కోల్పోద్దు అని వ్యాఖ్యానించింది.




## మ్యాగీ నూడుల్స్ వివాదానికి తెర

## 2 క్రిమినల్ కేసులు కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** మ్యాగీ నూడుల్స్‌లో అధిక సీసం కంటెంట్ ఉన్నట్లు గుర్తించారనే ఆరోపణలపై, దాని రిటైలర్లు సరఫరా గొలుసులోని ఇతర వ్యక్తులపై 2015లో దాఖలైన క్రిమినల్ ఫిర్యాదులను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. అసలు పరీక్ష నివేదికలు తదనంతరం చెల్లవని తేలినప్పటికీ విచారణలను కొనసాగించడం కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం కింద రెఫరల్ ఫుడ్ ల్యాబొరేటరీ అయిన మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఎఫ్‌టిఆర్ఐ) ద్వారా మ్యాగీ నూడుల్స్ నమూనాలకు కొత్తగా పరీక్షలు జరపాలని సుప్రీం కోర్టు ఆదేశించిన తర్వాత, ఆ నివేదికలో సీసం పరిమాణం అనుమతించదగిన పరిమితుల్లోనే ఉందని తేలిన తర్వాత, ప్రస్తుత ప్రాసిక్యూషన్‌లకు ఆధారమైన అసలు ఢిల్లీ ఫుడ్ ల్యాబొరేటరీ నివేదికల సాక్ష్య విలువ గణనీయంగా తగ్గిపోయిందని జస్టిస్ మధు జైన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం పేర్కొంది. "బాంబే హైకోర్టు జారీ చేసిన తదుపరి ఉత్తర్వులు, సిఎఫ్‌టిఆర్ఐ ద్వారా కొత్త విశ్లేషణకు దారితీసిన సుప్రీం కోర్టు ఆదేశాలు, ఎన్‌సిడిఆర్‌సి ముందు జరిగిన విచారణల ముగింపు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ హైకోర్టులు వెలువరించిన తదుపరి తీర్పులను పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుత ప్రాసిక్యూషన్‌లను కొనసాగించడానికి అనుమతించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ప్రాసిక్యూషన్ పునాదే గణనీయంగా బలహీనపడినప్పటికీ, ఫిర్యాదులను కొనసాగించడం పిటిషనర్లను సుదీర్ఘమైన క్రిమినల్ విచారణకు గురిచేస్తుంది" అని ఢిల్లీ హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది రాజేష్ బాత్రా, ప్రతివాది తరఫున ఎపిపి దిగమ్ సింగ్ దాగర్ వాదనలు వినిపించారు.



# సీటు బెల్టు పెట్టుకోనని చిన్నారి మారాం..

## ఏకంగా విమాన సర్వీస్ రద్దు

**ఒట్టావా, ఆగస్టు 10:** ఓ చిన్నారి సీట్‌బెల్ట్ పెట్టుకోకపోవడంతో ఏకంగా విమాన సర్వీసునే రద్దు చేశారు. ఈ ఘటన కెనడాలో చోటుచేసుకుంది. అధికారుల కథనం ప్రకారం.. విక్టోరియా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పోర్టర్ ఎయిర్‌లైన్స్ విమానం టొరంటోకు వెళ్లడానికి సిద్ధమైంది. రన్‌వేపై టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న సమయంలో విమానంలోని ఓ చిన్నారి సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా సీటుపై నిల్చొని ఉండడాన్ని సిబ్బంది గమనించారు. పాప తల్లి, క్యాబిన్ సిబ్బంది కలిసి సీట్‌బెల్ట్ పెట్టడానికి కొన్ని నిమిషాల పాటు ప్రయత్నించారు. అయితే చిన్నారి ఎంతకూ వినకుండా ఏడుస్తూ.. మారాం చేయడంతో ఏమీ చేయలేకపోయారు. సీట్‌బెల్ట్ పెట్టుకోకపోతే విమానాన్ని టేకాఫ్ చేయడం సురక్షితం కాదని భావించిన సిబ్బంది వారిని దించేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో విమానం తిరిగి టెర్మినల్‌కు వెళ్లింది. చిన్నారిని, వారి తల్లిదండ్రులను విమానం నుంచి దించేసి.. నిబంధనల ప్రకారం వారి ఫ్లైట్ ప్లాన్‌లను తిరిగి ఫైల్ చేసేసరికి రాత్రి 12.30 గంటలు దాటింది. ఆ సమయానికి రన్‌వేను మూసివేయడంతో విమానం సర్వీసు రద్దు చేశారు. దీంతో అందులోని ప్రయాణికులు రాత్రి విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. మరునాడు వారిని అదే విమానంలో గమ్య స్థానాలకు తీసుకెళ్లారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎయిర్‌లైన్స్ క్షమాపణలు తెలియజేసింది.


# సంక్షిప్త వార్తలు

## రైట్‌వింగ్ విశ్లేషకుడు మోహన్‌దాస్ అరెస్టు




**కొచ్చి, ఆగస్టు 10:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై, ముఖ్యంగా మహిళలపై అత్యంత హేయమైన, హింసాత్మక వ్యాఖ్యలుచేసిన ప్రముఖ రైట్‌వింగ్ విశ్లేషకుడు టి.జి. మోహన్‌దాస్‌ను కేరళ పోలీసులు అరెస్ట్‌చేశారు. కొచ్చి లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు, సోమవారం ఉదయం అరెస్ట్‌ను అధికారికంగా నమోదు చేశారు. ఈ ఘటన కేరళలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. మోహన్‌దాస్ తన పత్రిక అనే యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేసిన వీడియోలో ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

## అయోధ్య సిఇఒ పోస్టుకు 18 మందితో జాబితా



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టు కోసం 18 మందిని ఇంటర్వ్యూ కోసం షార్ట్‌లిస్టు చేశారు. రామాలయం ఈసీవో పోస్టు కోసం సుమారు 5300 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. స్క్రీనింగ్ కమిటీ సుమారు 18 మంది అభ్య ర్థులను ఇంటర్వ్యూ కోసం షార్ట్‌లిస్టు చేసింది. అయితే అడ్మినిస్ట్రేటివ్ అనుభవం ఉన్న వారికి ప్రాముఖ్యత ఇవ్వనున్నారు. షార్టలిస్టు అయిన అభ్యర్థులను మంగళ, బుధవారం ఆలయ పరి సరాల్లోనే ఇంటర్వ్యూ చేయనున్నారు.

## భౌతిక శాస్త్రవేత్త దీపక్‌ధర్‌కు అరుదైన పురస్కారం



**న్యూఢిల్లీ ఆగస్టు 10:** భారతదేశపు ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, ఐఐఎస్ఎస్ఏ ప్రొఫెసర్ దీపక్‌ధర్ అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. భౌతిక శాస్త్రరంగంలో అత్యున్నత పురస్కారాలలో ఒకటిగా భావించే 2026 డిరాక్‌మెడల్‌ను ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్ ప్రకటించింది. గతంలో స్టీఫెన్ హాకింగ్స్ వంటి దిగ్గజాలు అందుకున్న ఈ పురస్కారం, సైద్ధాంతిక భౌతిక శాస్త్రంలో విశేష కృషి చేసిన వారికి లభిస్తుంది. ఈ ఏడాది ఈ గౌరవం పొందిన నలుగురు శాస్త్రవేత్తలలో ప్రొఫెసర్ ధర్ ఒకరు.

## అసోం-అరుణాచల్ సరిహద్దులో కాల్పులు, 8 మందికి గాయాలు



**గువాహతి, ఆగస్టు 10:** అసోం-అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. మింగ్‌మాంగ్ బడాతి ప్రాంతంలో అరుణాచల్‌ప్రదేశ్ వైపునుంచి గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది గ్రామస్థులు గాయపడ్డారు. గోగాముఖ్ రెవెన్యూ సర్కిల్ పరిధిలోని సరిహద్దు ప్రాంతంలో ఈఘటన జరిగింది. అసోం భూభాగంలో అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమణకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఇరువర్గాలమధ్య వివాదంతలెత్తింది. దీంతో అరుణాచల్ వైపునుంచి వచ్చిన వ్యక్తులు అసోం గ్రామస్థులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు సమాచారం.

## బెంగాల్ రైతును కిడ్నాప్ చేసిన బంగ్లాదేశీయులు..



**జల్‌పాయ్‌గురి, ఆగస్టు 10:** పశ్చిమ బెంగాల్‌లోని జల్‌పాయ్‌గురి జిల్లా సరిహద్దులో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సరిహద్దు భద్రతా దళం ఒక బంగ్లాదేశీ చొరబాటుదారుడిని అరెస్ట్ చేసి నందుకు నిరసనగా బంగ్లాదేశీయులు భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించి దీపాంకర్ గోప్ అనే భారతీయ తేయాకు రైతును అపహరించి బంగ్లాదేశ్‌కు తీసుకెళ్లారు. తమ దేశానికి చెందిన వ్యక్తిని భారత్ విడుదల చేస్తేనే, రైతును తిరిగి పంపిస్తామని బంగ్లాదేశ్ సరిహద్దు బలగాలు, స్థాని కులు దబాయిస్తున్నట్లు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** ట్రిబ్యునళ్ల నియామక ప్రక్రియను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సోమవారం సభలో వివిధ అంశాలపై విపక్షాల నినాదాల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లుమూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ బిల్లును సభలో లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

## గాంధీభవన్‌లో రేపు మంత్రి శ్రీధర్‌బాబు

### ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం

**హైదరాబాద్,ఆగస్టు 10,ప్రభాతవార్త:** ప్రజలతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరుకావడానికి రాష్ట్రశాసనసభవ్యవహారాలు,ఐటి పరిశ్రమలు వాణిజ్యం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం గాంధీభవన్‌కు రానున్నారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు ఆయన గాంధీభవన్‌లో ప్రజల సమస్యలు వింటారు. విన్నపాలను స్వీకరిస్తారు. ఏదైన వెంటనే పరిష్కరించే అంశాలు ఉంటే సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీచేసి పరిష్కారం చూపుతారు. సాంకేతిక పరమైన అంశాలపై తగు వివరణ జరిపి సాధ్యమైనంత తొందరగా సమస్యలు పరిష్కారం చేయడమో లేదా ఇతర ఏమైనా మార్గాలు ఉంటే చూపడమో పరిష్కారంకు నోచుకోని అంశాలను ఎందుకు చేయబడవో వివరణ ఇవ్వే ప్రయత్నం చేస్తారు. వ్యక్తిగత సామాజిక సమస్యల పరిష్కార వేదికగా ఈ గాంధీభవన్‌లో జరిగే ప్రజలతో ముఖాముఖి ఉపయోగపడుతున్నది.

## మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్నారు

### కెటిఆర్‌పై బిజెపి ఎంపి రఘునందన్‌రావు విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** గోదావరి నదీజలాల విషయంలో బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందని బిజెపి ఎంపి రఘునందన్ రావు ఆరోపించారు. కేంద్రంపై బురద జల్లాలని చూస్తున్నారని, తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తోందంటూ మాజీ మంత్రి హరీష్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ ను రెచ్చగొట్టాలని చూస్తున్నారని రఘునందన్ రావు విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ కు ప్రజలే బుద్ధి చెబుతారని తెలియజేశారు. ఓట్లు, సీట్ల కోసం ప్రజలను రెచ్చగొట్టొద్దు అని ఎంపి రఘునందన్‌రావు హెచ్చరించారు.

## డిఫెన్స్ కారిడార్‌గా హైదరాబాద్-బెంగళూరు

### రక్షణ, ఎయిరోస్పేస్ కారిడార్‌గా కేంద్రం అధికారికంగా ప్రకటించాలి

### రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ప్రభుత్వ సలహాదారు ఎపి జితేందర్‌రెడ్డి భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** హైదరాబాద్-బెంగళూరు రక్షణ పారిశ్రామిక కారిడార్ ను కేంద్ర ప్రభుత్వ రక్షణ, ఏరోస్పేస్ కారిడార్ గా అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఎపి జితేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం న్యూఢిల్లీలోని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధికారిక నివాసంలో ఆయనను కలిశారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన రక్షణ కారిడార్లతో సమానంగా దీనికి ప్రాధాన్యం, ప్రోత్సాహం కల్పించాలని కోరారు. దేశంలోని అతిపెద్ద ఏరోస్పేస్, రక్షణ రంగ కేంద్రాల్లో హైదరాబాద్ ఒకటని ఆయన కేంద్ర మంత్రికి వివరించారు. హైదరాబాద్లో డజనుకు పైగా ప్రధాన రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, వ్యూహాత్మక డిఆర్‌డివో ప్రయోగశాలలతోపాటు 1,500కు పైగా ఏరోస్పేస్, రక్షణ రంగ ఎంఎస్ఎంఇలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి ఏరోస్పేస్, రక్షణ రంగ ఎగుమతులు 100 శాతం వృద్ధి నమోదు చేశాయని పేర్కొన్నారు.1 ప్రతిపాదిత కారిడార్ తో స్వదేశీ రక్షణ ఉత్పత్తి వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని.. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు వేగవంతమవుతాయని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన, సామర్థ్యాభివృద్ధికి ఇది దోహదపడటంతోపాటు దేశ రక్షణ సన్నద్ధతకు, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి గణనీయమైన తోడ్పాటునందిస్తుందని వివరించారు. ఈ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనను తగిన విధంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జితేందర్‌రెడ్డి వెంట ఖమ్మం ఎంపి ఆర్.రఘురాంరెడ్డి, మహబూబాబాద్ ఎంపి బలరాంనాయక్ ఉన్నారు.

## బండి సంజయ్ జీవితమంతా మతం పేరు చెప్పుకుని బతకడమే

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ విమర్శ

**హైదరాబాద్, ఆగస్టు 10,ప్రభాతవార్త:** మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడమే బిజెపి నాయకుల పనైతే అందులో బండి సంజయ్ బతుకంతా మతం పేరు చెప్పుకుని బతకడమే అని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం సిఎల్పిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 250కోట్లతో వేములవాడ దేవస్థానం పునరుద్దరణ చేస్తున్నామని కేంద్రం నుంచి కనీసం దేవాలయాల అభివృద్ధికి కూడా నిధులు తేలేదని ఆవేదన చెందారు.రాష్ట్రవ్యాప్తంగా అద్భుతంగా బోనాల పండుగ జరిగిందనీ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లను పెద్ద ఎత్తున చేశామనీ మా సిఎం స్వయంగా సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి గుడిని సందర్శించారనీ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి బోనం, పట్టువస్త్రాలు సమర్పించామని తెలిపారు.బోనాల కోసం ప్రతి గుడికి నిధులు ఇచ్చామనీ తెలిపారు.అయినా బండి సంజయ్ బోనాల పండుగను కూడా రాజకీయం కోసం ఉపయోగించుకోవడం సంస్కృతి కాదని హితవు చెప్పారు..మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలోనే రాష్ట్రంలోని పలు దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామని, హైందవ ధర్మాన్ని కాపాడటం కోసం ప్రాచీన దేవాలయాలను పునరుద్ధరిస్తున్నామనీ అన్నారు.

# 'సర్'పై అప్రమత్తంగా ఉండండి

### ఉదాసీనంగా ఉన్న బిఎల్ఎలను తొలగించండి

### జూమ్ మీటింగ్‌లో నాయకులతో

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు 10,ప్రభాతవార్త:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా మొదటి దశ ప్రక్రియ కంటే రెండో దశలో బిఎల్‌ఏ లు మరింత అప్రమత్తంగా ఉండాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం ఎస్ఐఆర్ పురోగతిపై ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ ప్రతినిధులతో జూమ్ సమావేశం ఐఏసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ప్రత్యేక ఆహ్వానితుల సమక్షంలో జరిగింది. ఈ సమావేశాలలో ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తోపాటు ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, ఎంపిలు, ఎమ్మెల్యేలు పార్లమెంట్, అసెంబ్లీ ఇంచార్జ్ లు, ఎస్ ఐ.ఆర్ ఇంచార్జ్ లు, పాల్గొన్నారు. మొదటి దశ సోమవారం రోజు తో పూర్తి అయిందని, మంగళవారం నుంచి రెండో దశ ప్రారంభం అవుతుంది ఇప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.ఇప్పటి వరకు ఎన్రోల్ మెంట్ ప్రక్రియ అయిందని ఇక నుంచి అనమాలిస్ లిస్ట్ లను జాగ్రత్తగా గమనించాలని అన్నారు. ఇదే చాలా కీలకమైన ఘట్టమని అన్నారు. కాంగ్రెస్ కు అనుకూలంగా ఉన్న వర్గాల ఓటర్ లను తొలగించే కుట్ర జరుగుతోందని మనం పశ్చిమ బెంగాల్ ను ఉదాహరణగా తీస్కొని గట్టిగా పని చేయాలని అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడాలని అన్నారు.బిఎల్ ఏ లు చాలా క్రియాశీల పాత్ర లో పని చేయాలని లేకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని అన్నారు. ఈ విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా సహించేది లేదని పని చేయని వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని సూచించారు. సోమవారం నుంచి పార్లమెంట్ ల వారీగా ఎస్ఐఆర్ సమావేశాలు ప్రారంభం చేశారు.తొలిరోజు సమావేశంలో అనేక క్షేత్రస్థాయి వైరుద్యాలపై మీనాక్షి నటరాజన్ అడిగి తెలుసుకొని వాటి పరిష్కారంకు అనుసరించాల్సిన విధానం కూడా వివరించారు.

# తరతరాలకు స్ఫూర్తి మహనీయుల విగ్రహాలు

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

### సచివాలయం ఎదురుగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహరాజ్ విగ్రహం ఆవిష్కరణ



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376వ జయంతి జాతీయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్, వి.రామారావుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యంగౌడ్ తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 10, ప్రభాతవార్త :** మనం మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నది కేవలం దండవేసి దండం పెట్టడానికి కాదని, వారి ఆశయాలు చేసిన మంచి పనులు, సూచించిన సన్మార్గాలను ముందుకు సాగించే స్ఫూర్తి కోసమేనని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణలో బిసిలతోపాటు అన్నికులాలకు సమాన అవకాశాల కోసం రాజకీయాలకు అతీతంగా సర్వాయి పాపన్నను ఆదర్శకంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మేమూ రాజులమే.. మేము కూడా పాలించగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేదర, వెనుకబడినవర్గాల్లో కల్పించిన గొప్పవ్యక్తి పాపన్నగౌడ్ అని కొనియాడారు. ఈ నెల 18న రాష్ట్ర సచివాలయం ఎదురుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇదే సందర్భంగా మహాత్మా జ్యోతి బాపూలే, సావిత్రిబాయిల విగ్రహాల నిర్మాణం కూడా త్వరలో పూర్తిచేస్తామన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న మహరాజ్ ధర్మపరిపాలన సంస్థ జైగౌడ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం రవీంద్ర భారతిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహరాజ్ 376వ జయంతి జాతీయ వారోత్సవాలు జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహేష్‌కుమార్‌గౌడ్ విశిష్ట అతిథులు ఆజయ్ లొల్లు, మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, సత్యం గౌడ్, కర్ణాటక సీఎం ఓఎస్డీ శ్రీనివాస్, బాలగోని బాలరాజ్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, విజయ్ కుమార్, సత్యనారాయణగౌడ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి మహరాజ్ పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించి మాట్లాడారు. త్వరలో గౌడ ఆత్మగౌరవ భవనం పూర్తి చేస్తామని, అదేవిధంగా జిల్లాలకు పాపన్న పేరుపెట్టాలని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వే షన్లు చేస్తూ అసెంబ్లీలో తీర్మానిస్తే రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు మద్దతునిచ్చినా, కేంద్రంలో బిజెపి అందుకు అడ్డుపడుతుందని విమర్శించారు. బిసిలు తమ హక్కుల కోసం పోరాడితే కొందరు దానిని ఇతరులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చిత్రించడం శోచనీయమన్నారు. బిసిలు అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

# ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి నిబంధనను తొలగించాలి

### సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో దేశవ్యాప్తంగా ర్యాలీలు

### జైపూర్‌లో ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ కౌన్సిల్ సమావేశం తీర్మానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి నిబంధనను తొలగిస్తూ విద్యాహక్కు చట్టాన్ని సవరించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పాఠశాలల విలీనం, మూసివేతలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాన్ని నిర్వహించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టిఎఫ్ఐ) జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. ఎస్టిఎఫ్ఐ జాతీయ కార్యవర్గం, జాతీయ కౌన్సిల్ సమావేశాలు సిఎన్ భార్తి అధ్యక్షతన రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ లో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జరిగాయి.

ప్రధాన కార్యదర్శి చావ రవి సమావేశాన్ని ప్రారంభించిన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం అమలు కారణంగా గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా లక్ష పాఠశాలలు మూతపడ్డాయని, ప్రభుత్వ పాఠశాలల్లో రెండు కోట్ల మంది విద్యార్థులు తగ్గారని ఆందోళన వ్యక్తంచేశారు. శాశ్వత నియామకాల స్థానంలో తక్కువ వేతనాలతో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నియామకాలు చేసి అధికారిక శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చిన 15 సంవత్సరాల తర్వాత సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష ను తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం విచారకరమని, ఆ తీర్పు 25 లక్షల మంది ఉపాధ్యాయుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిందని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని విద్యా హక్కు చట్టం సెక్షన్ 23 ను సవరించి వారికి ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు సిఎన్ భార్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే 8వ పే కమిషన్ నివేదికను తెప్పించుకుని 2026 జనవరి 1 నుండి అమలు చేయాలని, ఉద్యోగుల ఆదాయపు పన్ను పరిమితిని సవరించాలని, విద్యా రంగంలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించాలని, టెట్ సమస్య పరిష్కారానికి అ ఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (ఎఐ జాక్టో) సమావేశంలో చర్చించి జాతీయ స్థాయిలో ఐక్య కార్యాచరణను రూపొందించుకోవాలని సమావేశం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్రాలకు సంబంధించిన పలు అంశాలపై తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

# పాత పెన్షన్ అమలుకు చర్యలు

### సిఎం, డిప్యూటీ సిఎంలతో మాట్లాడి సానుకూల నిర్ణయం తీసుకుంటాం: పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ హామీ

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** పదవీవిరమణ పొందిన ఉద్యోగులు ఆర్థిక అనిశ్చితికి గురికాకుండా పాత పెన్షన్ విధానం అమలుపరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో చర్చించి న్యాయం చేసేదిశగా చొరవ తీసుకొంటానని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థిత ప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ని కలిసి రాష్ట్రంలో 2.6 లక్షల మందిని సామాజిక అభద్రతకు గురిచేస్తున్న సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా సిపిఎస్ఇ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని గుర్తుచేశారు.

కాంగ్రెస్‌పాలిత హిమా చల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి కేబినెట్ మీటింగ్‌లోనే ఒపిఎస్‌ను అమలు చేసిందని, కానీ తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఇంత కాలమవుతున్నా ఇంకా అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 22 యేళ్లుగా సిపిఎస్ వల్ల ఉద్యోగులు తీవ్ర సామాజిక భద్రతా లోపానికి గురవుతున్నారని, రాష్ట్రంలో రిటైర్‌మెంట్ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఏ ఒక్కరికీ కనీస పెన్షన్ రూ. 9,500 కూడా రావడం లేదని విచారం వ్యక్తం చేశారు. పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పూర్తి సానుకూలంగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. 'ఇతర కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పాతపెన్షన్ విధానాన్ని అమలు చేశాం. ఇది కాంగ్రెస్ పార్టీ ఎజెండాలో ఉంది. ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎంతోపాటు ప్రభుత్వంతో ఈ విషయంపై చర్చిస్తాను. త్వరలోనే ఉద్యోగులకు సానుకూలమైన నిర్ణయం వచ్చేలా కృషి చేస్తాను' అని స్పష్టమైన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ మల్లికార్జున్, హైదరాబాద్ జిల్లా కోశాధికారి శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# పాల సేకరణ ధర పెంపు

### లీటరుకు రూ.1.50 పెరుగుదల

### విజయ డెయిరీ ఛైర్మన్ అమిత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పాల సేకరణ ధర పెంచుతూ విజయ డెయిరీ బోర్డు సమావేశం నిర్ణయం తీసుకుంది. విజయ డెయిరీకి పాలను విక్రయించే పాడి రైతులకు ప్రస్తుతం చెల్లిస్తున్న ధరపై అదనంగా మరో రూ.1.50 పెంచాలని బోర్డు సమావేశంలో తీర్మానించినట్లు విజయ డెయిరీ కార్పొరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ఆగస్టు 2న లీటర్‌కు రూ.2 ప్రీమియం పెంచామని, దీంతో లీటరు రూ.39 చెల్లిస్తున్నట్టు చెప్పారు. ఆగస్టు 16 నుంచి మరో రూ.1.50 పెంచడంతో లీటర్‌కు రూ.41 చెల్లించాలని నిర్ణయించినట్టు తెలిపారు. మూడు నెలల పాటు ఈ పెంచిన ధరలను రైతులకు చెల్లిస్తామని వెల్లడించారు. పాడి రైతులను ఆదుకొని, పాల దిగుబడులు పెంచేందుకు చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 16 నుంచి విజయ డెయిరీకి పాలు విక్రయించే పాడి రైతులకు ప్రస్తుతం చెల్లిస్తున్న ధరపై ఈ పెంపుదలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

**నేటి నుండి పాల ధరలు పెంచిన మహారాష్ట్ర**

మహారాష్ట్రలో వినియోగదారులకు షాక్ ఇస్తూ పాల సంఘాలు అనూహ్య నిర్ణయం తీసుకున్నాయి. రాష్ట్రంలో గేదె పాలు, ఆవు పాలు రెండింటి ధరలను లీటరుకు రూ.2 చొప్పున పెంచుతూ మిల్క్ ప్రొడ్యూసర్స్ అండ్ ప్రాసెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పెరిగిన నూతన ధరలు ఈ నెల 11వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. పాల ఉత్పత్తి వ్యయం పెరగడం, పశుగ్రాసం ధరలు అధికమవడం వంటి పలు కారణాల రీత్యా ఈ ధరల సవరణ అనివార్యమైందని నిర్వాహకులు తెలిపారు. ఆగస్టు 11 నుంచి అమల్లోకి రానున్న ఈ నిర్ణయంతో మహారాష్ట్ర వ్యాప్తంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల రోజువారీ బడ్జెట్‌పై అదనపు భారం పడనుంది.

## ఖమ్మం తల్లాడ రైస్‌మిల్లుపై విజిలెన్స్ దాడులు

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా తల్లాడలోని విజయదుర్గ రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడుల చేసి రూ.7.7కోట్ల ధాన్యం గల్లంతైనట్లు గుర్తించారు. విజిలెన్స్ అధికారులు సివిల్‌సప్లయ్ అధికారులను తీసుకొని తనిఖీచేశారు. వరంగల్ విజిలెన్స్ సిఐ కిషోర్, ఎంఆర్ఐ భాస్కర్,డిటి విజయ్‌బాబు నరేష్‌లు ఆకస్మిక తనిఖీ బృందం ఆదివారం రాత్రి నుంచి స్టాక్‌ను మొత్తం పరిశీలించి లెక్కకట్టారు. 2025-26 ఖరీఫ్, రబి సీజన్‌లో మిల్లుకు అప్పగించిన ధాన్యం రికార్డులను వాస్తవంగా ఉన్న నిల్వలను తనిఖీచేయగా 2,449 మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తల్లడ మండలం సివిల్‌సప్లయ్ డిప్యూటి తహసిల్దార్ సోమవారం స్థానికపోలీసు స్టేషన్‌లో విజయదుర్గ రైస్‌మిల్లు ఓనర్‌పై ఫిర్యాదు చేశారు. భారత న్యాయ సంహిత సెక్షన్ 316(5) 318(4) అత్యవసర సరుకుల చట్టం కింద 190/2026 కేసు నమోదు చేశారు. రైసుమిల్లు యజమాని బండారు నరసిహంరావును వైరా సిఐ వెంకట ప్రాసద్ అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

## ఎన్పీడిసిఎల్ ఆధ్వర్యంలో నేటి నుండి రెండురోజుల క్రీడా టోర్నమెంట్లు

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు క్రీడా టోర్నమెంట్లను నిర్వహించనున్నారని యాజమాన్యం ప్రకటించించింది .2026-27 సంవత్సరానికి సంబంధించిన ఈ క్రీడా పోటీలు ఈ నెల 11, 12 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం( జెఎన్ ఎస్)లో నిర్వహించనున్నారు. ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వరంగల్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా టోర్నమెంట్లను ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 18 సర్కిళ్లకు చెందిన పురుష, మహిళా ఉద్యోగులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ రెండు రోజుల క్రీడా పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొనేందుకు వీలుగా మొత్తం ఆరు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. అవి బ్యాడ్మింటన్, క్రికెట్, క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్.టీజీఎన్‌పీడీసీఎల్‌లో వివిధ క్రీడాంశాల్లో పురుష, మహిళా ఉద్యోగులు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించడం ద్వారా ఉద్యోగుల్లో టీమ్ స్పిరిట్, ఆరోగ్యకరమైన పోటీ తత్వం, స్నేహభావం, ఉత్సాహం పెంపొందించడమే లక్ష్యంగా సంస్థ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని యాజమాన్యం తెలిపింది. ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి సంస్థ ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడలు ఉద్యోగుల్లో శారీరక దృఢత్వంతో పాటు కార్యాలయ విధుల్లో మరింత ఉత్సాహంగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని యాజమాన్యం పేర్కొంది.

## విద్యుత్ వాహనాల పన్ను రాయితీ పొడిగింపు

### ప్రతిపాదనను సిద్ధం చేస్తున్న అధికారులు

### ఈ యేడాది 1.58 లక్షల వాహనాల కొనుగోలు

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పన్ను రాయితీని మరి కొంత కాలం పొడిగించేందుకు సిద్ధమవుతోంది. ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీలను) ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి ప్రవేశపెట్టిన పన్ను మినహాయింపు వల్ల వాటి రిజిస్ట్రేషన్లలో గణనీయమైన పెరుగుదలకు దారితీసినట్లు అధికారులు గుర్తించారు. పన్ను మినహాయింపు ప్రవేశపెట్టక ముందు తెలంగాణలో 47,730 విద్యుత్ వాహనాలు రిజిస్ట్రేషన్ జరిగాయి. అయితే ప్రభుత్వం 2024 నవంబరులో విద్యుత్ వాహనాలకు జీవిత పన్ను (లైఫ్ టాక్స్), త్రైమాసిక పన్ను (క్వార్టర్లీ టాక్స్)పై మినహాయింపు ప్రవేశపెట్టిన తర్వాత రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరిగాయి. కేవలం 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 91,572 విద్యుత్ వాహనాలు రిజిస్ట్రేషన్ అయినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పన్ను రాయితీతో ఈ ఏడాది కూడా విద్యుత్ వాహనాల కొనుగోళ్లు వేగంగా పెరిగాయి. జూన్ నాటికి రాష్ట్రంలో 1.58 లక్షల కొత్త విద్యుత్ వాహనాలు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇదే సమయంలో పన్ను రాయితీ వల్ల రాష్ట్ర ఖజానాకు ఆదాయంలో తగ్గుదల చోటు చేసుకుంది. పన్ను మినహాయింపు కారణంగా గత ఏడాది నవంబరు నుండి ఈ ఏడాది జూన్ నెల మధ్య కాలంలో ప్రభుత్వం దాదాపు రూ.1,483 కోట్లను కోల్పోయినట్లు అంచనా. అయినా విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రోత్సాహకాన్ని ప్రస్తుత గడువు తర్వాత కూడా పొడిగించాలని భావిస్తున్నారు. దీంతో ఇందుకవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉందని అధికారవర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే అమలు చేస్తున్న పన్ను రాయితీ పథకం డిసెంబర్ 2026 వరకు కొనుగోలు చేసిన విద్యుత్ వాహనాలకు వర్తిస్తుంది.

# సూర్యచంద్రులున్నంతకాలం జనం మదిలో పెద్ది

### మాజీ మంత్రి కెటిఆర్

### జనసముద్రంగా మారిన నల్లబెల్లి మండల కేంద్రం

### అశేష అభిమానుల మధ్య పెద్ది సంతాప సభ



పెద్ది సంస్మరణ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు

**నల్లబెల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త:** అపర భగీరధుడు రైతు పక్షపాతి తెలంగాణ ఏర్పాటు మలిదశ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సూర్య చంద్రులు ఉన్నంతకాలం జనం మదిలో ఉంటాడని బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఐటి శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇటీవల గుండపోటుతో అస్వస్థతకు గురై మృతి చెందిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని వేలాది జనం, అభిమానుల మధ్య సోమవారం జరిగింది. నల్లబెల్లి గ్రామం అంతా 50 వేల మందితో కిటకిటలాడింది ఎటు చూసినా జన సముద్రం ఎటు చూసినా వాహనాలే వీరందరికీ నాలుగు చోట్ల భోజన సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథు లుగా మాజీ ఐటీ శాఖ మంత్రి భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యనిర్వహణ అధ్యక్షుడు కల్వ కుంట్ల తారక రామారావు, మాజీ భారీ నీటి పారుదల శాఖ మంత్రి, ప్రస్తుత అసెంబ్లీ ప్రతిపక్ష నేత తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. ముందుగా పెద్ది చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం పెద్ది చిత్రపటాలపై పుష్పవర్షం కురిపించారు.

**సూర్యచంద్రులున్నంతకాలం జనం మదిలో పెద్ది : కెటిఆర్**

సూర్యచంద్రులు ఉన్నంతకాలం పెద్ది ఈ ప్రాంత ప్రజలతోపాటు మనందరి మదిలో ఉంటాడని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమాన్ని వినూత్న రీతిలో ప్రజల్లోకి తీసుకువెళ్లి రాష్ట్ర ఏర్పాటు ధ్యేయంగా ముందుకు నడిపించిన మహనీయుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారు. బడ్జెట్లో లేని అంశాన్ని సైతం ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఒప్పించి రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నీ ఒప్పించి అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయించి వ్యవసాయ రంగంపై తనకున్న మక్కువ అందరికీ అన్నం పెట్టే అన్నదాతలపై తనకున్న వల్లమాలిన ప్రేమ కు నిదర్శనంగా సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు ఇప్పించిన మహనీయుడు పెద్ది అని వారు పేర్కొన్నారు. సుమారు 100 కోట్ల పైచిలుకు నిధులను నర్సంపేట ప్రాంతానికి తెప్పించి రాజకీయాలకు అతీతంగా పంట నష్టపరిహారం అన్నదాతలకు అందించి రైతు పక్షపాతిగా పెద్ది పేరు తెచ్చుకున్నాడు అన్నారు. 100 సంవత్సరాలు ఒక వ్యక్తి బ్రతికుండడం గొప్పకాదు కొన్నాళ్లు బ్రతికిన వ్యక్తి జనం గుండెలో ఎప్పటికీ బ్రతికుండడమే గొప్ప అలాంటి వ్యక్తి పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు.

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే ఉద్యమ కెరటం మన మధ్యలో లేడని బాధే తప్ప ఆయన ఎక్కడో లేడు మనందరి మదిలో ఉన్నాడని మాజీ మంత్రి, ప్రతిపక్ష నేత హరీశ్‌రావు పేర్కొన్నారు. అనంతరం పెద్ది జీవిత చరిత్రపై పలువురు సిడిలు రాసిన పుస్తకాలను కేటీఆర్ హరీష్ రావులు ఆవిష్కరించారు. సంతాప సభ ప్రారంభం నుండి చివరి వరకు కళాకారులు పాడిన పాటలు పల్లె సిద్ధులు బిఆర్ఎస్ శ్రేణులను అలరించాయి మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఎర్రోళ్ల శ్రీనివాస్ లు దగ్గరుండి సంతాప సభ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎవరికి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు పోలీసు ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి.ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీఎంపీ మాలోత్ కవిత,మాజి జెడ్పి ఛైర్మన్ సాంబారి సమ్మారావు. మాజీ ఎంపీ మాజీ ప్రభుత్వ పద్దుల ఛైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్. మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్ రెడ్డి నాయక్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు హరిచంద్ర, లింగంపల్లి కిషన్ రావు. రైతు రుణ విమోచన మాజీ రాష్ట్ర ఛైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు. మాజీ జెడ్పీ ఛైర్మన్ గండ్ర జ్యోతి. మాజీ చీఫ్ విప్ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్. మాజీ ఎమ్మెల్యే ఒడుతల సతీష్ వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఎనుగుల రాకేష్ రెడ్డి. మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య.. మాజీ ఎమ్మెల్యే నన్నెపునేని నరేందర్. మాజీమంత్రి గంగుల కమలాకర్. మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి. ఎమ్మెల్యే కలర్ నాగేశ్వర్ రెడ్డి. ఏపూరి సోమన్న. రాష్ట్ర నాయకురాలు డాక్టర్ హరి రమాదేవి, పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు కవులు కళాకారులు స్థానిక నాయకులు కార్యకర్తలు పెద్ద అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## మోడీ తీరు మారకుంటే పతనమే

**కార్పొరేట్, సంపన్నుల సేవలో కేంద్ర సర్కార్**

**అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతల విమర్శ**

**ఖమ్మంలో విజయవంతమైన జైల్ భరో**

**వందలాది మంది అరెస్టు**

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** మోడీ తీరు మారకుంటే పతనం తప్పదని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. కార్మిక హక్కులను హరించి వేస్తూ లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకు వచ్చారని వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టి రైతును భూమి నుంచి తరిమేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఇందుకు ప్రతిఫలం అనుభవించక తప్పదని నేతలు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు ఖమ్మంలో సోమవారం జైల్భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాది మంది రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. పోలీసులు అఖిలపక్ష నేతలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వందల సంఖ్యలో ఆందోళనకారులు తమను కూడా అరెస్టు చేయాలంటూ పోలీస్ స్టేషన్లో చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ ఆందోళనకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు,మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య, మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పగడాల నాగరాజు, చంద్రావతి, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వి. కోటేశ్వరరావు, వై. ప్రకాష్, బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, కార్మిక సంఘాల నాయకులు శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జి. రామయ్య, యర్రా శ్రీనివాస్, మెరుగు సత్యనారాయణ, అశోక్, నరాల నరేష్ నాయుడు, ఎండివై పాషా తదితరులు నేతృత్వం వహించారు.

## ఫిలిం డాన్సర్స్ అసోసియేషన్ ఉపఎన్నికల ఫలితాలు

**హైదరాబాద్, అగస్టు 10, ప్రభాతవార్త:** హైదరాబాద్ వేదికగా తెలుగు ఫిలిం టీవీ డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (ఐఎఫ్టిడిడిఎ) ఉప ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి. అయితే, టాలీవుడ్ పెద్దలు వద్దని వారించినా నిర్వహించిన ఈ ఎన్నికలు పరిశ్రమలో తీవ్ర వివాదానికి దారితీశాయి. ఉప ఎన్నికల ఫలితాలను కార్మిక శాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్, లీగల్ అడ్వైజర్ వి. సామ్రాట్ అశోక్ కుమార్ అధికారికంగా వెల్లడించారు. ప్రధాన కార్యదర్శి (జనరల్ సెక్రటరీ)గా బి. బాలకృష్ణ (బాలు. బి - కార్డ్ నెం. 426) 68 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు.కోశాధికారి (ట్రెజరర్)గా పి ఇశ్రాయేలు (తడివేలు - కార్డ్ నెం. 212) 79 ఓట్లు సాధించి, 34 ఓట్లు పొందిన బి. వీరస్వామిపై 45 ఓట్ల వ్యత్యాసంతో గెలుపొందారు. అలాగే మహిళా కమిటీ సభ్యుల్లో కె నిరంజని (కార్డ్ నెం. 234 - 79 ఓట్లు), సిహెచ్ సాయి లక్ష్మి (కార్డ్ నెం. 325 - 65 ఓట్లు) విజేతలుగా నిలిచారు. పోటీలో ఉన్న టి శ్రావణ సంధ్యకు 59 ఓట్లు వచ్చాయి. ఇక ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉపాధ్యక్షునిగా పోటీ చేసిన బి. శంకర్ (కార్డ్ నెం. 53), జాయింట్ సెక్రటరీగా పి నాగ మల్లేశ్వర్ రావు (కార్డ్ నెం. 481), ఆర్గనైజింగ్ సెక్రటరీగా పోటీ చేసిన జి రవితేజ (బన్ని - కార్డ్ నెం. 481), ఈసీ కమిటీ సభ్యులుగా పి కన్నయ్య (కార్డ్ నెం. 177), ఎం రమేష్ (చరణ్ - కార్డ్ నెం. 500), ఎం రాములు (కార్డ్ నెం. 531), బి వెంకన్న (కార్డ్ నెం. 415) ఎనికయ్యారు.

## బొగ్గు నిల్వలు 20 శాతం తగ్గుదల

**విద్యుత్ ప్లాంట్ల వద్ద 37 మిలియన్ టన్నుల స్టాక్**

**వచ్చే నెలాఖరుకు 24 నుండి 30 మిలియన్ టన్నులు**

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** దేశంలోని థర్మల్ ప్లాంట్ల వద్ద బొగ్గు నిల్వలు పడిపోతున్నాయి. సెప్టెంబర్ చివరి నాటికి విద్యుత్ ప్లాంట్ల వద్ద బొగ్గు నిల్వలు 20 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. తక్కువ కాలానుగుణ సరఫరా, లోటు రుతుపవనాల కారణంగా పెరిగిన డిమాండ్ మరియు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతల మధ్య, విద్యుత్ ప్లాంట్ల వద్ద బొగ్గు నిల్వలు ప్రస్తుతం ఉన్న సుమారు 37 మిలియన్ టన్నుల నుండి సెప్టెంబర్ చివరి నాటికి 24 నుండి 30 మిలియన్ టన్నులకు పడిపోతాయని అంచనా వేస్తున్నట్లు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. శీతలీకరణ డిమాండ్ కారణంగా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఉన్నత స్థాయిలో ఉన్న ఉత్పాదక యూనిట్లలోని నిల్వలు తగ్గినప్పటికీ, ఇటీవలి నెలల్లో థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు సరఫరా పెరిగింది. ఏప్రిల్ 1 నాటికి 59.3 మిలియన్ టన్నుల మేర ఉన్న నిల్వలు విద్యుత్ ప్లాంట్ల వద్ద నిల్వలు ఈ నెల 7వ తేదీన 37.2 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. ఇదే కాలంలో రోజుకు సగటున 376 ర్యాక్లను లోడ్ చేయగా, ఈ నెలలో ఆ సంఖ్య 436కు పెరుగుదల చోటు చేసుకుంది. జూన్ నుంచి లోడింగ్లో పెరుగుదల మరింత స్పష్టంగా కనిపిస్తోంది. 2025లోని ఇదే నెలల్లో సగటు రోజువారీ లోడింగ్ వరుసగా 441, 443, 414 మరియు 362 ర్యాక్లు ఉండగా, ఏప్రిల్లో 426 ర్యాక్లు, మేలో 442, జూన్లో 444, జూలైలో 434 ర్యాక్లుగా ఉంది.

# పంద్రాగస్టు రోజు సంక్షేమ పథకాల వెల్లువ

**కొత్తగా 4 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్**

**5 లక్షల నూతన కుటుంబాలకు గ్యాస్ సబ్సిడీ**

**2.25 లక్షల మందికి కొత్తగా పెన్షన్ల మంజూరు**

**గిగ్ వర్కర్ల కోసం కొత్త చట్టం అమలు**

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** సంక్షేమ పథకాలను విస్తరించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ఈ ఏడాది దసరా పండుగను ఘనంగా నిర్వహించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో పాటు, వివిధ పథకాలకు కొత్త లబ్ధిదారులను చేర్చాలని, అలాగే ఇప్పటికే ఉన్న సంక్షేమ చర్యలను మరింత విస్తరించాలని సర్కార్ నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం దసరా పండుగకు ముందు ఉచిత విద్యుత్, కొత్త పెన్షన్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, గ్యాస్ సబ్సిడీలు, గిగ్ వర్కర్ల కోసం కొత్త చట్టం వంటి సంక్షేమ పథకాలను విస్తరించడంతో పాటు, కీలకమైన ఆరోగ్య సంరక్షణ మరియు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. రాష్ట్రంలో కొత్తగా 3 నుండి 4 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ను అందించనుంది. ప్రస్తుతం, సుమారు 50 లక్షల కుటుంబాలు ఈ ఉచిత విద్యుత్ పథకం కింద ప్రయోజనాలను పొందుతున్నాయి. తాజాగా కొత్త రేషన్ కార్డుదారుల చేరికతో, ఈ పథకం కింద మరో 3 లక్షల నుండి 4 లక్షల అదనపు కుటుంబాలకు విద్యుత్ సబ్సిడీలు అమలు కానుంది, తద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఉపశమనం లభించనుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, బీడీ, గీతా కార్మికులు, నేత కార్మికులతో సహా సుమారు 41 లక్షల మందికి నెలవారీ పింఛన్లు అందిస్తోంది. తాజాగా ఈ పెన్షన్ పథకం మరి కొందరికి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తలసేమియా, సికిల్ సెల్ అనీమియా రోగులకు కూడా పింఛన్లను మంజూరు చేయనుంది. ఈ నిర్ణయం వల్ల 11 వర్గాలకు చెందిన సుమారు 2.25 లక్షల మంది లబ్ధి పొందనున్నారు. ఈ అదనపు పింఛను భారం వల్ల ఖజానాపై ఏటా సుమారు రూ.500 కోట్ల భారం పడుతుంది. అలాగే తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద సిలిండర్కు రూ.500 గ్యాస్ సబ్సిడీతో అదనంగా మరో సుమారు 5 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 42.90 లక్షల కుటుంబాలు ఈ పథకం ప్రయోజనాలను పొందుతున్నాయి. స్మార్ట్ రేషన్ కార్డులు పొందే దాదాపు 5 లక్షల కొత్త కుటుంబాలు కూడా గ్యాస్ సబ్సిడీలను అందుకుంటాయి. కాగా ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల మందికి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేయనుంది. ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లాలో జరిగే మధ్యాహ్న భోజన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను విడుదల చేయనున్నారు. రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాలన్నింటిలోనూ ఇలాంటి కార్యక్రమాలే నిర్వహించబడతాయి. గత రెండున్నర సంవత్సరాలలో, ప్రభుత్వం 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులను జారీ చేసింది. మొత్తంగా, రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య 1.05 కోట్లకు చేరుకుంది. స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల సుమారు 3.42 కోట్ల మంది ప్రజలు ప్రయోజనం పొందుతారు. ట్యాంపర్ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు ట్యాంపర్ ప్రూఫ్గా ఉంటాయి.

జిల్లా స్థాయిలో లబ్ధిదారుల జాబితాను సరిచూడాలని ప్రభుత్వం కలెక్టర్లందరినీ కోరింది. అసౌకర్యాన్ని నివారించడానికి సీనియర్ సిటిజన్లు మరియు దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, సీనియర్ సిటిజన్లు మరియు దివ్యాంగుల కోసం సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఫిర్యాదుల పరిష్కార కమిటీలను కోరారు. ఇంకా, సందేహాలను నివృత్తి చేయడానికి మరియు రేషన్ కార్డుల పంపిణీకి అత్యున్నత స్థాయి అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. మరోపక్క ఆగస్టు 15 నుండి గిగ్ వర్కర్ల కోసం కొత్త చట్టం తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి గిగ్ వర్కర్ల సంక్షేమం, భద్రత కోసం ఒక కొత్త చట్టాన్ని తీసుకురానుంది. ఫుడ్ డెలివరీ, క్యాబ్ అగ్రిగేటర్ సేవలలోని కార్మికులకు ఈ చట్టాన్ని అమలు చేసేందుకు మార్గదర్శకాలను కూడా రూపొందిస్తున్నారు. దసరా నాడు టిమ్స్ ప్రారంభోత్సవం సంక్షేమ పథకాలతో పాటు, దసరా కోసం ప్రభుత్వం అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్టులను సిద్ధం చేసింది. సనత్నగర్లోని తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆగస్టు 15న ప్రారంభం కానుంది. ఉస్మానియా ఆసుపత్రి, నిమ్స్ ప్రాజెక్టులను కూడా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. మూసీ, గాంధీ సరోవర్, ఫ్యూచర్ సిటీ పునరుజ్జీవనంపై దృష్టి పెట్టండి ప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనంపై దృష్టి సారిస్తోంది. ఈ ప్రాజెక్ట్ తుది నిధుల దశలోకి ప్రవేశించడంతో పనులు వేగవంతం చేయబడ్డాయి. అంతేకాకుండా, మూసీ పునరుజ్జీవన పనులలో భాగంగా గాంధీ సరోవరం నిర్మాణం కూడా జరగనుంది. దసరా ఉత్సవాల సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ను కూడా చేపట్టి ప్రారంభించాలని ప్రతిపాదించారు.

## ఇందిరమ్మ ఇళ్లు టవర్స్ దరఖాస్తు గడువు పొడిగింపు

**15 వరకు స్వీకరణ**

**ఇప్పటివరకు 46,121 దరఖాస్తులు**

**వరుస సెలవుల నేపథ్యంలో మరో 5 రోజులు అవకాశం**

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 10:** హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ పథకంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆగస్టు 15వ తేదీ శనివారం వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చి, నామమాత్రపు ధరలోనే పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకం ద్వారా లక్ష ఇళ్లను నిర్మిస్తున్నామని, అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు టవర్స్పై ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే రెండో శనివారం, బోనాల పండుగ తదితర వరుస సెలవుల కారణంగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా గడువు పొడిగించాలంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో 5 రోజుల పాటు పొడిగించి ఆగస్టు 15 వరకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. తొలుత ప్రకటించిన ప్రకారం దరఖాస్తుల స్వీకరణ గడువు (ఆగస్టు 10), సోమవారం వరకు ఉండింది. గత నెల జూలై 21వ తేదీ నుంచి మీసేవా కేంద్రాలతో పాటు ఆన్లైన్ ద్వారా, మీసేవా వాట్సాప్ సేవ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సోమవారం సాయంత్రం నాటికి మొత్తం 46,121 దరఖాస్తులు అందినట్లు మంత్రి తెలిపారు.



వరుసగా సెలవులు రావడంతో మరింత మంది అర్హులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో గడువు పొడిగించినట్లు మంత్రి పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచినప్పటికీ, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, కేటాయింపు, లాటరీ తదితర ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెలాఖరు నాటికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై దరఖాస్తుదారులు ఎటువంటి అపోహలు, అనుమానాలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తులు:-అంబర్పేట-3,073, బహదూర్పుర-1,706, ఇబ్రహీంపట్నం-1,031, కార్వాన్ -2,184, ఖైరతాబాద్ -5,518, కూకట్పల్లి-6,615, మహేశ్వరం -734, మలక్పేట -3,609, మల్కాజిగిరి- 1,333, మేడ్చల్-1,668, నాంపల్లి-4,372, కుత్బుల్లాపూర్-5,571, రాజేంద్రనగర్-2,060, సనత్నగర్-1,404, సికింద్రాబాద్ (కంటోన్మెంట్)-1,755, శేరిలింగంపల్లి-3,488, మొత్తం: 46,121 దరఖాస్తులు వచ్చాయి.

## లీజు డాక్యుమెంట్ల ఫోర్జరీ

**రూ.5 కోట్ల హోటల్ స్వాధీనం**

**రాయదుర్గంలో ఏడుగురిపై కేసు నమోదు**

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 10, ప్రభాతవార్త:** హోటల్ వ్యాపారంలో భాగస్వాములు లీజు డాక్యుమెంట్లను ఫోర్జరీ చేయడంతో పాటు 5కోట్ల రూపాయల విలువైన హోటల్ ఆస్తులు, సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారని ఎలెవెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కాంతిదత్ రాయదుర్గం పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు ఏడుగురి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పిర్యాదుదారు ప్రకారం ఇలా ఉన్నాయి. ఎలెవన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నామి పాటిస్సెరి, దక్షింకత పేర్లతో రెస్టారెంట్లు, బేకరీలను కాంతిదత్ నిర్వహిస్తున్నాడు. ఈమేరకు ఖాజా గూడలో హోటళ్ల ఏర్పాటు కోసం 2023లో ఓ భవన యజమానితో లీజు అగ్రిమెంటు చేసుకున్నాడు. నూతనంగా ఏర్పాటు చేయనున్న హోటళ్లలో భాగస్వామ్యం కోసం అదే సంవత్సరం జూన్లో సౌజన్య జూపల్లికి చెందిన సంస్థను సంప్రదించి ఎంఓయు చేసుకున్నాడు. ఎంఓయులో భాగంగా ఖాజాగూడలోని నామి పాటిస్సెరి ఔట్లెట్లో 35శాతం వాటా కోసం 1కోటి రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు సౌజన్య అంగీకరించారని పిర్యాదుతో తెలిపారు. ఖాజాగూడలో రెస్టారెంట్ల ఏర్పాటు కోసం లీజు అడ్వాన్సు, ఇంటీరియర్, యంత్రాలు, పరికరాలకు కలిపి మొత్తం 5కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టినట్లు పిర్యాదులో పేర్కొన్నారు. వీటి నిర్వహణ బాధ్యతలను సౌజన్య జూపల్లికి అప్పగించగా, ఆమె అక్షయ్ నాగ్, సుమంత్ మునుకొండ, దీపికా రాజు, సర్దార్ నైనిహాల్సింగ్, నూనె రామరుద్ర, నూనె సునీతలతో కలిసి కుట్రకు పాల్పడ్డారని వాపోయారు. తన అనుమతి లేకుండా లీజు డాక్యుమెంట్లను ఫోర్జరీ చేయడంతో పాటు రూ. 5 కోట్ల పెట్టుబడి పెట్టిన హోటల్ను కబ్జా చేశారని పిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కోటి 31 లక్షల వయోజనుల ఓటుహక్కుపై అనిశ్చితి

**పిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజ్కుమార్**

**హైదరాబాద్,ఆగస్టు 10,ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర జాబితా సరవణలో ఒక కోటి 31లక్షల వయోజనుల ఓటు హక్కుపై అనిశ్చితి కలిగించేలా ఎన్నికల కమీషన్ వ్యవహరిస్తోందని టిపిసిసి ఎలక్షన్ కమీషన్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజ్కుమార్ ఆరోపించారు. గాంధీభవన్లో సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఏనుమేరేషన్ ఫేస్ సోమవారంతో ముగిసిందని ఆదివారం వరకు నమోదైన వివరాలు ఎలక్షన్ కమిషన్ ప్రకారం 72,21,419 ఎనిమరేషన్ ఫామ్ భర్తీ చేయలేదు. 61,14,754 అనోమలీస్ ఓటర్లుగా గుర్తించారు. 2,84,021 ఏ ఎస్ డి డి లిస్టులో ఉన్నారు ఒకే లాంటి వ్యక్తిగత వివరాలతో వేరువేరు చోట్ల నమోదైనవారు(డిఎస్ఇ) 3,18,598 మంది ఉన్నారు. ఈ గణాంకాలను చూశాక కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్ ని ఉపయోగించి ఓట్ చోరీకి పాల్పడుతుందని అనుమానం కలుగుతోందని అన్నారు. తెలంగాణలో ఇప్పటివరకు ఉన్న 3 కోట్ల 38 లక్షల ఓటర్ల నుండి 1 కోటి 31 లక్షల ఓట్లను అనుమానంలో పెట్టినట్టు కనిపిస్తోందనీ అన్నారు. ఇందులో నుండి సుమారు 75 లక్షల ఓట్లను 17 తేదీన విడుదల చేసి ముసాయిదా ఓటర్జాబితాలో నుండి తక్షణమే తొలగించడం జరుగుతుందనీ చెప్పారు. రాష్ట్రంలో పేదలు, బడుగు బలహీన ప్రజలందరూ కాంగ్రెస్ వైపు ఉన్నారని ఎలాగైనా వీళ్ళని కాంగ్రెస్ నుంచి దూరం చేయాలని కేంద్ర ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్ ని ఉపయోగించి ఓట్ చోరి చేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికలలో గెలువనీయొద్దని కుట్ర పడుతున్నట్టు మా అనుమానం అనుమానం కలుగుతోందని ఈ ప్రక్రియలో అర్హులైన నిజమైన ఒక్క ఓట తొలగించిన ఎలక్షన్ కమిషన్, కేంద్ర ప్రభుత్వమే బాధ్యతలు తీసుకోవాలనీ హెచ్చరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన హర్ ఘర్ తిరంగా వేడుకలు

**ప్రధాని మోడీ పిలుపుతో ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన బిజెపి నాయకులు**

**తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన కేంద్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు10:** ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా అభియాన్ తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ఉత్సాహంగా, దేశభక్తి పూరిత వాతావరణంలో ప్రారంభమైందని హర్ ఘర్ తిరంగా యాత్ర బిజెపి రాష్ట్ర కార్యనిర్వాహక కన్వీనర్, బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. మేకల శిల్పారెడ్డి గారు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు వారి కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇండ్లపై జాతీయ జెండాను అత్యంత గర్వంగా ఆవిష్కరించి ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు.

ఈ వేడుకల్లో భాగంగా, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్రావు తార్నాకాలోని తన నివాసంలో జాతీయ జెండాను ఎగురవేసి, మన త్రివర్ణ పతాకం దేశ ప్రగతికి, వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ ఏడాది ఈ ఉద్యమాన్ని వందేమాతరం 150 ఏళ్ల వేడుకలకు అంకితం చేయడం ఎంతో ప్రత్యేకమైనదని, ఇది భారతావని ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్లోని తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, ప్రధాని మోదీ గారి పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి హర్ ఘర్ తిరంగాను గర్వంగా, దేశభక్తి వేడుకగా జరుపుకోవాలని కోరారు.

తన నివాసంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని తమ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. బిజెపి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్,నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి న్యూఢిల్లీలోని తమ నివాసాలలో మువ్వన్నెల జెండాను ఎగురవేసి, దేశభక్తి స్ఫూర్తిని చాటుతూ ఈ ప్రచారంలో భాగస్వాములయ్యారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు,ఎంపీ డీకే అరుణ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి, జెండాతో సెల్ఫీ తీసుకుని వందేమాతరం గీతంతో కలసి వెబ్సైట్లో అప్లోడ్ చేయడం ద్వారా ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా.ఎన్. గౌతం రావు, తూళ్ల వీరేందర్ గౌడ్ కూడా తమ ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించి, హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

శాసనసభ్యుల భాగస్వామ్యంలో భాగంగా, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తమ ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తన నివాసంలో జాతీయ జెండాను ఎగురవేసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ప్రధాని మోదీ పిలుపు మేరకు తమ నివాసంపై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు.

# హైదర్షాకోట్లో కారు బీభత్సం

**మద్యం మత్తులో కారు నడిపిన దుండగులు**

**ఆర్మీ జవాన్ దుర్మరణం, మరొకరి పరిస్థితి విషమం**

**ఘటనా స్థలంలోనే కారు వదిలి పారిపోయిన నిందితులు**

**నలుగురిని అరెస్టు చేసిన నార్సింగి పోలీసులు**

**హైదరాబాద్ (నార్సింగి), ఆగస్టు 10, ప్రభాతవార్త :** రాజధాని నగరశివారు ప్రాంతమైన హైదర్షాకోట్లో సోమవారం ఉదయం ఓ కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడుపడం వల్లనే ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మాజీ జవాన్ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు వివరించారు. కలకలం సృష్టించిన ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం హైదర్షాకోట్లోని ఎస్ఎంపి పాఠశాల సమీపంలో అతివేగంగా దూసుకువచ్చిన ఓ కారు(టిఎస్ 07 జెఎస్ 0407) ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఆర్మీ జవాన్ రవీందర్ ను ఢీకొంది. ఆ తరువాత ముందున్న మరో ద్విచక్ర వాహనంను, ఓ షాపు మెట్లను ఢీకొట్టింది. ఆర్మీ జవాన్ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందగా, మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, అతడి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు వివరించారు. ఈ ప్రమాదానికి కారకులైన కారులోని వ్యక్తులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారికి తక్షణ వైద్య సహాయం అందించకుండా, కారును లాక్ చేసుకొని పారిపోయినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. కారులో పోలీసులకు మద్యం బాటిళ్లు లభించాయి. మద్యం మత్తులోనే కారు నడుపడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు వివరించారు. సంఘటనా స్థలంలో లభించిన సిసి ఫుటేజీ ఆధారంగా ప్రమాదానికి కారకులైన హైదర్షాకోట్కు చెందిన ఉప్పరి వీరేష్(23), శంషాబాద్కు చెందిన బబ్బూరు క్రాంతిగౌడ్ అలియాస్ బంటి(31), హైదర్షాకోట్కు చెందిన కూన వికాస్ గౌడ్(25), చందన్ యాదవ్ (26)లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరికి పరీక్షలు జరుపగా నలుగురు మద్యం సేవించనట్లు నిర్ధారణ అయ్యిందని పోలీసులు పేర్కొన్నారు. వీరిపై మద్యం సేవించి ర్యాష్ డ్రైవింగ్ చేయడం, ప్రమాదంలో గాయపడ్డ వారికి తక్షణ వైద్య సహాయం అందించకపోవడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు వివరించారు.



ఆర్మీ జవాన్ రవీందర్ (ఫైల్)

# ఢిల్లీలో నకిలీ కాల్సెంటర్లపై టిజిసిఎస్బి దాడులు

**తెలుగు రాష్ట్రాల వారిని టార్గెట్ చేస్తూ మోసాలు**

**21 మంది మహిళా టెలికాలర్లతోపాటు**

**మరో వ్యక్తి అరెస్టు.. పరారీలో అసలు నిందితులు**

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల వారిని టార్గెట్ చేస్తూ ఢిల్లీలో కొనసాగుతున్న మూడు నకిలీ కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్బి) సోమవారం నాడు దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా కాల్ సెంటర్ల నిర్వాహకులు పారిపోగా తెలంగాణకు చెందిన 21 మంది తెలుగు మాట్లాడుతున్న టెలికాలర్లను, కాల్ సెంటర్ల తరపున బ్యాంకు ఖాతా కలిగిన మరో వ్యక్తిని అరెస్టు చేశారు.


దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్ మీడియాకు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మం దిని ఢిల్లీ కేంద్రంగా కొనసాగుతున్న కాల్ సెంటర్ల నుంచి కొందరు వ్యక్తులు మోసం చేస్తున్న విషయం టిజిసిఎస్బి దృష్టికి వచ్చింది.

ప్రముఖ కంపెనీల నుంచి తక్కువ వడ్డీకి వాయిదా పద్దతులపై గృహోపకరణ వస్తువులు ఇప్పిస్తామని, బ్యాంకుల నుంచి రుణం వచ్చేలా చూస్తామని ఆ శపెడుతూ కొందరు టెలికాలర్లు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారికి ఫోన్లు చేస్తూ ప్రాసెసింగ్ ఫీజు కింద వేల రూపాయల నుంచి లక్షలాది రూపాయలను వసూలు చేసి, ఫోన్లు స్విచాఫ్ చేస్తున్నారు. దీనికి సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో అనేకచోట్ల ఫిర్యాదులు అందాయి. దీనిపై వివరాలు సేకరించిన టిజిసిఎస్బి అధికారులు ఢిల్లీలో మకాం వేసి సమాచారం సేకరించారు.

అనంతరం ఢిల్లీలోని శివ మార్కెట్ ప్రాంతంలో గల ఈ కాల్ సెంటర్లపై సోమవారం ఉదయం దాడులు చేశారు. దాడుల సందర్భంగా మూడు కాల్ సెంటర్ల నిర్వాహకులు లలిత్ సింగ్, కుల్దీప్ సిం గ్, అనిల్ పారిపోయారు. ఈ కాల్సెంటర్లలో టెలికాలర్లుగా పనిచేస్తున్న 21 మంది మహిళా టెలికాలర్లను అరెస్టు చేశారు. వీరంతా జగిత్యాల లోని కోరుట్లతో పాటు నగరంలోని సైదాబాద్, బోరబండ ప్రాంతానికి చెందిన వారుగా తేలింది.

వీరంతా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు. తెలుగు మాట్లాడడం బాగా నేర్చిన వారుగా తేలింది. తమ మాటలతో వీరు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిని మోసం చేస్తూ కాల్ సెంటర్ల నిర్వాహకులకు లాభాలు తెచ్చిపెడుతున్నట్లు టిజిసిఎస్బి అధికారుల విచారణలో తేలింది. కాగా శివమార్కెట్లో గల మొదటి కాల్ సెంటర్ యజమాని లలిత్ సింగ్గా తేలింది. ఇతను బిహార్కు చెందినవాడు. ఇతని కాల్ సెంటర్లో జయమాల (29), పూనం (22), దుర్గ (35). ఆర్తి (20), లత (30) పట్టుబడ్డారు. రెండవ కాల్ సెంటర్ శివమార్కెట్లోనే వుండగా దీని యజమాని కుల్దీప్ సింగ్గా తేలింది. ఇతను కూడా బిహార్కు చెందిన వాడు. ఇతని కాల్ సెంటర్లో తన్నీరు సంధ్య (32), కమ్మం లత (40), మీను (22), చామంతి (34), బాల (40), కళావతి (24), శారద (38), రాధ (26), సరోజన (30) పట్టుబడ్డారు. మూడవ కాల్ సెంటర్ కూడా ఇదే ప్రాంతంలో వుండగా దీని యజమాని ఢిల్లీకి చెందిన అనిల్గా తేలింది. ఈ కాల్ సెంటర్లో శశి (42), తులసి (34), రాధ (40), పద్మ (30), విజయలక్ష్మి (36), పూజ (30)తో పాటు బ్యాంకు ఖాతా కలిగిన తెలంగాణ వాసి గురునాథ్ (30) పట్టుబడ్డారు. ఈ గోల్మాల్ వ్యవహారంపై విచారణ చేస్తున్నారు.

## వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో పూజా ఓటమి



**న్యూఢిల్లీ:** మహిళల హైజంప్ ఫైనల్‌లో జాతీయ సీనియర్ రికార్డు హోల్డర్ పూజా సింగ్ ఓటమితో ఏడవ స్థానంలో నిలవడంతో, భారత్ తన ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్ ప్రచారాన్ని మూడు పతకాలతో(2 రజత, 1 కాంస్య) ముగించింది. ఈ ఏడాది ఆరంభంలో 1.93 మీటర్ల జాతీయ సీనియర్ రికార్డు నెలకొల్పిన 19 ఏళ్ల ఆ క్రీడాకారిణి, అగ్రశ్రేణి పోటీదారులలో ఒకరిగా ఈ పోటీలోకి ప్రవేశించింది. అయితే, ఫైనల్‌లో ఆమె 1.84 మీటర్లు మాత్రమే సాధించగలిగింది, ఆ తర్వాత 1.87 మీటర్ల వద్ద చేసిన మూడు ప్రయత్నాలలోనూ విఫలమైంది. దీంతో ఆస్ట్రేలియాకు చెందిన ఇజోబెల్ లూయిసన్‌రో 1.92 మీటర్ల ఎత్తును అధిగమించి స్వర్ణం గెలుచుకోగా, హంగేరికి చెందిన లిలియానా బటోరి, స్పెయిన్‌కు చెందిన ఐటానా అలోన్సో 1.90 మీటర్ల ఎత్తును అధిగమించి మిగిలిన పోడియం స్థానాలను పంచుకున్నారు. కాగా భూమిక నెహటే, తహురా ఖాతున్, తను చౌదరి, థియా అరుముగంలతో కూడిన భారత మహిళల 4న400 మీటర్ల రిలే క్వార్టెట్ ఫైనల్‌లో 3:45.28 సమయంతో తొమ్మిదవ స్థానంలో, చివరి స్థానంలో నిలిచింది. యునైటెడ్ స్టేట్స్ 3:29.15 సమయంతో స్వర్ణం గెలుచుకోగా, ఆస్ట్రేలియా 3:31.39 సమయంతో రజతం, గ్రేట్ బ్రిటన్ 3:32.08 సమయంతో కాంస్యం గెలుచుకున్నాయి. అంతకు ముందు పురుషుల జావెలిన్ త్రోలో ఆశిష్ యాదవ్ రజతంతో దేశానికి ఖాతా తెరవగా, పురుషుల హైజంప్‌లో బసంత్ కుమార్ మేఘ్వాల్ మరో రజతం గెలుచుకున్నాడు. పురుషుల లాంగ్‌జంప్‌లో షానవాజ్ ఖాన్ కాంస్యం సాధించాడు.

### బల్లారట్ స్క్వాష్ ఓపెన్‌లో
## రన్నరప్‌గా సాన్య




**న్యూఢిల్లీ:** పిఎస్ఎ ఉమెన్స్ ఛాలెంజర్ టూర్ 3 ఈవెంట్ అయిన 2026 బల్లారట్ ఓపెన్ ఫైనల్లో, సాన్యా వాట్స్ పరాజయంతో టోర్నీ నుండి నిష్క్రమించింది. ఆస్ట్రేలియాలోని విక్టోరియాలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో 24 ఏళ్ల రెండో సీడ్ క్రీడాకారిణి, టాప్ సీడ్, స్వదేశీ అభిమాన క్రీడాకారిణి అయిన సారా కార్డ్‌వెల్ చేతిలో 24 నిమిషాల్లో 6-11, 8-11, 6-11 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. గత వారం విక్టోరియా ఓపెన్ ఛాలెంజర్ 6కె ఈవెంట్ 2026లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత, ఈ నెలలో ఆమెకు ఇది వరుసగా రెండవ ఫైనల్. పాకిస్థాన్‌కు చెందిన వజీహా అల్తాఫ్ వాకోవర్ ఇవ్వడంతో ఆమె రెండో రౌండ్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత దక్షిణ కొరియా ప్రత్యర్థులపై వరుసగా రెండు విజయాలు సాధించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో, ఆమె సుంగీ ఓహ్‌పై 6-11, 11-9, 12-10, 11-4 స్కోరుతో నాలుగు గేమ్‌ల హోరాహోరీ పోరులో గెలిచింది. ఆ తర్వాత సెమీస్‌లో ఐన్ జున్‌పై 11-5, 11-8, 11-4 స్కోరుతో స్ట్రెయిట్ గేమ్‌లలో విజయం సాధించింది. గత వారం విక్టోరియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత ఏడు స్థానాలు ఎగబాకిన ఆమె, ప్రస్తుతం తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రపంచ ర్యాంకింగ్ అయిన 136వ స్థానంలో ఉంది.




### ప్లేయర్ ఆఫ్ ద మంత్‌లో..
## టీమిండియా స్టార్లకు నో ప్లేస్

**న్యూఢిల్లీ:** ఐసీసీ ప్రకటించిన ప్లేయర్ ఆఫ్ ద మంత్ నామినీస్‌లో టీమిండియాకు చెందిన స్టార్ ప్లేయర్లకు చోటు దక్కలేదు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్, వెస్టిండీస్ ఆల్ రౌండర్ జస్టిన్ గ్రీవ్స్, బంగ్లాదేశ్ బ్యాటర్ తంజిద్ హసన్ జూలై నెల పురుషుల నామినీస్ జాబితాలో ఉన్నారు. ఇంగ్లండ్ పర్యటనలో రాణించకపోవడంతో ఈ జాబితాలో టీమిండియా ప్లేయర్లు ఎవరికీ ప్లేస్ దొరకలేదు. ఇక ఇంగ్లండ్ వైట్‌బాల్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ జూలైలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. భారత్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లలో విశేషంగా రాణించాడు. అతడి కెప్టెన్సీలో ఇంగ్లండ్ భారత్‌పై వన్డే, టీ20 సిరీస్‌లను కైవసం చేసుకుంది. భారత్‌పై విజయాలు, వ్యక్తిగత ప్రదర్శన బ్రూక్‌ను ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు రేసులో నిలబెట్టాయి. అలాగే వెస్టిండీస్ ప్లేయర్ జస్టిన్ గ్రీవ్స్ జూలైలో ఆల్ రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో సెంచరీలతో పాటు, బౌలింగ్‌లో 5 వికెట్ల ఘనత కూడా సాధించాడు. బాంగ్లదేశ్ యువ బ్యాటర్ తంజిద్ హసన్ కూడా ఆ నెలలో వైట్‌బాల్ క్రికెట్‌లో మంచి ప్రదర్శన ఇచ్చాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన తంజిద్ జూలైలలో మరోసారి చూపించి నామినీల్లో చేరేలా చేసుకున్నాడు. కాగా గత నెలలో భారత్ జట్టు ఇంగ్లండ్‌లో ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడింది. కానీ ఈ పర్యటనలో ఆశించిన స్థాయి ప్రదర్శన ఇవ్వలేకపోయింది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో భారత్ టీ20లో ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 0-4తో కోల్పోయింది. వన్డే సిరీస్‌లో భారత్ మంచి ఆరంభాన్నిచ్చి ఇంగ్లండ్‌ను ఓడించినా, తర్వాత వరుసగా ప్రత్యర్థి చేతిలో 2-1తో ఓటమి చెందింది. ఈ సిరీస్‌లో భారత్ తరపున రోహిత్ శర్మ మాత్రమే ఓ వన్డే సెంచరీతో ఆకట్టుకున్నాడు.

## డ్యూరాండ్ కప్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు మోహన్ బగాన్

**న్యూఢిల్లీ:** సహల్ అబ్దుల్ సమద్ మొదటి అర్ధభాగంలో సాధించిన అద్భుతమైన హ్యాట్రిక్‌తో, మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు సిఐఎస్ఎఫ్ ప్రొటెక్టర్స్‌పై 6-0 తేడాతో ఆధిపత్య విజయం సాధించి డ్యూరాండ్ కప్ క్వార్టర్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సహల్ అబ్దుల్ సమద్ తొలి అర్ధభాగంలోనే హ్యాట్రిక్ (17 నిముషం, 19, 37) సాధించి స్టార్‌గా నిలిచాడు. అలాగే మన్వీర్ సింగ్ (24), జేమీ మెక్లారెన్ (68), టెక్చమ్ అభిషేక్ సింగ్ (73) కూడా గోల్స్ చేశారు. ఈ విజయంతో మోహన్ బగాన్ జట్టు 9పాయింట్లతో గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో నిలవగా, సిఐఎస్ఎఫ్ ప్రొటెక్టర్స్ ఒక్క పాయింట్ కూడా లేకుండా టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది. మోహన్ బగాన్, ఆరంభం నుంచే దాడిని ప్రదర్శించింది. అయినప్పటికీ



ప్రొటెక్టర్స్ జట్టు రక్షణ విభాగం పటిష్టంగా నిలిచింది. డెజాన్ డ్రాజిక్ అభిషేక్ సింగ్‌కు అద్భుతమైన పాస్ ఇవ్వడంతో సహల్ గోల్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. ఆ తర్వాత మన్వీర్, టెక్చమ్ అందించిన అద్భుతమైన క్రాస్‌ను నియంత్రించి స్కోరును 3-0కి పెంచాడు. బంతిని అందుకున్న సహల్ అద్భుతమైన రీతిలో తన హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. మోహన్ బగాన్ మొదటి అర్ధభాగంలో 75%బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని ఆధిపత్యం చెలాయించి,విరామసమయానికి 4 గోల్స్ ఆధిక్యంలోకి వెళ్ళింది. మోహన్ బగాన్ చివరకు ఐదవ గోల్ జోడించడానికి ముందు మన్వీర్ మరియు లిస్టన్ గోల్ చేసేందుకు దగ్గరగా వచ్చారు. లిస్టన్‌తో కలిసి ఆడిన టెక్చామ్, బంతిని నెట్ పైకప్పులోకి పంపి ఘన విజయాన్ని పూర్తి చేశాడు.



## సూపర్ జెయింట్స్ కన్నేసిన ముంబయి

### వచ్చే సీజన్‌లో టైటిల్ లక్ష్యంగా ఎంపిక

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ దారుణంగా విఫలమైంది. టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి తీవ్రంగా నిరాశపర్చింది. దాంతో పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఐదు సార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌కు ఇది ఏ మాత్రం స్థాయికి తగ్గ ప్రదర్శన కాదు. జట్టు నిండా స్టార్లు ఉన్నా అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ వైఫల్యం ముంబై పతనాన్ని శాసించింది. ఈ ఘోర పరాజయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముంబై ఇండియన్స్ వచ్చే సీజన్‌లో టైటిల్ గెలవడమే లక్ష్యంగా జట్టును సిద్దం చేస్తోంది. జట్టును వీడాలని నిర్ణయించుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యాను అడ్డుపెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్లను ఇతర జట్ల నుంచి ట్రేడ్ చేసుకునేందుకు ప్రయత్నాలను ప్రారంభించింది. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్, కోల్‌కత్తా నైట్ రైడర్స్‌తో ట్రేడ్ డీల్ గురించి చర్చలు జరిపిన ముంబై ఇండియన్స్ ఇతర ఫ్రాంచైజీలను కూడా సంప్రదించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా లక్నో సూపర్ జెయింట్స్‌కు చెందిన ప్రిన్స్ యాదవ్, మొహ్‌సిన్ ఖాన్‌తో పాటు, నికోలస్ పూరన్‌లపై ముంబై కన్నేసినట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యాను ఇచ్చి ఈ ముగ్గురి ఆటగాళ్లను జట్టులోకి తెచ్చుకోవాలనే ప్రయత్నాల్లో ముంబై ఉన్నట్లు సమాచారం. నికోలస్ పూరన్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముంబై ఫ్రాంచైజీల తరపున ఆడుతాడు. ఐపీఎల్‌లో కూడా అతన్ని తమ జట్టులోకి తీసుకోవాలనే యోచనలో ముంబై మేనేజ్‌మెంట్ ఉంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్‌కు కూడా కెప్టెన్ అవసరం ఉంది. రిషభ్ పంత్ ఆ జట్టును వీడేందుకు సిద్దమైనట్లు తెలుస్తోంది. టీమిండియా మాజీ క్రికెటర్ అశ్విన్ కూడా లక్నోతో ముంబై సంప్రదింపులు జరపవచ్చని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ పాండ్యాకు బదులుగా ప్రిన్స్ యాదవ్, మోహ్‌సిన్ ఖాన్‌తో పాటు నికోలస్ పూరన్‌ను ముంబై అడగవచ్చని అంచనా వేసాడు. లక్నో జట్టుకు కూడా కెప్టెన్ అవసరం ఉందని, హార్దిక్ పాండ్యాను తీసుకోవడం వారికి ప్రయోజనకరంగా ఉంటుందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. అయితే ఒక్క హార్దిక్ పాండ్యా కోసం లక్నో సూపర్ జెయింట్స్ ముగ్గురు స్టార్ ఆటగాళ్లను వదులుకుంటుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అయితే లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, ముంబై ఇండియన్స్ ఓనర్స్ ముఖేష్ అంబానీ మధ్య మంచి వ్యాపారా లావాదేవీలున్నాయి. గత సీజన్‌కు ముందు శార్దూల్ ఠాకూర్‌ను ముంబై ఇండియన్స్ ట్రేడ్ చేసుకుంది. ఈ ట్రేడ్ అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ తరహాలోనే ముంబై తమకు కావాల్సిన ఆటగాళ్లను లక్నో నుంచి తీసుకోవచ్చే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## సెబీ ఆంక్షలపై శాట్ ఆశ్రయించిన జీ ఎంటర్‌ప్రైజెస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** సెక్యూరిటీస్ మార్కెట్‌లో ప్రవేశించకుండా సెబీ విధించిన ఆంక్షలను సవాల్ చేస్తూ జీ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ, సీఈఓ పునీత్ గోయెంకా సెక్యూరిటీస్ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను



ఆశ్రయించారు. అత్యవసర విచారణ, మధ్యంతర ఉపశమనం కోరడంతో ఈ కేసును బుధ వారం విచారించనుంది. తుది తీర్పువెలువడే వరకు మార్కెట్ యాక్సెస్ నిషేధాన్ని నిలిపివేయాలని వారు కోరారు. ప్రమోటర్ గ్రూప్ సంస్థ సన్‌బ్రైట్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు 3,143.5 కోట్ల విలువైన పూర్తిగా కన్వర్టిబుల్ వారెంట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూను కొనసాగించేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. గతనెల 31న సెబీ జీ ఎంటర్‌ప్రైజెస్‌పై రెండు నెలల మార్కెట్ నిషేధం విధించగా, పునీత్ గోయెంకా, ప్రమోటర్ సుభాష్ చంద్రపై 12 నెలల చొప్పున ఆంక్షలు విధించింది.
జీపై రూ.30 లక్షలు, గోయెంకాపై రూ.58 లక్షలు, చంద్రపై రూ.60 లక్షలు జరిమానా విధించింది. జూబ్లీహిల్స్‌లోని జీ ఆస్తిని ఎస్సెల్ గ్రూప్‌కు చెందిన నాలుగు సంస్థలు ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ నుంచి తీసుకున్న సుమారు ..726 కోట్ల రుణాలకు భద్రతగా ఉపయోగించడమే కేసుకు ప్రధాన కారణం.

## ఇంటెల్ షేర్ల పతనం..

### రూ.15 బిలియన్ల సేకరణకు నిర్ణయం

**న్యూఢిల్లీ,ఆగస్టు 10:** చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ కార్పొరేషన్ షేర్లు సోమవారం ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో దాదాపు 5 శాతం పడిపోయాయి. కంపెనీ సుమారు 15 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.1.3 లక్షల కోట్లు సమీకరించేందుకు కొత్తగా షేర్లను జారీ చేయనున్నట్లు ప్రకటించడంతో ఇన్వెస్టర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. గత ఏడాది కాలంలో ఇంటెల్ షేర్ ధర 400 శాతానికి పైగా పెరగడంతో, అధిక విలువల వద్ద తాజా మూలధనాన్ని సమీకరించేందుకు కంపెనీ ఈ అవకాశాన్ని వినియోగించు కుంటోంది. ప్రీ మార్కెట్ ట్రేడింగ్‌లో ఇంటెల్ షేరు 4.67 శాతం క్షీణించి 96.90 డాలర్లకు చేరింది. గత



సెషన్‌లో ఇది 101.65 డాలర్ల వద్ద ముగిసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా టెక్నాలజీ రంగంలో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ, తమ ఉత్పత్తులకు కస్టమర్ల నుంచి డిమాండ్ బలంగా, స్థిరంగా కొనసాగుతోందని ఇంటెల్ తెలిపింది. ఫిజికల్ ఎఐ, కస్టమ్ సిలికాన్, అడ్వాన్స్‌డ్ చిప్ ప్యాకేజింగ్, ఇతర సంస్థల కోసం వాఫర్ తయారీ వంటి విభాగాల్లో గణనీయమైన వృద్ధి అవకాశాలను కంపెనీ గుర్తించింది. కొత్త షేర్ల విక్రయం ద్వారా లభించే నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు, ముఖ్యంగా క్యాపిటల్ వ్యయాలకు వినియోగించనున్నట్లు ఇంటెల్ వెల్లడించింది.




## స్వల్పలాభాలకే సెన్సెక్స్, నిఫ్టీ పరిమితం

**ముంబయి,ఆగస్టు 10:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాలపై ఇన్వెస్టర్లు ఫోకస్ పెంచడంతో సోమవారం దేశీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. గత వారం ప్రవేశపెట్టిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ విధానం చివరి నిమిషాల్లో మార్కెట్లో అధిక అస్థిరతకు కారణం కావడంతో ఇన్వెస్టర్లలో అప్రమత్తత కొనసాగింది. అమెరికా-ఇరాన్ పరిణామాలు, రుతుపవనాల పురోగతిని ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి, దాని ప్రభావంతో ముడిచమురు ధరలు పెరిగే అవకాశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. దీంతో సూచీల లాభాలు పరిమితమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 43.27 పాయింట్లు పెరిగి 78,542.44 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 13.15 పాయింట్లు లాభపడి 24,583.80 వద్ద స్థిరపడింది. ప్రైవేట్ బ్యాంకులు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో కొనుగోళ్లు నిఫ్టీకి మద్దతుగా నిలిచాయి. మరోవైపు పీఎస్‌యూ బ్యాంకులు, చమురు-గ్యాస్ షేర్లలో బలహీనత లాభాలను పరిమితం చేసింది. మిడ్‌క్యాప్ షేర్లలోనూ స్వల్ప లాభాలు నమోదయ్యాయి. బీఎస్ఈ 150మిడ్‌క్యాప్ సూచీ 0.17 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.04 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,225 షేర్లు లాభపడగా, 2,226 షేర్లు నష్టపోయాయి. మరో 207 షేర్లలో మార్పు లేదు. టైటాన్ కంపెనీ 3.02 శాతం కంపెనీ కన్సాలిడేటెడ్ పన్ను తర్వాత లాభం 62.9 శాతం పెరిగి రూ.1,777 కోట్లకు చేరింది. బజాజ్ ఫైనాన్స్ 2.24 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.76 శాతం లాభపడ్డాయి. స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ 8.42 శాతం ర్యాలీ చేసింది. ఏకీకృత నికర లాభం 136.94 శాతం పెరిగి రూ.103.28 కోట్లకు చేరింది. ఆయిల్ ఇండియా 2.30 శాతం పెరిగింది. ఏకీకృత నికర లాభం 252.83 శాతం పెరిగి రూ.2,870.21 కోట్లకు చేరింది. పవర్ మెక్ ప్రాజెక్ట్స్ 3.26 శాతం పడిపోయింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 44 శాతం తగ్గి రూ.79.78 కోట్లకు చేరింది. కేన్స్ టెక్నాలజీ ఇండియా 3.14 శాతం క్షీణించింది. ఆర్తి ఫార్మాల్యాబ్స్, యూనివర్సల్ కేబుల్స్ బలమైన త్రైమాసిక ఫలితాలతో 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. డెల్హివరీ 1.07 శాతం లాభపడింది. సాల్జర్ ఎలక్ట్రానిక్స్ బలహీన లాభదాయకత నేపథ్యంలో 5.58 శాతం పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర 46 సెంట్లు లేదా 0.55 శాతం పెరిగి బ్యారెల్‌కు 84.01 డాలర్లకు చేరింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.3050 వద్ద కొనసాగింది. గత సెషన్‌లో ఇది 95.1750 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ 0.38 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,52,400 వద్ద కొనసాగింది.

## జూలైలో ఇ-వే బిల్లుల జోరు.. 5.98 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ,ఆగస్టు 10:** దేశ ఆర్థిక వ్యవస్థలో వస్తువుల రవాణా, వాణిజ్య కార్యకలాపాలు స్థిరంగా కొనసాగుతున్నాయనడానికి సంకేతంగా గత జులైనెలలో ఈవే బిల్లుల జారీ పెరిగింది. జీఎస్టీ ట్యాక్స్ నెట్‌వర్క్ డేటా ప్రకారం జులైలో 13.979 కోట్ల ఈవే బిల్లులు జారీ అయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో నమోదైన 13.191 కోట్లతో పోలిస్తే ఇది 5.98 శాతం వృద్ధిగారికార్డయింది. ఈ ఏడాది మార్చిలో నమోదైన 14.060 కోట్ల ఈవే బిల్లులే ఇప్పటివరకు అత్యధికం. జూన్‌లో నమోదైన 13.677 కోట్లతో పోలిస్తే జూలైలో ఈవే బిల్లుల జారీ 2.21 శాతం పెరిగింది. అయితే, త్రైమాసిక ప్రాతిపదికన వృద్ధి వేగం కొంత తగ్గింది. ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఈవే బిల్లుల వృద్ధి 15.7 శాతంగా ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అది 12.4 శాతానికి తగ్గింది. రాష్ట్రాల మధ్య రూ.50వేలకు మించి విలువైన సరుకుల రవాణాకు ఈవే బిల్లు తప్పనిసరి. అంతర్రాష్ట్ర రవాణాకు సంబంధించిన ఈ పరిమితి రాష్ట్రాలను బట్టి మారుతూ ఉంటుంది. పన్ను వసూళ్లకు సానుకూల సంకేతాలుశ్రీది ఇండియా భాగస్వామి ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. జూలైలో ఈవే బిల్లుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 5.98 శాతం పెరగడంతో పాటు, నెలవారీగా కూడా వృద్ధి నమోదు కావడం దేశీయ వాణిజ్యం, సరఫరా గొలుసులు పటిష్ఠంగా ఉన్నాయనే విషయాన్ని సూచిస్తోందన్నారు. ఆగస్టు జీఎస్టీ వసూళ్లు కూడా బలంగా ఉండే అవకాశం ఉందని, అయితే తుది ఆదాయం లావాదేవీల విలువ, వాటి స్వభావంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నెలవారీ ఆర్థిక సమీక్షలో ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగాన్ని కొనసాగించింది. దీనికి దేశీయ డిమాండ్‌లోని స్థిరత్వం ప్రధానంగా దోహదపడింది. అయితే కొన్ని హైఫ్రీక్వెన్సీ సూచీలు, ముఖ్యంగా ఈవే బిల్లుల జారీ, తయారీ రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ వృద్ధి వేగంలో కొంత మందగమనాన్ని చూపించాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదే సమయంలో సేవల రంగం మరింత బలపడిందని, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌కు అనుకూల పరిస్థితులు దీనికి మద్దతుగా నిలిచాయని పేర్కొంది.







## రోజుకు రూ.7700 కోట్లు పెరిగిన మస్క్ సంపద

**న్యూయార్క్,ఆగస్టు 10:** ట్రిలియనీర్ ఎలాన్ మస్క్ సంపద ఏడాది కాలంలో భారీగా పెరిగింది. 2025 జులై నుంచి 2026 జులై మధ్య ఆయన సంపద ఏకంగా 320 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.27 లక్షల కోట్లకు పైగాపెరిగింది. రోజుకు సగటున 875 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.7,700 కోట్లు చొప్పున ఆయన సంపద పెరిగినట్లు బెస్ట్‌బ్రోకర్స్ వెల్లడించింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్ జాబితాను ఆధారంగా చేసుకుని అధ్యయనం జరిగింది. 2025 జులై 27న, 2026 జులై 27న ప్రపంచ కుబేరుల సంపదను పోల్చి చూశారు. గత ఏడాది కృత్రిమ మేధ, టెక్నాలజీ రంగాల్లో భారీ వృద్ధి కనిపించింది. దీంతో ఈ రంగాలకు చెందిన పలువురు వ్యాపారవేత్తల సంపద గణనీయంగా పెరిగింది. మస్క్ తర్వాత అత్యధికంగా సంపద పెరిగిన వ్యక్తిగా డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మైఖేల్ డెల్ నిలిచారు. ఆయన సంపద ఏడాదిలో 107.6 బిలియన్ డాలర్లు పెరిగింది. డీప్‌సీక్ వ్యవస్థాపకుడు లియాంగ్ వెన్‌ఫెంగ్ సంపద 2025లో 1బిలియన్ డాలర్ల నుంచి 2026లో 39.5 బిలియన్ డాలర్లకు చేరింది. అంటే ఏడాదిలో ఏకంగా 3,850 శాతం పెరిగింది. దీంతో ఆయన ప్రపంచంలోని టాప్50 కుబేరుల జాబితాలో చేరారు. మస్క్ తొలిసారి 2021లో ఫోర్బ్స్ కుబేరుల జాబితాలోచోటు సంపాదించారు. అప్పటి నుంచి ఆయన సంపద కొత్త రికార్డులు సృష్టిస్తూనే ఉంది.

### నాన్‌లైఫ్ బీమా ప్రీమియం వృద్ధి 5.7%కే పరిమితం

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** దేశంలోని నాన్‌లైఫ్ బీమా సంస్థల స్థూల ప్రత్యక్ష ప్రీమియం వృద్ధి జూలైలో మందగించింది. గత ఏడాది ఇదే నెలలో దాదాపు 16 శాతంగా ఉన్న వృద్ధి, ఈ ఏడాది జూలైలో 5.7 శాతానికి పరిమితమైంది. మల్టీలైన్ సాధారణ బీమా సంస్థల ప్రీమియం వృద్ధి తగ్గడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. నాన్‌లైఫ్ బీమా సంస్థల పరిశ్రమ సంఘం జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ విడుదల చేసిన డేటా ప్రకారం మల్టీలైన్ సాధారణ బీమా సంస్థలు, స్టాండలోన్ హెల్త్ ఇన్సూరర్లు, ప్రత్యేక ప్రభుత్వ రంగ బీమా సంస్థలను కలిపి జూలైలో మొత్తం స్థూల ప్రత్యక్ష ప్రీమియం 31,397.6 కోట్లుగా నమోదైంది. మల్టీలైన్ జనరల్ ఇన్సూరర్ల ప్రీమియం ఏడాది ప్రాతిపదికన 7.7 శాతం పెరిగి 26,335.3 కోట్లకు చేరింది. హెల్త్ ఇన్సూరర్ల ప్రీమియం ఒక్కటే 28.8 శాతం వృద్ధితో 4,666 కోట్లుగా నమోదైంది. అయితే ప్రత్యేక ప్రభుత్వ రంగ బీమా సంస్థల ప్రీమియం 75 శాతానికి పైగా క్షీణించి రూ. 396 కోట్లకు పడిపోయింది. జూన్‌లో నాన్‌లైఫ్ బీమా సంస్థల స్థూల ప్రత్యక్ష ప్రీమియం 27,196.3 కోట్లుగా ఉండగా, వార్షిక వృద్ధి 15.9 శాతంగా నమోదైంది. మేలో ప్రీమియం 24,195 కోట్లుగా, 8.7 శాతం వృద్ధితో నమోదైంది. ఏప్రిల్‌లో 8.4 శాతం పెరిగి 36,417.7 కోట్లకు చేరింది. ప్రముఖ బీమా సంస్థల్లో న్యూ ఇండియా అస్యూరెన్స్ జూలైలో ప్రీమియం 4.5 శాతం పెరిగి రూ.4,322.66 కోట్లకు చేరుకుంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.